www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

16

ప్రకాశం

మంగళవారం 22, ఆగస్టు 2017



ఒంగోలులో సంకల్ప సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి సుజనా చౌదరి



సమన్వయంతో అభివృద్ధి

- అధికారులు, ప్రజాప్రతినిధులకు కేంద్ర మంత్రి సుజనా సూచన
- ప్రజలూ సహకరించాలని విజ్ఞప్తి
- దేశంలోనే వెనుకబడిన జిల్లాల్లో ప్రకాశం ప్రథమ స్థానంలో ఉందని వెల్లడి
- ఒంగోలులో సంకల్ప సిద్ధి సదస్సుకు హాజరు

15లో



టీడీపీలో సుజనాపై గుస్సా

- ప్రజాప్రతినిధులు, నేతలకు సమాచారం లేకుండా జిల్లాకు రాక
- నంద్యాల ఎన్నికల బిజీలో ఉండగా ఒంగోలులో సంకల్ప సిద్ధి సదస్సు
- మంత్రులు, ఎక్కువ మంది శాసనసభ్యులు గైర్హాజరు
- మంత్రి కార్యాలయం నుంచి కూడా సమాచారం లేకపోవడంపై అసంతృప్తి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఒంగోలు

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి.. వీరిలో ఎవ్వరైనా ఏజిల్లాకు వెళ్తే అక్కడి పార్టీ శాసనసభ్యులు, ముఖ్య నేతలకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. ఏమాత్రం అవకాశం ఉన్నా అధికారిక కార్యక్రమాల అనంతరం స్థానికంగా ఉండే పార్టీ కార్యాలయానికి వెళ్లి రావాలి. అక్కడ పార్టీ నాయకులను కూడా కలిసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇది టీడీపీ విధివిధానం. దీన్ని సాధారణంగా అందరూ అవలంబిస్తుంటారు. కానీ కేంద్ర మంత్రి సుజనాచౌదరి మాత్రం ఈ విధానానికి తిలోదకాలివ్వడం

మిగతా 15వ పేజీలో



చీమకుర్తి నగర పంచాయతీ కార్యాలయం

ఆరేళ్లయినా అగచాట్లే

- నాలుగింటికి నగర పంచాయతీ హోదా వచ్చినా కనిపించని పురోగతి
- శాశ్వత అభివృద్ధి చర్యలు కరువు
- ప్రజలను వేధిస్తోన్న తాగునీటి సమస్య

2లో

జిల్లాలో నాలుగింటికి నగర పంచాయతీల హోదా వచ్చినా సమస్యలు విలయతాండవం

సీసీరోడ్లు, కాలువలు, ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటుతోనే సరి

జిల్లాలో చీమకుర్తి, గిద్దలూరు, కనిగిరి, అద్దంకిలకు నగర పంచాయతీ హోదా వచ్చి మంగళవారంతో ఆరేళ్లు పూర్తయ్యాయి. పట్టణాల అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. అన్ని చోట్ల సమస్యలు వెక్కిరిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా

ప్రధానంగా వేధిస్తున్న తాగునీటి సమస్య

పట్టణ స్థాయి అభివృద్ధి రూపకల్పనలో వెనుకబాటు

ఆరేళ్లయినా అగచాట్లే

తాగునీటి సమస్య బాగా ఇబ్బందిగా మారింది. సీసీరోడ్లు, మురుగు కాలువలు, ఎల్‌ఈడీ బల్బులు, హైమాస్ట్ దీపాలు తదితర పనులు తప్ప శాశ్వత అభివృద్ధి ఎక్కడా జరగలేదు. మున్సిపాలిటీలు అయితే దశ మారుతుందని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. పన్నుల మోత తప్ప ఒరిగిందేమీ లేదని వారు విమర్శిస్తున్నారు.

గెలాక్సీపురంలో సమస్యలు ఝరి

చీమకుర్తి : చీమకుర్తి 1985లో మేజర్ పంచాయతీగా.. 2011లో నగరపంచాయతీగా హోదా పొందింది.

✔నగరపంచాయతీ హోదా పొందడంతో ఏటా నిబంధనల మేరకు ప్రభుత్వం నుంచి వచ్చే గ్రానైట్ రాయల్టీ రూ.3 కోట్ల ఆదాయాన్ని చీమకుర్తి పట్టణం కోల్పోయింది.

✔ఇంటి పన్నులు పెంచాక నగర పంచాయతీ మొత్తం రెవెన్యూ ఆదాయం రూ.2.50కోట్ల లోపు ఉంది. సాధారణ ఖర్చులు, పారిశుధ్య కార్మికులు, పార్ట్‌టైమ్ ఉద్యోగులు జీతాల చెల్లింపులకే ఆదాయం అరకొరగా సరిపోతోంది.

✔13, 14వ ఫైనాన్స్ ద్వారా అందిన నిధులు, నాన్‌ప్లాన్ గ్రాంటు, ఎస్‌ఎఫ్‌సి, సబ్‌ప్లాన్ ద్వారా అందిన నిధులతో సీసీరోడ్లు, పైపులైన్, డ్రైనేజి నిర్మాణాలు ఈ ఆరేళ్లలో చేపట్టారు. శాశ్వత నిర్మాణాలకు నిధుల కొరత వేధిస్తోంది.

✔నూతన కార్యాలయ నిర్మాణాలకు స్టార్టప్ గ్రాంటు కింద ప్రభుత్వం రూ. 50లక్షలు మంజూరు చేసింది. స్థల సమస్య వేధిస్తోంది.

✔రూ. 65 కోట్లతో రామతీర్థం నుంచి నేరుగా పట్టణ వాసులకు తాగునీరు అందించే పథక అంచనాల డీఆర్‌పీ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

✔డంపింగ్ యార్డుకూ స్థల సమస్య ప్రతిబంధకంగా మారింది.

✔నగర పంచాయతీ హోదా వచ్చాక శాశ్వతమైన నిర్మాణం అంటే కూరగాయాల మార్కెట్ అని చెప్పవచ్చు.

✔చీమకుర్తి బైపాస్, గంగవరం, నాయుడుపాలెం రోడ్లు, బస్టాండ్ అభివృద్ధి వంటివి మం త్రి శిద్దా సహకారంతో వచ్చేనవే తప్ప మున్సిపాలిటీ హోదా వలన దక్కినవి కాదు.

✔ఎంపీ మాల్యాద్రి ట్యాంకర్, ఇంజన్, సీసీ రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.15 లక్షలు మంజూరు చేశారు.

✔ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి, గెలాక్సీ గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పట్టణ పారిశుద్య పెంపునకు ఫాగింగ్ మిషిన్లు, సామగ్రి, ట్రాక్టర్లు బహూకరించారు. ఇలా దాతలు సహకారంతో నగర పంచాయతీ నెట్టుకొస్తుంది.



దాతల సహకారంతో నిర్మించిన కూరగాయల మార్కెట్

మున్సిపాలిటీ హోదా సేవలు పారదర్శకం

కొత్రపు రాఘవరావు చైర్మన్ నగర పంచాయతీ



మున్సిపాలిటీ హోదా వలన ప్రజలకు సేవలు టెక్నాలజీ సహాయంతో పారదర్శంగా అందుతున్నాయి. సంది దశ దాటితే భవిష్యత్తులో అంత ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నాం.

పేదల జీవితంలో మార్పులేదు

సంగా భాను, ప్రజాసంఘం నాయకులు, చీమకుర్తి



నగర పంచాయతీ హోదా వల్ల పట్టణ పేదలకు ఒరిగింది ఏమీ లేదు. ఒక్కరి జీవితంలో కూడా మార్పురాలేదు. రెండేళ్ల నుంచి అంబేద్కర్ నగర్‌లో తాగునీటి సమస్య వేధిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. పైప్‌లైన్ నిర్మాణం పూర్తికాలేదు.

పన్నుల మోత తప్ప తేడా లేదు

నూకల ప్రకాష్, వ్యాపారి, చీమకుర్తి



నగర పంచాయతీ హోదా వలన పన్నుల మోత తప్ప తేడా ఏమి కనిపించడంలేదు. మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడే బావుంది. లావాదేవీలు క్లిష్టంగా మారాయి. అభివృద్ధి పనులు అనుకున్నంత స్థాయిలో జరగడం లేదు.



పట్టణంలో విశాలంగా నిర్మించిన సీసీ రోడ్డు

అద్దంకిలో అభివృద్ధి పరుగే కానీ..

పబ్లిక్ టాయిలెట్స్, పార్కుల ఏర్పాటులో వెనుకడుగు

కొన్ని కాలనీల్లో వేధిస్తున్న మురుగు

అద్దంకి : అద్దంకి నగర పంచాయతీ హోదా పొందాక సుమారు రూ.15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు.

➡ఇవిగాక ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ నిధులతోపాటు ఇతర మార్గాల ద్వారా వచ్చిన నిధులతో కొన్ని అభివృద్ధి పనులు చేపట్టారు.

➡ప్రధానంగా సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు నిర్మించారు.

➡మంచినీటి సరఫరా కోసం కొత్త పైపులైన్ల నిర్మాణం కూడా చేపట్టారు.

➡స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 946 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించారు.

➡3172 ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు.

➡రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా అభివృద్ధి చేశారు.

➡5 కోట్ల రూపాయల ఎస్‌ఎఫ్‌సీ నిధులతో అన్ని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు.

➡ఇంత వరకు ఒక్క ప్రాంతంలో కూడా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించలేదు.

➡ఒక్క పార్కు కూడా లేదు.

➡కొత్త భవనం లేకపోవడంతో పాత పంచాయతీ కార్యాలయ భవనంలోనే ఇరుకు గదుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రూ.50 లక్షలు అందుబాటులో ఉన్నా స్థల సేకరణ జరగకపోవడంతో భవన పనులు ప్రారంభం కాలేదు.

➡పట్టణానికి శాశ్వత మంచినీటి పరిష్కారం కోసం 85.43 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి డీపీఆర్ పంపినా

గిద్దలూరులో నీటి తిప్పలు

గిద్దలూరు : మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా హోదా పొందినా సమస్యలు తగ్గాల్సింది పోయి పెరగడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. పాలకులు సైతం పంచాయతీ సర్వసభ్య సమావేశాలలో మాట్లాడి తరువాత పట్టించుకోకపోవడంతో ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు.

"ప్రజలకు నిత్యం నీరందించేందుకు ఎన్ని నిధులైనా మంజూరు చేస్తా స్థానికంగా నీరు దొరక్కపోతే దూరం నుంచి అయినా తెప్పించాలని" మున్సిపల్ మంత్రి నారాయణ గిద్దలూరుకు వచ్చి రెండు మూడు సార్లు స్పష్టంగా ఆదేశించినప్పటికీ అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోకపోవడం వారి బాధ్యతారాహిత్యాన్ని తెలియచేస్తోంది.

▲వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కొత్తగా 30 దాకా డీప్ బోర్లు వేశారు. మొత్తం 140 బోర్లు ఉండగా భూగర్భ జలాలు అడుగంటడంతో 100 పనిచేయడం లేదు. మూడింట రెండువంతుల మంది అరకొర నీళ్లతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

▲తాగునీరు, వాడుక నీరు కొనుగోలు చేస్తూ నెలకు సగటున 1500 రూపాయల నుంచి 2 వేల వరకూ అదనంగా వెచ్చిస్తుండడం గమనార్హం.

▲చాలా వీధుల్లో సిమెంట్ రోడ్లు పూర్తయినా మురుగు కాలువలు నిర్మాణం అరకొరగా ఉండడంతో మురుగు సమస్య ఎప్పట్లానే వేధిస్తోంది.

▲పేరుకు రెండు చోట్ల పార్కులున్నా సదుపాయాలు లేకపోవడంతో ఎందుకూ పనికి రాకుండా ఉన్నాయి.

▲పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాలకు నిధులున్నా పనులు మొదలు కాలేదు.

▲జంతువధ కేంద్రాలు లేక నడి బజార్లలో, ఇళ్ల మధ్య మూగజీవాలను కోసి మాంసం విక్రయిస్తున్నా పట్టించుకునేవారులేరు.

▲నగర పంచాయతీ కార్యాలయం నిర్మించకపోవడంతో పాత ఇరుకైన భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

▲చెత్త ఎత్తివేసేందుకు అవసరమైనన్ని ట్రాక్టర్లు, పుష్‌కాట్స్, రిక్షాలు లేవు.

▲ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నిధులు మంజూరు చేయించినా ఇంజనీరింగ్ సిబ్బంది కూడా రెగ్యులర్‌గా లేక ఇన్‌చార్జిలుగా ఉండటంతో పనులు జరగడం లేదు.

▲మొత్తం మీద మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తరువాత ఇంటి పన్నులు, నీటి పన్నులు భారీగా పెంచడం తప్ప ఒరిగిందేమీ లేదని ప్రజలు పెదవివిరుస్తున్నారు.



గిద్దలూరులో నిర్మిస్తున్న డివైడర్లు

అభివృద్ధి కొంత.. సమస్యలు కొండంత

కనిగిరి : పట్టణంలో ప్రధాన ఎమ్మెస్సార్ రోడ్డు, చొప్పుల బజార్, బొడ్డుచావిడివీధి, రామాలయంవీధి, కొట్ల బజార్, తీగలగొంది, తదితర ప్రాంతాలు రోడ్లు ఇరుకుతో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

★కూరగాయల మార్కెట్ గార్లపేట రోడ్డులోని పార్కు స్థలంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలే తప్పా కార్యరూపం దాల్చలేదు.

★దొరువును పర్యాటకస్థలంగా మార్చి అభివృద్ధి చేయాలని హామీలు ఇచ్చారే కాని దొరువు అభివృద్ధి జరగలేదు.

★రెండు పార్కులు శిథిలమైనా పట్టించుకోలేదు.

★నగర పంచాయతీ శాశ్వత భవనానికి రూ. 50లక్షలు నిధులు కేటాయించి ఐదేళ్లు దాటినా స్థల ఎంపిక వివాదంతో నిర్మాణం అడుగుముందుకు పడలేదు.

★నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం అర్ధంతరంగా నిలిచిపోయింది.

★కనిగిరి చెరువును సమ్మర్‌స్టోరేజి ట్యాంకుగా మార్చాలనే ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. పట్టణంలో రాకపోకలకు ఇబ్బందిగా నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ల నిర్మాణం జరుగుతున్నా నగర పంచాయతీ అధికారులు పట్టించుకున్న పరిస్థితి లేదు.

★ఈ ఆరేళ్లలో 13, 14 ఆర్థికసంఘాలు, నాన్ ప్లాన్ గ్రాంట్ నిధులు రూ. 10 కోట్లు దాకా రాగా ఇప్పటి వరకు సీసీరోడ్లు, డ్రైనేజి వసతులకు రూ. 7 కోట్లు ఖర్చు చేశారు.

★శంఖవరం, చింతలపాలెం, బీసీకాలనీ, మంగళిమాన్యం, కాశిరెడ్డినగర్, కాశీపురం, కనకపట్టణం, శంఖవరం కాలనీ, శివారు ప్రాంతాల్లో రోడ్లు బురదమయమై డ్రైనేజి వసతి లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

★పట్టణంలోనూ మురుగునీరు ఎక్కడిక్కడ నిలిచిపోతోంది.

★తాగునీరు పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిధులు రూ. 3 కోట్ల దాకా రాగా పైప్ లైన్ల ఏర్పాటు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా, 30 డిప్‌బోర్లు వేశారు.

★కొన్నేళ్ళుగా వర్షాభావంతో నగర పంచాయతీలోని 8వేల బోర్లలో 6వేలు ఎండిపోయాయి. ట్యాంకర్ల నీటిపైనే ప్రజలు ఆధారపడుతున్నారు.



అధ్వానంగా రోడ్డు

ఆరేళ్లలో అభివృద్ధి పనులు

కె.వి. పద్మావతి, నగరపంచాయతీ కమిషనర్, కనిగిరి



ఈ ఆరేళ్లలో రూ. 10కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజిల నిర్మాణం చేపట్టాం. సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూ.3 కోట్ల నిధులతో పైప్‌లైన్లు, బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. డంపింగ్ యార్డ్ అభివృద్ధికి రూ. 1.60 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. 1317 లబ్ధిదారులకు మరుగుదొడ్లు, 887 పక్కా గృహాలు మంజూరు చేశాం. రూ. 100 కోట్లతో కనిగిరి చెరువును సమ్మర్‌స్టోరేజి ట్యాంకుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపాం. పట్టణంలో రెండు పార్కుల అభివృద్ధికి రూ. 60లక్షలు కేటాయించాం. దొరువు అభివృద్ధికి రూ. 30లక్షల నిధులు మంజూరు చేశాం.

చినపవనిలో పోలీస్ పికెట్ ఏర్పాటు

◆ ఇరువర్గాలపై కేసుల నమోదు
◆ సందర్శించిన డీఎస్పీ కె.ప్రకాశరావు

లింగసముద్రం: మండలంలోని చినపవని గ్రామంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగి కత్తిపోట్లకు దారితీసిన ఘటన నేపథ్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి సోంపల్లి మనోహర్, సుబ్బిశెట్టి రామ్మోహన్ వర్గీయుల మధ్య ఘర్షణలు ఏర్పడి దాడులు జరిగిన విషయం తెలుసుకున్న కందుకూరు డీఎస్పీ కె.ప్రకాశరావు రాత్రి 11:30 గంటల సమయంలో గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన కందుకూరు, గుడ్లూరు ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో కలిసి దాడి జరిగిన ఇళ్లను, కాలిపోయిన దుకాణాన్ని పరిశీలించారు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా ఉద్రిక్త వాతావరణం సృష్టిస్తే వారిపై కఠినమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పోలీస్ పికెట్ ఏర్పడిన నేపథ్యంలో చినపవని గ్రామంలో ప్రధాన రోడ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి.

పరస్పర కేసుల నమోదు

చినపవని గ్రామంలో సోంపల్లి మనోహర్, సుబ్బిశెట్టి రామ్మోహన్ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసిన ఘటనపై గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవ



గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్

డంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. గ్రామానికి చెందిన సోంపల్లి మనోహర్ భార్యను వెంటాడి వేధిస్తూ తరచూ ఫోన్లు చేస్తున్న సుబ్బిశెట్టి రామ్మోహన్‌పై మనోహర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గుడ్లూరు ఎస్సై ఉన్నం వేమన సోమవారం చెప్పారు. అలాగే మనోహర్ వర్గీయులైన పోకూరు రవీంద్ర, పోకూరు నరసింగరావు, తలపనేని వెంకట్రావు, సోంపల్లి మనోహర్లను కత్తులతో గాయపరిచిన సుబ్బిశెట్టి రామ్మోహన్, సుబ్బిశెట్టి సుబ్బారావు, సుబ్బిశెట్టి మోహన్‌రావు, గూడూరు మణి, గూడూరు రంగనాథ్‌లపై పోకూరు రవీంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే సుబ్బిశెట్టి మోహన్‌రావు ఇంటిపై దాడి చేసి అద్దాలు పగులగొట్టి రామ్మోహన్ దుకాణానికి నిప్పు పెట్టి కొట్టిన కేసినేని ప్రసా దు, పోకూరు రవీంద్ర, పోకూరు నరసింగరావు, తలపనేని వెంకట్రావు, కూచి శ్రీను, చందు, పిచ్చయ్య మరికొందరిపై సుబ్బిశెట్టి మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని తెలిపారు. త్వరలో నిందితులను అరెస్టు చేయడం జరుగుతుందని చెప్పారు. అయితే ఇరువర్గాలకు చెందిన కొందరు అదుపులో ఉన్నట్లు సమాచారం.

కొమరోలు సాయిబాబా దేవాలయంలో చోరీ

కొమరోలు : సీసీ కెమెరాలను పగులగొట్టి మరీ దేవాలయంలోని హుండీలో నగదు దోచుకెళ్లిన సంఘటన కొమరోలులోని రాజుగారికోటలో షిర్డి సాయిబాబా దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుం ది. ఆదివారం అర్ధరాత్రి 12.05 గంటలకు ఆలయంలోకి ముగ్గురు వ్యక్తులు దేవాలయం వెనుకభాగం నుంచి ప్రవేశించి ప్రధాన ద్వారానికి ఉన్న తలుపు గడియను పగులగొట్టారు. షిర్డి సాయిబాబా విగ్రహం ఉన్న గదిలోని రెండు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హుండీని బయటకు తీసుకొచ్చారు. దేవాలయం వెనుక భాగానికి వెళ్లి పగులగొట్టి దాదాపు 30 వేల నగదును చోరీ చేసి హుండీ ని అక్కడే పడవేసి వెళ్లారు. సమాచా రం అందుకున్న ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి సీసీ కెమెరాల్లోని వీడియో ఫుటేజ్‌ల ను చూశారు. అనంతరం ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్ టీం సీఐ జక్కం రాజు బృందం వేలిముద్రలను సేకరించారు. అనంతరం ఎస్సై ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయంలో ఏడు కెమెరాలు ఉండగా



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

రెండు కెమెరాలను దొంగలు ధ్వంసం చేశారని, మిగిలిన ఐదు కెమెరాలలో దొంగతానికి సంబంధించి నమోదు అయ్యాయన్నా రు. వాటి ఆధారంగా త్వరలోనే దొంగల ను పట్టుకుంటామన్నారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు సిఫారసు

గిద్దలూరు : గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో మిర్చి వ్యాపారి ఖాసీంపై మద్యం మత్తులో గంజాయి పేరుతో వేధించి ప్రైవేట్ వ్యక్తులతో కలసి దాడికి పాల్పడ్డ ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వర్లు ఉదంతంపై సీఐ ఎ.రత్నం స్పందించారు. పత్రికలలో కథనాలు రావడంతో వెంటనే ఘటన తీరుతెన్నుల గురించి విచారించడం జరిగిందని తెలిపారు. ఘటన జరిగినట్లు నిర్ధారణ చేసుకున్నామని, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును సస్పెన్షన్ చేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు సిఫారసు చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సిబ్బంది చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

ఈ వారం బెస్టు పోలీస్ రమేష్

ఒంగోలు క్రైం : ఆత్మహత్యకు యత్నించిన ఆటోడ్రైవర్ ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ కె.రమేష్‌బాబు బెస్టు పోలీసు ఆఫ్ ది వీక్‌కు ఎంపికయ్యారు. ఒంగోలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న రమేష్ కర్నూల్ రోడ్డు బైపాస్ వద్ద ఈనెల ఏడున విధులు నిర్వహిస్తున్నారు. బిలాల్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ ఎస్.కె.ఖాసిం ఫ్లై ఓవర్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ఉపక్రమించాడు. ఆ సమయంలో కానిస్టేబుల్ రమేష్ సమయ స్ఫూర్తితో వ్యవహరించి మార్కాపురం నుంచి ఒంగోలు వస్తున్న ఆర్టీసీ బస్సును ఫ్లైఓవర్ కింద భాగాన నిలిపి వేయించాడు. ఆ బస్సు పైకి ఎక్కి రమేష్ ఆత్మహత్యాయత్నానికి ఉపక్ర మించిన ఖాసింను మాటల్లో పెట్టి తన వద్ద ఉన్న హోంగార్డు పాపారావును అప్రమత్తం చేసి ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కించి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడాడు. దాంతో ఎస్పీ బెస్టు పోలీస్ ఆఫ్‌ది వీక్ అవార్డుకు రమేష్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ ఉదయరాణి చేతుల మీదుగా రమేష్‌బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ బి.మరియదాసు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యపై డీఎస్పీ విచారణ

మేదరమెట్ల: కొరిశపాడులో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డ యర్రమోతు వేణు మృతిపై దర్శి డీఎస్పీ వి.ఎస్.రాంబాబు సోమవారం విచారణ జరిపారు. కొరిశపాడులో వేణు ఉరి వేసుకున్న గదిని పరిశీలించి స్థానిక అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. అక్కడ నుంచి మేదరమెట్లలో శుక్రవారం వేణును కట్టేసిన వేప చెట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ స్థానికులను విచారించారు. సురేంద్ర కుమార్తెను వేణు, ప్రసన్న వెంబడించి వేధించారని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉండగా చెట్టుకు కట్టేసి కొట్టడం చట్టరిత్యా నేరమన్నారు. వేణు తండ్రి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 306 సెక్షన్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కొరిశపాడు ఏఎస్సై హరిబాబు, సిబ్బంది హాజరయ్యారు.

మహిళ అనుమానాస్పద మృతి

మేదరమెట్ల: రావినూతలకు చెందిన కొవ్వూరి అనంత లక్ష్మి(65) సోమవారం మృతిచెందింది. ఆమెకు నరసింహారావు, శ్రీనివాసరావు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా అన్నదమ్ముల మధ్య ఆస్తి విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్న నరసింహారావు వద్ద ఉంటున్న తల్లి సోమవారం మృతిచెందగా చిన్న కుమారుడు శ్రీనివాసరావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్సై హరిబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అద్దంకి సీఐ హైమారావు రావినూతలల ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అసంపూర్తి గృహాలకు నిధులు

కొమరోలు : నియోజకవర్గంలోని గతంలో మంజూరై, నిర్మాణం మధ్యలో ఆగిపోయిన 1956 గృహాలకు రూ. 25 వేలు చొప్పున లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్నట్లు గృహ నిర్మాణశాఖ డీఈ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గృహాలు నిర్మించుకుని వివిధ దశల్లో ఆగిపోయిన లబ్దిదారులకు మండలంలో 378 మంది ఉన్నారన్నారు. అలాగే మండలానికి నూతనంగా 599 ఎన్‌టీఆర్ గృహాలు మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అవినాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ తిరుమలయ్య పాల్గొన్నారు.

సజావుగా సాగేనా?

కంభం మండల సర్వసభ్య సమావేశంపై ప్రజాప్రతినిధుల సందేహాలు

ఎంపీడీవో గైర్హాజరు, అధికారుల అలసత్వమే కారణం



ఇరిగేషన్ పంట కాలువపై ఉన్న అక్రమ కట్టడాలు



కంభం ఎంపీడీవో కార్యాలయం

కంభం : కంభం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సజావుగా సాగేనా అని ప్రజాప్రతినిధులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో బాధ్యతారాహిత్యం, ఆయా శాఖల అధికారుల అలసత్వంపై వారు తీవ్ర అసంతృప్తి ఉన్నారు.

ఇప్పటి వరకు జరిగిన పలు మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ప్రధాన సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, వారు వారంలోగా పరిష్కరిస్తామని చెప్పడం తర్వాత పట్టించుకోకపోవడం జరుగుతుంది. ముఖ్యంగా జడ్పీటీసీ సభ్యుడు సయ్యద్ జాకీర్, ఎంపీటీసీ సభ్యుడు సయ్యద్ అనీస్ అహ్మద్, కంభం సర్పంచ్ స్టార్ బాష ఇంకా పలువురు ప్రజాప్రతినిధులు పలు సమావేశాల్లో చారిత్రాత్మక కంభం చెరువు ఆధునికీకణకు మంజూరైన రూ. 9 కోట్ల జపాన్ నిధులు ఎక్కడెక్కడ ఖర్చుచేశారు? ప్రధాన పంట కాలవల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పుడు తొలగిస్తారు? కాలువలపై ఆక్రమణలను ఎందుకు తీసివేయడం లేదు? మండలంలో వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్యకు ఎటువంటి పరిష్కారం చూపుతున్నారు? తదితర ప్రశ్నలను లేవనెత్తారు. అందుకు ఆయా శాఖల అధికారులు వారం రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, అమలులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన రెండు సర్వసభ్య సమావేశాలను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించారు. అలాగే ఇరిగేషన్ కాలువల పనులు ఎక్కడెక్కడ జరిగాయో పూర్తి సమాచారాన్ని మండల సమావేశంలో ప్రజాప్రతినిధులకు ఇవ్వాలని, మూడు మండల సమావేశాల్లో తీర్మానం కూడా చేశారు. అయినా నేటికీ అధికారుల్లో ఎటువంటి చలనం రాకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

దీనికి ముందు జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులకు ఇచ్చిన మాట నిలబెట్టకోలేని మండల సమావేశాలెందుకు అంటూ ప్రజాప్రతినిధులందరరూ సమావేశాన్ని బహిష్కరించిన విషయం విధితమే. అలాగే ఒక మండల సమావేశానికి ఎంపీడీవో నిర్మలాజ్యోతి ఏకంగా అనారోగ్య సమస్యను సాకుగా చూపి గైర్హాజరవడంపై ప్రజాప్రతినిధులు నిరసన తెలిపారు. ఎంపీడీవో తరచూ సెలవులపై స్వగ్రామం గుంటూరు వెళుతుండటం, సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులతో చర్యలు సక్రమంగా జరగడం లేదు. దీంతో అధికారులు కూడా ఇష్టానురీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శ ఉంది. తరచూ సెలవులకు తోడు ఈ నెల 18న ఎంపీడీవో వివాహం కావడంతో విధులకు ఎప్పుడు హాజరవుతారో చెప్పలేని పరిస్థితి. పైగా మొన్నటి వరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఈవోఆర్డీ నేతాజీకి ఎంపీడీవోగా పదోన్నతి రావడంతో వేటపాలెం బదిలీపై వెళ్లిపోయారు. అలాగే సీనియర్ అసిస్టెంట్ రసూల్‌కు కూడా ఈఓఆర్‌డీగా పదోన్నతి రావడంతో ముండ్లమూరు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని తెలిసింది. ఈ పరిస్థితులలో మంగళవారం సమావేశం జరుగుతుందా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

కంభం : మండలంలోని రావిపాడు గ్రామంలో రూ. 5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి తహసీల్దార్ ఉషారాణి సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమం లో సర్పంచ్ మద్దుకూరి కోటయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఎస్సైకి మాజీ సైనికుల అభినందనలు

కంభం : కంభం మండల ఉత్తమ ఎస్సైగా ప్రసంశా పత్రం అందుకున్న ఎం.రామానాయక్‌ను మండల మాజీ సైనికులు సోమవారం కలిశా రు. పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు శెట్లం వే ణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగించుకోవాలి

కొమరోలు : అంది వచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగ పరచుకుని చక్కటి విద్యను అభ్యసించాలని వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ బాదం వేణుగోపాల్ కోరారు. మండలంలోని తాటిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 120 మందికి నోటు పుస్తకాలు, టైలు, బెల్టులు, షూలను వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సూర్యశేషకుమార్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కిశోర్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను వినియోగించాలి

కొమరోలు : మట్టి విగ్రహాలను వినియోగిస్తే పర్యావరణాన్ని రక్షించవచ్చని కళాజాత బృందం గ్రామాల్లో తిరిగి ప్రజలకు సోమవారం అవగాహన కల్పించింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంతణ మండలి వారి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి మట్టి విగ్రహాలనే వాడాలని పాటల, మ్యాజిక్ ద్వారా సోమవారం కొమరోలు, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో కార్యక్రమాలను నిర్వహించారు.

మోక్షగుండంలో అభివృద్ధి పనులపై సర్వే

బేస్తవారపేట : మండలంలోని మోక్షగుండం గ్రామాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సైయంట్ ఫౌండేషన్ ఛైర్మన్ బోధనపు వెంకట మోహన్‌రెడ్డి దత్తత తీసుకొని స్మార్ట్ విలేజ్‌గా తయారు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఏపీ స్మార్ట్ ఫౌండేషన్ ప్రతినిధి విజయలక్ష్మీ సోమవారం మోక్షగుండం గ్రామం వచ్చి మండల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సర్వే చేయాలని సూచించారు.

అశోక్‌రెడ్డికి అన్నా వర్గీయుల మద్దతు

గిద్దలూరు : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి మాజీ ఎ మ్మెల్యే అన్నా రాంబాబు వర్గీయులు మద్దత పలికారు. కంభం మండలం జంగంగుంట్ల సర్పంచ్ శ్రీరాం చెన్నయ్య, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల పాపిరెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షుడు దేసిరెడ్డి లక్ష్మిరెడ్డిలు వారి అనుచరులతో సోమవారం అశోక్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. తాము టీడీపీలో ఉంటామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. వారి వెంట కంభం మండల టీడీపీ అధ్యక్షుడు కేతం శ్రీనివాసులు ఉన్నారు.

టీడీపీకి అన్నా వర్గీయుల రాజీనామా

బేస్తవారపేట : అన్నా రాంబాబుకు మద్దతుగా పలువురు టీడీపీకి రాజీనామా చేశారు. సోమవారం బేస్తవారపేట దూదెకుల ఆదాం కాంప్లెక్స్‌లో డి.పరమేశ్వరరెడ్డి, కంభం మార్కెట్ మాజీ డైరెక్టర్ గాజుల బాషా అధ్యక్షతన సమావేశం జరిగింది. సర్పంచులు కొండావెంకటరెడ్డి, పుస్పకుమారి, కొండయ్య, మాజీ సర్పంచులు నాయకులు తుపాకుల వెంకటయ్య, బి.సుబ్బరత్నం, షేక్.బషీర్,షేక్ గాజుల బాషా, మిట్టా సంజీవరెడ్డి, సుబ్బరాయుడు, తోటకూరి దివాకర్, తిప్పిశెట్టి రజినీ కాంత్,తిప్పిశెట్టి పవన్ కుమార్‌లతో పాటు మరి కొందరు కార్యకర్తలు ఈ సందర్భంగా టీడీపీకి రాజీనామ చేసి, అన్న అడుగుజాడల్లో నడుస్తామని ప్రకటించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు : గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో గిద్దలూరు విశ్వబారతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. సీనియర్స్ విభాగంలో రాజేష్, పీవీ చరణ్, జూనియర్స్ విబాగంలో గౌతమ్, శంకర్, నిక్కి, అఖిల్ శరత్, అర్జున్, నికిల్ వివిధ పోటీల్లో మెడల్స్ సాధించారు. వీరికి సుడోఖాన్ కరాటే రాష్ట్ర చీఫ్ ఇన్ స్ట్రక్టర్ సీపీ రాజ మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బండారు ఆదిలక్ష్మి, డైరక్టర్ జి.రంగస్వామిరెడ్డి సోమవారం అభినందించారు. కరాటే మాస్టర్ భూతరాజు శ్రీనును సన్మానించారు.

టీడీపీ శిక్షణ తరగతులకు తరలిన నాయకులు

కొమరోలు : కందుకూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర టీడీపీ శిక్షణ తరగతులకు మండలంలోని 30 మంది నాయకులు సోమవారం తరలివెళ్లారు. కార్యక్రమాన్ని మండల జన్మభూమి కమిటీ సభ్యులు వీవీ రాఘవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎదురు శ్రీనివాసరెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. కొమరోలు సొసైటీ అధ్యక్షుడు పులకుర్తి వెంకటేశ్వర్లు, చలిచీమల శ్రీనివాసచౌదరి, చల్లగొలుసుల ప్రసాద్, గురుస్వామిరెడ్డి, పెద్దరామయ్య తదితరులు శిక్షణకు హాజరయ్యారు.

ముమ్మరంగా డివైడర్ పనులు



డివైడర్ పనులు జరుగుతున్న దృశ్యం

గిద్దలూరు : పట్టణం గుండా వెళ్లే ఒంగోలు-నంద్యాల రోడులో మూడు రోజులుగా నూతన డివైడర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. డివైడర్‌పై ఇనుప గ్రిల్ పెట్టి మధ్యలో ఉన్న మట్టిలో గడ్డి, మొక్కలు నాటుతామ ని, ఈ మోడల్ బాగుంటే రోడ్డు మొత్తం ఇలాగే కొనసాగిస్తామని అధికారులు చెబుతున్నారు.

కాగా డివైడర్ నిర్మాణ పనులు నాశిరకంగా జరుగుతున్నాయని, తక్కువ రకం కంకర వాడకం, కాంక్రీట్ వాల్ మధ్యలో ఇనుప కడ్డీలు పెట్టడం లేదని, ఫలితంగా వాహనాలు తగిలితే సులభంగా డివైడర్ పగిలిపోయే అవకాశం ఉందని పనులను పరిశీలించిన సీపీఎం నాయకులు ఆరోపిస్తున్నారు. నేషనల్ హైవే రోడ్డు అయినందున నిత్యం వందలాది భారీ వాహనాలు తిరుగుతాయి, కావున డివైడర్ పనులు పటిష్ఠంగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రహదారి ఆక్రమణపై ఫిర్యాదు

కొమరోలు : మండలంలోని నరసింహునిపల్లె గ్రామ రహదారిని కొంతమంది గ్రామస్థులు ఆక్రమిస్తున్నారని గ్రామానికి చెందిన కొందరు ఎంపీడీవోకు డి.నరసయ్యకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇడమకల్లు గ్రామం నుంచి నరసింహునిపల్లె, కృష్ణంపల్లె, బాదినేనిపల్లె గ్రామాలకు ఈ రోడ్డు గుండానే వెళ్లాలని, కానీ రహదారిలో గృహాలను నిర్మిస్తున్నారని, సమస్యను ఇదివరకు అధికారులకు తెలియచేసినా స్పందించలేదని ఎంపీడీవోకు వివరించారు. రహదారిపై గృహాలు నిర్మిస్తే గ్రామానికి చెందిన 27 కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

32 కేసుల నమోదు

గిద్దలూరు : మండలంలో గత నెలన్నర రోజుల్లో 32 కేసులు నమోదు చేసి, 10 మంది నిందితులను అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ ఎ.రత్నం పేర్కొన్నారు. సోమవారం రాత్రి సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 బెల్ట్‌షాపులపై దాడి చేసి, 10 మందిని అరెస్ట్ చేసి, 278 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన 13 మద్యం షాపులపై కేసులు నమోదు చేశామని, 4 షాపుల్లో మద్యం శాంపిల్స్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. 8 సారా బట్టీలను కనుగొని, 3370 లీటర్ల ఊటను నేల పాలు చేశామని, 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్సై పి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నేడు శాంతి సంఘ సమావేశం

కంభం : వినాయక చవితి సందర్భంగా శాంతి సం ఘ సమావేశం డీఎస్సీ రామాంజనేయులు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరుగుతుందని ఎస్సై రామానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభం పట్టణ నిమజ్జన, విగ్రహ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, ముస్లిం సోదరులు హాజరు కావాలన్నారు. ఈ నెల 26న విగ్రహాల నిమజ్జనానికి ఏయే ప్రాంతాలు అనువైనవో పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతం కంభం చెరువులో నీరులేనందున రెండు తూముల వద్ద నిలిచిన కొద్దిపాటి నీటిలో, అలుగు సమీపంలో ఉన్న నీటిలో కొన్ని విగ్రహాలను నిమజ్జనం చేయవచ్చని, పెద్దవిగ్రహాలను రామన్న కతువ వద్ద నిమజ్జనం చేసేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలించనున్నట్లు తెలిపారు.

సర్పంచులకు సత్కారం

గిద్దలూరు : స్వచ్ఛభారత్ భాగంగా మండలంలోని తిమ్మాపురం, ఆదిమూర్తిపల్లి పంచాయతీల్లో నూరు శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినందుకు సర్పంచులు కోటా రమేష్ బాబును, చెన్నుపాటి అరుణకుమారిలను సోమవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి సుజనాచౌదరి సత్కరించి, ఓడీఎఫ్ అవార్డులను అందజేశారు.

ప్రజాసేవే లక్ష్యం

రాచర్ల : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ప్రతి ఉద్యోగి కర్తవ్యమని ఎంపీడీవో కె.అరుణాదేవి అన్నారు. గిద్దలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏవీఎస్ శ్రీనివాసులు ఇటీవల స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు.

సినిమాలు

గిద్దలూరు

కృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
శ్రీనివాస	- ఫిదా
వెంకటేశ్వర	- లై
నటరాజ్	- జయ జానకి నాయక

పథకాల అమలులో అప్రమత్తంగా ఉండాలి

● లబ్ధిదారులకు న్యాయం జరగాలి ● ఎమ్మెల్యే రవికుమార్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పంగులూరు : ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందజేసే విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే రవికుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పార్టీ నేతలతో అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సోమవారం సమీక్ష నిర్వహించారు.వ్యక్తిగత మరుగుదొడ్ల పూర్తయిన లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు విషయంలో జాప్యం లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బ్రహ్మయ్యను ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయి నిధులు చెల్లింపులు జరగనివాటితో పాటు, మంజూరై బిల్లులు రాని వారి వివరాలను అందజేయాలన్నా రు. అవసరమైన ప్రతి ఒక్క రూ పక్కా గృహం పొందేందు కు బేస్‌మెంట్ వేసుకునే వి ధంగా ప్రోత్సహించాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ ఈమని సుబ్బారావును ఆదేశించారు. మండలానికి మంజూరైన గృహాలు, పూర్తయిన వాటి వివరాలను తెలుసుకున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయండి..

సబ్‌ప్లాన్, ఎస్‌డీఎఫ్, ఆర్‌డీఎఫ్ నిధులతో మంజూరైన సీసీ రోడ్లను వేగవంతంగా పూర్తి చేయాలని పీఆర్ ఏఈ రామ్‌కుమార్‌ను కోరారు. ఏయే గ్రామాల్లో రోడ్ల పూర్తి కాకుండా ఉన్నాయో వాటి వివరాను అడిగి తెలుసుకున్న రవికుమార్ సకాలంలో రోడ్ల నిర్మాణం చేపట్టకపోతే నిధులు పొందడం కష్టమవుతుందన్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు జరిగే విధంగా చూడాలని సూచించారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరైన యూనిట్లు, వాటి గ్రౌండింగ్ వివరాను అడిగి తెలుసుకున్నారు. గత ఖరీఫ్, రబీలో మినుము పంట నష్టపోయిన 1977 మంది రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 1.3 కోట్లు ఇంతవరకు వారి ఖాతాలో జమ కాలేదని, పలు గ్రామాల నుంచి పిర్యాదు అందగా మార్టూరు ఏడీఏ తో ఫోన్‌లో సంప్రదించి తక్షణమే రైతులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. రెవెన్యూ సమస్యలు గురించి రేషన్ కార్డులు ఆన్‌లైన్‌లో రైతుల భూముల వివరాల నమోదు విషయంలో తహసీల్దార్ పార్వతితో చర్చించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ నార్నె పార్వతమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు కుక్కపల్లి పద్మ, ఎంపీడీవో ఎం.శ్యామ్ ప్రసాద్ ఏవీ సుబ్బారావు, ఏడు కొండలు, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, రావూరి రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు పరంధామయ్య, గొట్టిపాటి నరేంద్ర, మస్తాన్‌వలి, అంజిరెడ్డి, బ్రహ్మారెడ్డి, డీసీ అధ్యక్షుడు అల్లంనేని స్వామి, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు నాయకులు తదితనేలే పాల్గొన్నారు.

బాధితులను ఆదుకునేందుకు చంద్రన్న బీమా

ప్రమాదాలకు గురైన వ్యక్తులను, వారి కుటుంబాలను ఆదుకునేందుకే చంద్రన్న బీమా పథకం ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు చెందిన 18 మందికి చంద్రన్న బీమా చెక్కులను అంజదేశారు.

వివాహిత ఆత్మహత్య

పంగులూరు : మండలంలోని ముప్పవరం గ్రామంలో ముచ్చు మాధవి అలియాస్ మంగమ్మ అనే వివాహిత సోమవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమెకు ముప్పవరం గ్రామానికి చెందిన వేణుతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 9 ఏళ్ల కుమార్తె ఉంది. మానసిక స్థితి బాగాలేక ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వీఆర్‌వో బాలయ్య పిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో మరిన్ని సౌకర్యాలు

అద్దంకి టౌన్ : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందు ప్రభుత్వం కృషి చేస్తుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగ పర్చుకోవాలని ఎంఈవో నూనె విజయకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకానికి రెండు గ్యాస్ సిలిండర్లు మంజూరు చేసింది. ఎంఈవో సోమవారం వాటిని పాఠశాలకు అందజేశార. ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బిలీవర్స్ చర్చి సేవలు అభినందనీయం

గరటయ్యకాలనీ (అద్దంకిటౌన్): తమకు ఉన్న దానిలోనే ఇతరులకు సాయం చేయాలని, అలా పేదలకు సాయపడుతున్న బిలీవర్స్ చర్చి నిర్వాహకులు అభినందనీయులని ఎస్సై ఎ.సుబ్బరాజు అన్నారు. సోమవారం గరటయ్యకాలనీలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా పాస్టర్ ఏకాంతారావు అధ్యక్షతన దోమతెరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై చేతుల మీదగా 50 మంది పేదలకు దోమతెరలను అందజేశారు. వర్షాకాలంలో దోమతెరలు దోమల వల్ల ఉపయోగం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తెరలను వినియోగిస్తే వ్యాధులు రావాలన్నారు.

రేపు రుణాలకు ఇంటర్వ్యూలు

వేటపాలెం : మండలంలోని కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారికి ఈనెల 23 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.నేతాజీ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం ని ర్వహించారు. 23న ఎస్సీ, మైనార్టీ, 24న కాపు, బీసీ, 28న ఎస్సీలకు ఇంటర్వ్యూలు ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

చీరాల రూరల్ : ఉపాధ్యాయుల బోధన పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేకబోధనా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో 4 కేంద్రాలు ఏర్పాటు చేయగా పాఠశాల నిర్వహణకు ఆటంకం రాకుండా సగం మంది ఉపాధ్యాయులు హాజరు కాగా సగం మంది మంగళవారం హాజరుకానున్నట్లు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానంపై ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమానికి దశలవారీగా ఉపాధ్యాయులు హాజరవుతారని ఆయన వివరించారు.

ఆర్‌టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

చీరాల రూరల్ : ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ నెలకు రెండు రోజులు సెలవులు ఇవ్వాలని, చీరాల డిపోకు ఏడీసీలను కల్పించాలని, ఎవరి డ్యూటీ వారిచేతనే చేయించాలని, ఈపీకే, కే ఎంపీఎల్ పేరుతో వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో ఎస్‌డబ్ల్యుఎఫ్ అధ్యక్షుడు కేబీకే రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఏవీ రమణ, డిపోకార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సీఐటీయూ ఎన్.బాబూరావు, రీజనల్ నాయకులు బి.శ్రీనివాసరావు, వైఆర్ రావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలపై అవగాన యాత్ర

చీరాల : చీరాల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన కల్పించేందుకు కళాశాల యాజమాన్యం అవగాహనా యాత్రలో భాగంగా కాకినాడ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీని సందర్శించేందుకు అవకాశం కల్పించింది. 18న టూర్‌కు వెళ్లిన విద్యార్థులు కంపెనీలో వివిధ విభాగాలకు సంబంధించిన పని విధానాలు, యంత్రాల పనితీరుపై అవగాహన పొంది 20న తిరిగి చీరాల చేరారు. విద్యార్థులు ఇలాంటి సందర్శనలు చేయడం వల్ల ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందని కళాశాల యాజమాన్యం ఈ సందర్భంగా తెలిపింది. టూర్‌కు వెళ్లి వచ్చిన విద్యార్థులను కళాశాల సంయుక్త కార్యదర్శి తేళ్ల అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ సయ్యద్‌కమాలుద్దీన్ అభినందించారు. టూర్‌కు వెళ్లిన వారిలో ఎన్‌సీసీ ప్రతినిధి శ్రీధర్‌కుమార్, అధ్యాపకుడు ప్రవీణ్ ఉన్నారు.

మట్టి విగ్రహాలకు పూజలు చేయండి

చీరాల రూరల్ : వినాయకచవితి ప్రజారోగ్యహితంగా జరుపుకోవడానికి ప్రజలందరూ మట్టి వినాయకుడిని పూజించాలని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు సూచించారు. రసాయనాలతో తయారుచేస్తున్న విగ్రహాలను వినియోగించి, నిమజ్జనం చేయటం వల్ల అనేక రకాల జీవులకు హాని కలుగుతుందని ప్రజలు దీనిని గమనించాలని కోరారు. మట్టి విగ్రహాన్ని పూజించి ప్రకృతికి మేలు చేస్తూ పండుగ హాయిగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు డి.నారపరెడ్డి, బి.పిచ్చయ్య, రాష్ట్రకార్యదర్శి కుర్రా రామారావు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.వీరాంజనేయులు, జిల్లా కౌన్సిలర్ నాగేశ్వరరావు, సూరిబాబు, కుర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు సత్కారం

గిద్దలూరు : స్వచ్ఛభారత్ భాగంగా మండలంలోని తిమ్మాపురం, ఆదిమూర్తిపల్లి పంచాయతీల్లో నూరు శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినందుకు సర్పంచులు కోటా రమేష్ బాబును, చెన్నుపాటి అరుణకుమారిలను సోమవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి సుజనాచౌదరి సత్కరించి, ఓడీఎఫ్ అవార్డులను అందజేశారు.

బలవంతంగా చందాలు వసూలు చేస్తే చర్యలు

● డీఎస్పీ వీఎస్ రాంబాబు

అద్దంకి : వినాయక విగ్రహాల పేరుతో బలవంతపు చందాలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దర్శి డీఎస్పీ వీఎస్ రాంబాబు హెచ్చరించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని కోరారు. అనుమతి దరఖాస్తుల్లో విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతం, నిమజ్జనోత్సవం రోజు, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను పొందుపరచాలన్నారు. రాత్రి సమయాల్లో కమిటీ సభ్యులు విగ్రహాల వద్ద కాపలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, రోడ్లపై ఏర్పాటు చేసే సమయంలో ఆయా శాఖల అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. నిమజ్జనోత్సవంలో బాణసంచా కాల్చడం, అర్కెస్ట్రాలతో పాట కచేరీలు నిర్వాహణకు అనుమతులు లేవన్నారు. మద్యంసేవించి ఊరేగింపులో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు ఇతర మతస్థుల ప్రార్థనా సమయాల్లో ఇబ్బందులు కల్పించకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహిస్తూ తమ సంతకాలతో, ఆధార్ ఫోటో స్టాట్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11 రోజుల లోపు నిమజ్జనోత్సవాలు పూర్తి చేసుకోవాలని కోరారు. సీఐ హైమారావు, ఎస్సై సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు



కొత్తపేట వివేకానందనగర్ పాఠశాలలో రేడియో సరిచేస్తున్న ఉపాధ్యాయురాలు

మొక్కుబడిగా రేడియో పాఠాలు

● రేడియో పాఠాలు అంటే ఏంటన్న ఎంఈవో

చీరాల : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా పాఠశాలల్లో రేడియో పాఠాలను ప్రవేశపెట్టింది. అయితే క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వాటిని అందించాల్సిన అధ్యాపకులు కొన్ని చోట్ల మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఎంఈవో లక్ష్మీనారాయణ రేడియో పాఠాలు అంటే ఏంటి? అవి ప్రస్తుతానికి లేవని అనడం విశేషం.

సోమవారం నుంచి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రేడియో పాఠాలు ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించాలి. ఈ నేపథ్యంలో పలు పాఠశాలల్లో అధ్యాపకులు రేడియో పాఠాలు విన్నారులకు వినిపించేందుకు సిద్ధమయ్యారు. కొన్ని పాఠశాలల్లో మాత్రం రేడియోలు మొక్కుబడిగా ఉన్నాయి. రేడియోలు పని చేయకపోవడంతో ఇబ్బంది పడ్డారు. మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులు రేడియో పాఠాలు విన్నారు. రేడియో పాఠాలకు సంబంధించిన అడ్డంకులు, ఎప్పటి నుంచి సాఫీగా సాగుతాయని ఎంఈవో లక్ష్మీనారాయణను అడగ్గా రేడియో పాఠాలు అంటూ ఏమీ లేవు, హైస్కూలు ఉపాధ్యాయులకు మాత్రం వీడియో శిక్షణ ప్రస్తుతం జరుగుతుందని చెప్పారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించాల్సిన ఎంఈవో రేడియో పాఠాలు గురించి తెలియదంటే ఇక ఆ పాఠాలను విద్యార్థులకు ఏ మేరక అర్థమయ్యేలా అమలు పరుస్తారో ఆయనకే తెలియాల్సి ఉంది.

రుణాలకు ఇంటర్వ్యూలు

అద్దంకి రూరల్: కార్పొరేషన్ రుణాలకు బుధ, గురువారాల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో హేమాద్రినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పంగులూరు : కార్పొరేషన్ రుణాలకు బుధవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. 23 ఉదయం 10 గంటలకు ఎస్సీ, మైనార్టీలకు 24న కాపు, బీసీ, 28న ఎస్సీలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిక జరుగుతుందన్నారు. అభ్యర్థులు తగిన సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

నేడు శాంతి సంఘ సమావేశం

కంభం : వినాయక చవితి సందర్భంగా శాంతి సం ఘ సమావేశం డీఎస్పీ రామాంజనేయులు అధ్యక్షతన మంగళ వారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరుగుతుంద నిఎస్సై రామానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభం పట్టణ నిమజ్జన, విగ్రహ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, ముస్లిం సోదరులు హాజరు కావాలన్నారు. ఈ నెల 26న విగ్రహాల నిమజ్జనానికి ఏయే ప్రాంతాలు అనువైనవో పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతం కంభం చెరువులో నీరులేనందున రెండు తూముల వద్ద నిలిచిన కొద్దిపాటి నీటిలో నిమజ్జనం చేయాలన్నారు.

మున్సిపల్ స్థలం కబ్జా

- హెచ్చరిక బోర్డు తొలగింపు
- 3 ఎకరాల్లో 30 సెంట్లు కూడా లేని వైనం

ఎర్రగొండపాలెం రూరల్: మార్కాపురం పట్టణంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు ముందుజాగ్రత్తగా ఇది ప్రభుత్వ భూమి దీనిని ఆక్రమించిన వారు శిక్షార్హులు అంటూ ఉంచిన బోర్డులు కూడా పీకివేసి మరీ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పట్టణ పరిధిలోని రాయవరం సమీపంలో హైవేను ఆనుకుని ఉన్న మున్సిపల్‌శాఖ భూమి ఆక్రమణలకు గురైందని అందిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లి పరిశీలిస్తే గతంలో అక్కడ పాతిన బోర్డును పీకి పక్కన పడవేసి కనిపించింది. దానిపై స్థలం వివరాలు కనిపించాయి.



స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

పురపాలక శాఖకు చెందిన ఈ భూమిని పరిశీలిస్తే 1011/6 సర్వే నెంబరులో 2.88 ఎకరాలుగా నమోదై ఉంది. అక్కడ ఆ భూమి కనిపించటం లేదు. పక్కనే చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్ కనిపించింది. ఇది తమకు పట్టాగా ఉన్న భూమి అని సదరు వ్యక్తులు తెలిపారు. మరోవైపు ఉన్న భూమి కూడా ఇతరుల స్వాధీనంలో ఉండి కంచెవేసి కనిపించింది. ఇంకో వైపు హైవే వెళ్లింది. మరి 2.88 ఎకరాల భూమి ఎక్కడ అని పరిశీలిస్తే కేవలం 30 సెంట్ల భూమి అక్కడ మిగిలి ఉంది. కొంత హైవే రోడ్డు నిర్మాణంలో పోయి ఉంటుందని కొందరు చెబుతున్నారు.

అయితే, ఈ భూమిని పట్టణానికి చెందిన ప్రముఖ వ్యక్తి అధికారపార్టీ నాయకుని మౌఖిక ఆదేశాలతో స్వాధీనం చేసుకుని



ప్రభుత్వ స్థలం అంటూ ఉంచిన బోర్డు ఇది (ప్రస్తుతం పీకివేశారు)

చదును చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. అధికారులు ప్రభుత్వ స్థలాలలో బోర్డులు పెట్టి చేతులు దులుపుకోవటం తప్ప శ్రద్ధ పెట్టి వాటిని జాగ్రత్త చేయటం లేదు. కనీసం హద్దులు పెట్టి ఇది ప్రభుత్వ భూమి అని ఉంచలేకపోతున్నారు. దీనిని ఆసరా చేసుకుని అక్రమార్కులు వాటిని కబ్జా చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ స్థలాలపై అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేరు.

దేవాలయాల్లో దొంగల వేట

- నిధులకోసం ఆలయాల విధ్వంసం
- హుండీలపై కూడా కన్ను

ఎర్రగొండపాలెం రూరల్: దేవాలయాల్లో దొంగల వేట కొనసాగుతోంది. గుప్తనిధులు ఉన్నాయంటూ తవ్వకాలు జరిపే ముఠాలు కొందరైతే, గుడిలోని హుండీలో ఉన్న వస్తువులు కాజేసేందుకు కన్నమేసేవారు మరికొందరు. ఏదైతేనేమి ఇటీవల జిల్లాలోని పలు సంఘటనలు దేవాలయాలకు కరువైన భద్రతను రుజువు చేస్తున్నాయి. ఆదివారం జిల్లాలోని కొమరోలు గుడిలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. అక్కడ ఉన్న సీసీ కెమెరాను కూడా ధ్వంసం చేసి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇటీవల ఎర్రగొండపాలెం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మిల్లంపల్లి దేవాలయంలో దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన విషయం బయటపడింది. దేవాలయాల్లో చిల్లర దొంగలు కూడా వారిపని వారు చేసుకుపోతున్నారు. జూన్ 6న శింగరకొండ దేవాలయంలో స్వామి దర్శనంకోసం క్యూలైన్లో ఉన్న వ్యక్తులే భక్తుల వద్ద ఉన్న వస్తువుల చోరీకి ప్రయత్నించటం వారిని కొందరు పట్టుకుని పోలీసులకు అప్పగించటం జరిగింది.



పదేపదే తవ్వకాలు జరుపుతున్న మిల్లంపల్లి దేవాలయం

పశ్చిమ ప్రాంతంలో అధికం..

ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో దేవాలయాల్లో దొంగల తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది. కంభం పట్టణానికి దగ్గరలో గుండ్లకమ్మ ఒడ్డున ఉన్న పురాతన దేవాలయం కాశీవిశ్వేశ్వర కోటేశ్వరస్వామి దేవాలయంలో ఈ ఏడాది జూన్ 22న గుప్తనిధులకోసం తవ్వకాలు జరిపారు. నిధుల వేట సమయంలో దొంగలు కూడా శాస్త్రోత్తంగా పూజలు కూడా నిర్వహిస్తారు. ఇక్కడ కూడా దొంగలు ముందుగా నాగదేవతకు ప్రత్యేక పూజలు చేసి తలుపులు పగలగొట్టి తవ్వకాలకు ప్రయత్నం చేసినట్లు గుర్తించారు. నెలరోజుల వ్యవధిలోనే సంతనూతలపాడు మండలం చిలకపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో దొంగలు గేట్లు తీసుకుని ఆభరణాలను అపహరించుకుపోయారు. గతనెలలో ఎర్రగొండపాలెం సమీపంలోని మిల్లంపల్లి దేవాలయంలో నిధులకోసం తవ్వకాలు జరిపారు. దాదాపు గతంలో తవ్విన చోటే తవ్వకాలకు పా ల్పడినట్లు గుర్తించిన ఆలయకమిటీ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పరిశీలించిన పోలీసులు ఒకేచోట అదే దేవాలయంలో పదేపదే తవ్వకాలు జరుగుతున్న తీరునుబట్టి ఒకే ముఠా పని అయి ఉంటుందా అనే దిశగా కూడా దర్యాప్తు జరుపుతున్నారు. ఇప్పటికి పలుమార్లు ఇదే దేవాలయంలో తవ్వకాలు జరిగాయి. గత ఏడాది మార్చినెలలో ఇదే ఆలయంలో తవ్వకాలకు పాల్పడిన ముఠా సభ్యులు గుడిలోని స్వామివారి మూలవిరాట్‌ను ధ్వంసం చేశారు. 2013లో ఇక్కడ జరిపిన తవ్వకాల సమయంలో ప్రజలు పసిగట్టి వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఇదేరీతిలో పుల్లలచెరువు మండలం ఐటివరం గ్రామం పరిధిలో 2012 మార్చి 16న కొందరు దొంగలు వేణుగోపాలస్వామి ఆలయం వద్దకు చేరారు. తవ్వకాలకు ముందుగా పూజలు నిర్వహించేందుకు పూజా సామగ్రితోపాటు పూజారిని కూడా వారివెంట తెచ్చుకున్నారు. పూజకు సిద్ధం చేస్తున్న సమయంలో పొలాలకు వెళ్లి వస్తున్న కొందరు ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనించి వారి విషయాన్ని గ్రామంలో తెలియజేశారు. వెంటనే గ్రామస్తులు అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకోవటంతోపాటు వారు వచ్చిన తుఫాన్ వాహనాన్ని నిప్పుపెట్టి తగులపెట్టారు. పోలీసులు వచ్చేవరకు ప్రజలు కాపలాఉండి వారిని పోలీసులకు అప్పగించారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో తవ్వకాలు

ఎర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం చెన్నకేశవస్వామి దేవాలయంలో కూడా ఇప్పటికి రెండుసార్లు తవ్వకాలు జరిపారు. కొప్పుకొండ వద్ద ఉన్న ఆలయంలో కూడా విగ్రహాలను పెకిలించి చూసి నిధులకోసం దొంగలు ప్రయత్నాలు చేశారు. త్రిపురాంతకం దేవాలయ ప్రాంగణంలో కూడా లెక్కలేనన్నిసార్లు గుప్తనిధులకోసం దుండగులు తవ్వకాలు జరిపారు. అక్కడ ఉన్న పెద్ద రాతి నంది విగ్రహాన్ని రెండుగా పగులగొట్టి అందులో నిధులున్నాయంటూ పరిశీలించారు. జంగం వారిసత్రం వద్ద ఉన్న పంచలింగాల ఆలయంలోకూడా పెద్ద శివలింగాన్ని దుండగులు పెకిలించి వేశారు. ఇలా ఎన్నో సంఘటనలు పశ్చిమ ప్రాంత ఆలయాల్లో చోటుచేసుకుంటున్నాయి. సంఘటనలు జరిగినప్పుడు ఆలయాల వద్దకు ఆలయ అధికారులు వచ్చి చూడటం తప్ప ఆలయాల భద్రతకు చర్యలు తీసుకొనేందుకు ఎటువంటి ప్రణాళికలు చేయటం లేదు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుని చారిత్రక సంపద దొంగల చర్యల వల్ల పాడుకాకుండా కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

గ్రీవెన్స్‌సెల్ అర్జీలను పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్: గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సీపీవో సమావేశపు హాలులో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం పలు రకాల సమస్యలను విన్నవించారు. గ్రీవెన్స్‌సెల్‌లో డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.మురళీ, సీపీవో కేటీ. వెంకయ్య, ఎస్‌డీసీ ఉదయభాస్కర్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ నాగలక్ష్మి

- ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని త్రిపురాంతకం మండలం పాత అన్నసముద్రం గ్రామానికి చెందిన కూలీలు విన్నవించారు.
- కరువుతో ప్రభుత్వం మంజూరు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ అక్రమాలపై విచారణ చేసి అర్హులైన వారికి న్యాయం చేసే విధంగా చూడాలని కొరిశపాడు మండలం రావినూతల గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వర్లు, చెంచు రామయ్య, సుబ్బారావు తదితరులు ఫిర్యాదు చేశారు.
- కర్నూలు రోడ్డులోని విరాట్‌నగర్‌లో మద్యం షాపును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని దీనిని నిలుపుదల చేయాలని ఆ కాలనీ మహిళలు, ప్రజానీకం కోరారు.
- డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక యానిమేటర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని జె.పంగులూరు మండలం చందలూరు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారు.
- ఉలవపాడు మండలం కరేడు గ్రామం జాతీయ రహదారిని కలుపుచోట ప్రజల అవసరాల కోసం ఫ్లైఓవర్‌ను నిర్మించే విధంగా చూడాలని కరేడు గ్రామ ప్రజానీకం కోరారు.
- కొన్నేళ్ల నుంచి తీసుకుంటున్న వృద్ధాప్య పెన్షన్‌ను నిలుపుదల చేశారని, తిరిగి పునరుద్ధరించే విధంగా చూడాలని నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరు గ్రామానికి చెందిన వృద్ధులు కోరారు.
- వ్యవసాయ భూమిని సర్వే చేసి ఇవ్వాలని, చలానా కట్టినా సర్వే చేయడం లేదని పొదిలి మండలం కంభాలపాడుకు చెందిన పి.శ్రీను ఫిర్యాదు చేశారు.
- తాగునీటి బావి ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని టంగుటూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన ఎస్.కె.మీరావలి ఫిర్యాదు చేశారు. గ్రామానికి ఉపయోగపడే తాగునీటి బావికి తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని నిలుపుదల చేసే విధంగా చూడాలని కోరారు.
- కందుకూరులోని ఓ బ్యాంకులో పొలం పత్రాలు పెట్టి బ్యాంకు రుణం తీసుకున్నానని, ఆ రుణం తిరిగి చెల్లించిన తర్వాత కూడా భూమి పత్రాలు ఇవ్వడం లేదని గడ్డంవారి కోష్టాలుకు చెందిన కె.వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో తీసుకున్న అప్పు చెల్లింపు కాగితాలను కూడా జేసీకి అందజేశారు.
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యూనిట్ మంజూరుచేసి ఆదుకోవాలని కురిచేడు మండలం పి.నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఎం.బాలరంగయ్య కోరారు. రుణం కోసం దరఖాస్తు చేసుకున్నానని, న్యాయం చేసి ఆదుకోవాలని విన్నవించారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలను అమలుచేయాలి

ఒంగోలు కలెక్టరేట్: ప్రభుత్వం నిర్ణయించిన ఒప్పందం ప్రకారం సుబాబుల్, జామాయిల్, సరుగుడు కర్ర కొనుగోళ్ళు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి సమస్యను వివరించారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలు అమలు జరగకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.



జేసీ నాగలక్ష్మితో మాట్లాడుతున్నరైతు సంఘాల నేతలు

వెబ్‌లాండ్, ఈ క్రాప్ బుకింగ్ కేవలం కాగితలే పరిమితమైందని జేసీకి ఫిర్యాదు చేశారు. చట్ట ఉల్లంఘనలతో దళారులు, పేపరు మిల్లుల అక్రమ వ్యాపారం కారణంగా రైతాంగం దోపిడీకి గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రయోజనాలను దెబ్బతీసే 143జీవోలోని 4 పాయింట్‌లోని(జె)క్లాజును తొలగించి ఈ జీవో ఆధారంగా జిల్లాలో ప్రకటించిన ఒప్పందంలో జామాయిల్ కర్రకు తాట తీసి సరఫరా చేయాలనే నిబంధనలను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారానే కొనుగోళ్ళు చేయడంతో పాటు పాత పద్ధతిలోనే రివాల్వింగ్ ఫండ్‌ను మార్కెట్ కమిటీలకు ఇవ్వాలని మార్కెట్ ఇంటలిజెన్స్ ఆధారంగా రైతు ఉత్పత్తి ఖర్చులను పరిగణలోకి తీసుకొని పారదర్శకంగా ధరల నిర్ణయం జరిపించాలని, అమలులో ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు, ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డె హనుమారెడ్డి, వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, వర్జీనియా పొగాకు రైతు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మారెళ్ళ బంగారుబాబు, టీవీ.శేషయ్య, జి. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అసక్తిదాయకంగా 'విందాం నేర్చుకుందాం'

ఒంగోలు విద్య: ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 'విందాం నేర్చుకుందాం' శీర్షికతో నిర్వహిస్తున్న రేడియో పాఠాలు విద్యార్థులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి సోమవారం ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు వినాయకచవితి పండుగ గురించి రేడియోలో ఆసక్తిదాయకంగా విద్యార్థులకు వివరించారు. వినాయకచవితి పండుగ పట్ల రేడియో పాఠం అవగాహన కల్గించింది. ఇంటరాక్షన్, రేడియో ఇన్‌స్ట్రక్షన్ ప్రోగ్రామ్ (ఐఆర్ఐ) కింద ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు యూపీ స్కూళ్లలో 6,7 తరగతుల విద్యార్థులకు వేరువేరుగా రేడియోపాఠాలు నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు మొత్తం 53 ఎపిసోడ్లలో ఏరోజు ఏపాఠాన్ని రేడియో ద్వారా బోధించేది షెడ్యూలు ఇచ్చారు. ఈ రేడియో పాఠాన్ని విని దీనిపై ప్రత్యేకంగా నివేదిక ఇచ్చేదుకు ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఈ ఉపాధ్యాయులు ప్రతిరోజు రేడియో పాఠం విని ఒంగోలులోని ఎస్ఎస్ఏ కార్యాలయానికి నివేదిక పంపుతారు.

కాగా, ప్రాథమిక పాఠశాలల టీచర్లకు సోమవారం విద్యార్థుల అభ్యసనంపై ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. నవంబరు 13న నిర్వహించనున్న నేషనల్ ఎచ్యూవ్‌మెంట్ (ఎన్ఏఎస్) సర్వే కోసం విద్యార్థులను సిద్ధం చేసేదుకు ఈ టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో 3,5 తరగతుల విద్యార్థులకు తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానంలో అభ్యసనంపై టెలికాన్ఫరెన్సు ద్వారా శిక్షణ ఇచ్చారు. ఎన్ఏఎస్ సర్వేలో 3,5 తరగతుల విద్యార్థులకు 45 మార్కులు చొప్పున పరీక్ష నిర్వహిస్తారు.



ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌చంద్

ఒంగోలు కలెక్టరేట్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఈనెల 23న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ప్రకాశం పంతులు జయంతి వేడుకల ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకాశం పంతులు జయింతి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలిపారు. కలెక్టరేట్‌లో ఈనెల 23వ తేదీ ఉదయం 9గంటలకు ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రకాశం భవన్‌లో జరిగే కార్యక్రమ నిర్వహణకు రెవెన్యూ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ప్రొటోకాల్ ప్రకారం అందరిని ఆహ్వానించడంతో పాటు ప్రకాశం భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కలెక్టరేట్‌కు విద్యుద్దీకరణ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ పాల్గొంటారని తెలిపారు. ప్రకాశం పంతులు జన్మస్థలమైన వినోదరాయునిపాలెంలో కోటి రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, రూ. పది లక్షలతో నిర్మించనున్న పాఠశాల ప్రహరీగోడ నిర్మాణం, పాఠశాలలో డిజిటల్ తరగతుల ప్రారంబోత్సవానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవరంపాడు ఉప్పుసత్యాగ్రహ స్థూపం వద్దకు వెళ్ళేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వినోదరాయునిపాలెంలో ప్రకాశం పంతులు విగ్రహ స్థాపనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జేసీ నాగలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పోలప్ప, చంద్రశేఖరయ్య, కేటీ వెకయ్య, ప్రసాద్, డాక్టర్ బి.రవి, విజయభాస్కర్, వెంకటకృష్ణ, ఎంఎస్. మురళీ, ఒంగోలు ఎంపీడీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్

- సెప్టెంబరులో పంపిణీ
- డీఈవో విజయభాస్కర్

ఒంగోలు విద్య: జిల్లాలోని ప్రభుత్వ రంగ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు త్వరలో నాణ్యమైన స్టడీ మెటీరియల్‌ను అందించనున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ తెలిపారు. సోమవారం స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూలులోని డీసీఈబీ కార్యాలయంలో స్టడీ మెటీరియల్ తయారీ సబ్జెక్టు నిపుణులతో నిర్వహించిన సమావేశానికి డీసీఈబీ కార్యదర్శి ఆర్.హనుమంతరావు అధ్యక్షత వహించారు. డీఈవో మాట్లాడుతూ సీసీఈ విధానంలో విద్యార్థులు తేలికగా మార్కులు సాధించేవిధంగా సబ్జెక్టు టీచర్లు మెటీరియల్‌ను తయారు చేయాలన్నారు. ఈ ఏడాది మార్చి, జూన్‌లో జరిగిన పదోతరగతి పరీక్షల ప్రశ్నాపత్రాల నమూనాలో స్టడీ మెటీరియల్‌ను రూపొందించాలన్నారు. అన్ని కేటగిరిల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని కేవలం పరీక్షలకు ఉపయోగ పడేవిధంగా స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించాలన్నారు. జిల్లాలోని 40వేల మంది పదోతరగతి పిల్లలను దృష్టిలో ఉంచుకొని సకాలంలో మెటీరియల్ అందించేలా సాధ్యమైనంత త్వరగా మెటీరియల్‌ను డీసీఈబీకి అందజేయాలన్నారు. డీసీఈబీ ఆధ్వర్యంలో ముద్రించే స్టడీ మెటీరియల్‌కు మంచి డిమాండ్ ఉంది. విద్యార్థులు స్వశక్తితో పరీక్షలు రాసేలా అత్యధిక మార్కులు సాధించేవిధంగా మెటీరియల్ ఉండాలన్నారు. విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు అత్యధిక మార్కులు సాధించే విధంగా అందరూ సమిష్టి కృషితో మెటీరియల్ తయారు చేయాలన్నారు. గత ఏడాది సరఫరా చేసిన మెటీరియల్ కంటే అదనంగా పదినుంచి 15 శాతం సబ్జెక్టు పెరిగే విధంగా స్టడీ మెటీరియల్‌ను అందజేయాలని విజయభాస్కర్ సూచించారు. వారంరోజుల్లో స్టడీమెటీరియల్ అందజేస్తే సెప్టెంబరులోనే స్టడీమెటీరయల్ విద్యార్థులకు అందిస్తామని డీఈవో తెలిపారు. సమావేశంలో సబ్జెక్టు నిపుణులు పాల్గొన్నారు.

ఆర్ఎంఎస్ఏ ఆడిట్ పూర్తి

ఒంగోలు డివిజన్ పరిధిలో రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) ద్వారా నిధులు పొందుతున్న ఉన్నత పాఠశాలల ఆడిట్ సోమవారం స్థానిక సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆర్ఎంఎస్ఏ గ్రాంటుల వినియోగం గురించి ఏఎస్ఓ జె.కృష్ణకుమార్, ఏపీఓ ఎన్.శ్రీధర్‌లు వివరించారు. 2014-15, 2015-16 ,2016-17 విద్యాసంవత్సరాలలో పాఠశాలలకు విడుదలైన ఆర్ఎంఎస్ఏ గ్రాంట్ల మంజూరు, వినియోగం గురించి ప్రోఫార్మల్లో పూర్తి సమాచారాన్ని తీసుకున్నారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్: ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో కురిచేడు మండలం వెంకటాచలంపల్లి గ్రామంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ కో ఆర్డినేటర్ బి.లక్ష్మీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. 2017-18 విద్యా సంవత్సరంలో 5,6,7 తరగతులు ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9848078024 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

నేడు విద్యార్థులకు పోటీలు

ఒంగోలు విద్య: టంగటూరి ప్రకాశం పంతులు 145వ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాలలో హైస్కూలు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో విజయభాస్కర్ తెలిపారు. ప్రకాశం పంతులు జీవిత చరిత్రపై ఈ పోటీలు జరుగుతాయి. జిల్లాలోని అన్ని యాజమాన్యాలలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతన్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చు. విజేతలకు 23న నిర్వహించే ప్రకాశం పంతులు జయంతి ఉత్సవంలో బహుమతి ప్రదానం చేస్తారని తెలిపారు.

30న సైన్సు సెమినార్

ఒంగోలు విద్య: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్సు మ్యూజియమ్స్ అద్వర్యంలో జిల్లా స్థాయి సైన్సు సెమినార్ ఈ నెల 30న ఒంగోలులోని సర్వశిక్షా అభియాన్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ తెలిపారు. స్వచ్ఛ భారత్ సైన్సు అండ్ టెక్నాలజీ పాత్ర అవకాశాలు- సవాళ్ళు అనే అంశంపై సెమినార్ జరుగతుందని తెలిపారు.


దినఫలాలు



అదృష్టసంఖ్యలు : 4, 9



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సహోద్యోగులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ప్రియతముల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల కలయిక ఆనందం కలిగిస్తుంది. సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లకు అనుకూలం. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.



మిథునరాశి: (మే21-జూన్21): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారు కీలక సమాచారం అందుకుంటారు. బదిలీలు, మార్పులకు అనుకూలం. ఇంటికి అవసరమైన వస్తువులు రవాణా అవుతాయి. విద్యా సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): సోదరీ సోదరుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. బోధన, రవాణా, స్టేషనరీ, కమ్యూనికేషన్ల రంగా వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. విలువైన పత్రాలు చేతికి అందుతాయి.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సినీ, రాజకీయ రంగాల వారు కొత్త ప్రాజెక్టులు ప్రారంభిస్తారు. కొంతకాలంగా వెంటాడుతున్న స్తబ్దత తొలగిపోయి మనసు ప్రశాంతంగా ఉంటుంది. విరామ కాలక్షేపాలు ఉల్లాసం కలిగిస్తాయి.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): దీర్ఘకాలికి పెట్టుబడులకు అనుకూలం. సినీ రాజకీయ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకంగా ఉంటుంది. ఆడిటింగ్, బ్యాంకింగ్ రంగాల వారికి ప్రోత్సాహకరం. విరాళాలు, చందాలకు వెచ్చిస్తారు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బృందకార్యక్రమాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. ఆర్థిక విషయాల్లో లక్ష్య సాధనకు పెద్దల సహకారం లభిస్తుంది. సమావేశాల్లో గౌరవ, మన్ననలు అందుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): వృత్తి, వ్యాపారాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. రక్షణ, న్యాయ, బోధన రంగాల వారికి వృత్తిపరంగా ప్రోత్సాహకరం. గౌరవ పదవులు అందుకుంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆర్థికపరమైన వ్యూహాలు ఫలిస్తాయి. రక్షణ, న్యాయ, బోధన రంగాల వారికి నిధులు సర్దుబాటవుతాయి. ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన పత్రాలు అందుకుంటారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): క్రయవిక్రయాలకు అనుకూలం. బీమా, గ్రాట్యుటీ, పన్నుల వ్యవహారాలు పూర్తి చేస్తారు. భాగస్వామి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. శ్రీవారు, శ్రీమతి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): భాగస్వామి సహకారంతో వృత్తిపరమైన లక్ష్యాలు సాధిస్తారు. విందులు, వేడుకల్లో పాల్గొంటారు. జనసంబంధాలు విస్తరిస్తాయి. స్నేహానుబంధాలు బలపడతాయి. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

2022 నాటికి నూతన భారత నిర్మాణం

● సంకల్పసే సిద్ధి సదస్సులో కేంద్రమంత్రి సుజనా పిలుపు

ఒంగోలు, కార్పొరేషన్ : యాక్షన్ లేకుండా విజన్‌తో ఏ మాత్రం ప్రయోజనం లేదని అందుకే 2022 నాటికి నూతన భారత నిర్మాణానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విజన్ విత్ యాక్షన్‌తో చేపట్టిన సంకల్పంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కేంద్ర శాస్త్ర-సాంకేతిక శాఖ మంత్రి వై.సుజనాచౌదరి పిలుపునిచ్చారు. 2022 నాటికి భారతదేశం అనే దానిపై దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాలతో చేపట్టిన సంకల్పసే సిద్ధి సదస్సు సోమవారం ఒంగోలులో జరిగింది. సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్విట్ ఇండియా ఉద్యమం 70 వసంతాల రోజున ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సుజనా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో దేశాన్ని అగ్రభాగాన ఉంచేందుకు ప్రధానమంత్రి సంకల్పం తీసుకున్నారని చెప్పారు.



సంకల్పసే సిద్ధి సదస్సులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి సుజనా

అంతటా డిజిటలైజేషన్ రావాలి

మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్సీ



విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో డిజిటలైజేషన్ రావాలి. ప్రపంచంలోనే దేశం అగ్రగామిగా నిలవాలి. విజన్ 2022 కోసం యువత నడుం బిగించాలి. నీతి ఆయోగ్ నివేదిక ఆధారంగా వంద కరువు జిల్లాలలో ప్రకాశం జిల్లాలను కరువు జిల్లాగా గుర్తించడం సంతోషంగా ఉంది. అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేయాలి.

జడ్పీకి ప్రత్యేక నిధులు కేటాయించాలి

ఈదర హరిబాబు, జిల్లా పరిషత్ చైర్మన్



స్థానిక సంస్థలు నిర్వీర్యమైపోతున్నాయి. కేవలం రూ.8 కోట్లతో జడ్పీ నిర్వహణ భారమైన అంశం. 14వ ఆర్థిక సంఘం, ఆర్‌ఆర్ నిధులు కేటాయించాలి. కేంద్ర సహాయ మంత్రి సుజనా చౌదరి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళాలి. నిధులు లేకుండా అభివృద్ధి సాధించాలంటే అసాధ్యం. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునఃపరిశీలన చేయాలి.

ప్రగతిని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలి

కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ



ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 2022 విజన్ లక్ష్యంగా నూతన భారత నిర్మాణానికి అందరం సంకల్పించుకోవాలి. జిల్లా ప్రగతిని దృష్టిలో ఉంచుకుని అధికారులు పనిచేయాలి. చెడ్డ సంస్కృతి పోవాలి. జిల్లాపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల మంజూరులో చొరవ చూపాలి. వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి, అవసరమైన ఆర్థిక వసతులు కల్పించాలి.

ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

డాక్టర్ స్వామి, ఎమ్మెల్యే, కొండపి



విజన్ 2022లో యువత పాత్ర కీలకమైంది. లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. స్మార్ట్ విలేజ్, స్మార్ట్ వార్డుల అభివృద్ధి కాన్సెప్ట్‌తో లక్ష్యాలను నెరవేర్చుకోవాలి. విద్యా, ఆరోగ్యం అవసరం, శిశు, మాతృ మరణాల సంఖ్య తగ్గించుకోవాలి. ప్రపంచంలోనే భారత దేశం అగ్రగామిగా ప్రథమ స్థానంలో నిలబెట్టడానికి కలిసికట్టుగా కృషి చేయాలి.

ప్రజల్లోకి పూర్తిస్థాయిలో చేరాలి

పోతుల సునీత, ఎమ్మెల్సీ



సంపూర్ణమైన అభివృద్ధి సాధ్యపడాలంటే ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరాలి. విద్య, వ్యవసాయం, సాంకేతికం, వైద్యం, ఆరోగ్యం, వంటి పథకాలను ప్రభుత్వం యంత్రాంగం పక్కాగా అమలు చేయాలి. క్షేత్రస్థాయి నుంచి పర్యవేక్షణతో అందరి దరి చేర్చినపుడే అభివృద్ధి సాధ్యపడుతుంది. అదే స్ఫూర్తితో అధికార యంత్రాంగం పనిచేయాలి.

రైతుల గురించి పట్టించుకోవాలి

పోతుల రామారావు, ఎమ్మెల్యే, కందుకూరు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలు పట్టించుకోవాలి. ప్రధానంగా ఫసల్ బీమా సక్రమంగా అమలు కావడం లేదు. పథకం కింద అందే నగదు 90 నుంచి వంద రోజుల్లో అందాల్సి ఉండగా, ఆచరణలో సాధ్యపడటం లేదు. సీఐఎస్ కార్యక్రమం ద్వారా ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ పాఠశాలను విస్తరించాలి. అవసరమైన సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేయాలి.

సైన్స్ లేబోరేటరీలు ఏర్పాటు చేయాలి

కంచర్ల శ్రీకాంత్, జడ్పీటీసీ, కందుకూరు



విద్య, వైద్యం, ఎంపవర్‌మెంట్, ఉపాధి అవకాశాలు, ఆరోగ్యం అందరికీ అందాలి. రూ.10 వేలు నాన్ రికరింగ్ నగదుతో గ్రామాలలో అభివృద్ధికి శ్రీకారం పలికాం. ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారం అవసరం. అభివృద్ధి అంశాలకు ఇతర రాష్ట్రాలలో పర్యటనకు జిల్లాలోని జడ్పీటీసీలకు అవకాశం కల్పించాలి. ప్రతి పాఠశాలలో సైన్స్ లేబోరేటరీలు ఏర్పాటు చేయాలి.

కేంద్ర పథకాలతో అభివృద్ధి

కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



ప్రధాని మోదీ సంకల్పం అద్వితీయం. 2022 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలన్న లక్ష్యంతో స్వచ్ఛ భారత్, బేటీ బచావో, బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన, సుకన్య బీమా యోజన, హౌసింగ్ ఫర్ ఆల్ వంటి పథకాలును ప్రవేశపెట్టారు. వాటిని సంపూర్ణంగా నెరవేర్చే దిశగా యంత్రాంగం పని చేయాలి. అపుడే 2022 విజన్ లక్ష్యం సాధ్యం.

సమష్టి కృషితో అభివృద్ధి సాధ్యం

గూడూరి ఎరిక్షన్‌బాబు, లిడ్‌క్యాప్ చైర్మన్



సంకల్ప్ సే సిద్ధి నినాదం ఒక్కరికే పరిమితం కాకుండా సమష్టిగా ముందుకెళితే అభివృద్ధి సాధ్యపడుతుంది. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణం, అన్నీ వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలు చేరువ కావాలి. జిల్లాల నీటి సమస్య ఉంది. అధిగమించడానికి అందరం కృషి చేయాలి. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎంకు చేదోడు, వాదోడుగా ఉండాలి.

మరుగుదొడ్లు నిర్మించాలి


ఆర్.కేశవరావు, సర్పంచ్, చందలూరు



జె.పంగులూరు మండలం, చందలూరు గ్రామాభివృద్ధికి అన్నీ ప్రభుత్వ శాఖల సహకారంతో ముందడుగు వేస్తున్నాం. స్వచ్ఛ భారత్‌లో భాగంగా పారిశుధ్యం మెరుగు, నూరు శాతం మొక్కలు నాటాం. గ్రామీణ శివారు ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేవు. నిర్మించుకునేలా అవగాహన కల్పించాలి. 2022 నాటికి నూరు శాతం అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ఉన్నాము.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

ఉషారాణి, జట్పీటీసీ, యద్దనపూడి



గ్రామాలు అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుంది. అందుకు అనుగుణంగా 2022 కార్యక్రమాలు రూపొందించాలి. ప్రధాని పేర్కొన్న బేటీ బచావో, బేటీ పడావో నినాదంతో ప్రతి ఆడపిల్లను కనీసం డిగ్రీ వరకు చదివించాలి. పట్టిసీమ ద్వారా కొమ్మమూరు కాలువ ద్వారా ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో సాగు నీరు విడుదలైంది.

ఉద్యోగుల పిల్లలు చేరాలి

చంద్రశేఖర్, ఎంపీపీ, టంగుటూరు



నాణ్యమైన విద్య లభించాలి. పారిశుధ్యం మెరుగుపడాలి. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2020 శ్రీకారం పలికారు. మరోసారి విజన్ 2022 స్ఫూర్తితో ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలి. విద్యాభివృద్ధికి, చిన్న పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహమందించాలి. నిధులు నేరుగా పంచాయతీలకు చేరకుండా ఎంపీపీలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

సంకల్ప సిద్ధి నినాదం అందరికీ చేరాలి

ఎస్.శ్వేత మణిచందన, బీటెక్, క్విస్ కళాశాల



క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రధాని మోదీ ఇచ్చిన చావును ఎదిరించి పోరాడు అనే నినాదం ప్రతి ఒక్కరికీ చేరాలి. అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ ప్రత్యేక గుర్తింపు సాధించింది. నూతనంగా ఉన్న సంకల్ప సిద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి. అందుకు అనుగుణంగా ప్రభుత్వ సహకారం తోడవ్వాలి.

సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

శ్రావిక సింధూరి, బీటెక్, క్విస్ కళాశాల



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ఉన్నత విద్య, సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరమైన విద్యాసంస్థలు నెలకొల్పడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేయాలి. పరిశ్రమల స్థాపన అవసరం ఉంది. విజన్ 2022 లక్ష్యం నెరవేరాలంటే అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చి సహకరిస్తే యువత విద్యావేత్తలు, శాస్త్రవేత్తలుగా రాణించగలుగుతారు.

ఆర్‌యూఎం కింద అభివృద్ధి సాధించాం

కె.నాగమణి, సర్పంచ్, సింగరాయకొండ



అర్బన్ రూరల్ మిషన్ కింద సింగరాయకొండ పంచాయతీని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాము. పట్టణాల ఆధునికీకరణలో సింగరాయకొండకు ప్రాధాన్యతనిచ్చారు. దీంతో రాబోయే ఐదేళ్లలో రూ.300 కోట్లతో అభివృద్ధి సాధించి ఆదర్శ పంచాయతీగా తీర్చి దిద్దుతాం. కేంద్ర నిధులతో పాటు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టితో మౌలిక వసతులు సమకూరుతున్నాయి.



తోలు బొమ్మలాట

గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేవి, వాటిని ఒకతరం నుంచి మరో తరానికి మోసుకెళ్లే సాంస్కృతిక సారథులు జానపద కళలు. ఒకప్పుడు పల్లెపల్లెనా వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచిన ఈ కళలు నేడు జనాదరణ, ప్రభుత్వ అండదండలు లేక 'కళ' తప్పుతున్నాయి. జానపద కళలపై ఆధారపడిన అనేక కుటుంబాలలో ఆకలికేకలు కూనిరాగాలై వినిపిస్తున్నాయి. మాతంగుల బతుకులు మగ్గిపోతున్నాయి. గంగిరెద్దులు బక్కచిక్కుతున్నాయి. పిట్టలదొర కోటు వెలసిపోయి వెక్కిరిస్తోంది. యక్షగానం ఎక్కడా వినిపించని స్థితికి చేరింది. పగటి భాగవతులు ఫుట్‌పాత్‌లపై భిక్షగాళ్లై దర్శనమిస్తున్నారు. హరిదాసులు అన్నమో రామచంద్రా అంటున్నారు. ప్రభుత్వాలు ఇవేవి తనకు పట్టనట్టు ప్రవర్తిస్తుంటే, ప్రజలు బుల్లితెర మోజులో సంప్రదాయ జానపద కళలను మూలకునెట్టేస్తున్నారు.

ఆదరణలేక కనుమరుగవుతున్న జానపదకళలు

పేదరికంలో కునారిల్లుతున్న కుటుంబాలు

ప్రభుత్వ సాయం శూన్యం

నేడు అంతర్జాతీయ జానపదకళల దినోత్సవం

జనం మరచిన జానపదం

ప్రకృతి ఒడిలో పెరుగుతూ...

జానపదులు మనోహరమైన ప్రకృతి ఒడిలో పెరుగుతూ, ఆ ప్రకృతిని తమ జానపదాలలో వర్ణిస్తూ జనాలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించే మాయామర్మమెరుగని పామరపండితులు. అందుకే భారతంలో వ్యాసుడు "కృతయజ్ఞశ్చ మేధావీబుధో జానపదశ్శుచిః" అంటూ జానపదుల్ని యజ్ఞయాగాదులు చేసిన పండితులతో సమానంగా గౌరవిస్తూ వారు ఎంతో పవిత్రులనటం విశేషం. ఎర్రనామాత్యుడు అరణ్యపర్వంలో 'జానపదుల్ పురీజనులు సంతసముంబ్రమదంబెలర్ప' అంటూ జానపద శబ్దాన్ని గ్రామీణులకన్వయిస్తాడు. ప్రకాశం జిల్లా జానపదకళలకు పెట్టని కోట. జిల్లాలో దాదాపు పదహారు రకాల జానపద కళలు అఖండంగా వెలిగాయి. అసలు జానపద సాహిత్య ప్రథమ ముద్రణ గ్రంథం పుట్టిందే ప్రకాశం జిల్లాలో. 1903వ సంవత్సరంలో తాళ్లూరుకు చెందిన జ్యోతి కోటాదాసు ముద్రించిన 'సిరియాళ వీధి భాగవతం' తెలుగులో ముద్రించిన తొలి జానపద సాహిత్యం. అయితే జానపద సాహిత్య శైలి అనేక శతాబ్దాలుగా వివిధ గ్రంథాలలో మనకు కనిపిస్తుంది. 12వ శతాబ్దంలో పాల్కురికి సోమనాథుడు రచించిన పండితారాధ్య చరిత్రలో అనేక జానపదాలు కనిపిస్తాయి.



వీధి నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

కళలకు కాపుకాస్తున్న జానపద కళాపీఠం

జానపద కళలను, కళాకారులను ప్రభుత్వం ఆదరించకున్నా ఆ కళలపట్ల మక్కువ, తన తాతముత్తాతల నుంచి వచ్చిన వారసత్వంతో అద్దంకి పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి 1998లో 'జానపద కళాపీఠాన్ని' ఏర్పాటుచేసి ప్రతి సంవత్సరం మార్చి నెలలో అద్దంకిలో జానపద ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తన శక్తిమేరకు దాతల సహాయంతో వృద్ధ జానపద కళాకారులకు ఆర్థిక సహాయం అందించటం, ప్రముఖ కళాకారులను సత్కరించటం వంటివి చేస్తూ ఆయన జానపద కళలకు జీవం పోస్తున్నారని చెప్పవచ్చు. ప్రభుత్వం చొరవ చూపి జానపద కళలను, కళాకారులను ఆదరించి ఆదుకోకపోతే రాబోయే తరాలకు జానపద కళలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందంటారు జ్యోతి చంద్రమౌళి. ఇప్పటికే ఎంతో మంది కళాకారులు జీవనంకోసం వ్యవసాయ కూలీలుగా, తాళాలు బాగుచేయటం లాంటి చిన్న చిన్న వృత్తులవైపు మళ్లుతున్నారని, అయినా వారి జీవితాలు అత్యంత దుర్భరంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజలు, ప్రభుత్వం మన సంస్కృతి, సంప్రదాయాల మణిరాశులవంటి జానపద కళలని, కళాకారులను ఆదరిస్తారని ఆశిద్దాం.



- విద్వాన్ జ్యోతి చంద్రమౌళి

జానపద కళారూపాలు అనేక రకాలు

జానపదాలలో ముఖ్యమైనవి వీధినాటకాలు, తోలుబొమ్మలాట, బుర్రకథ, కోలాటం, పిచ్చికగుళ్ళు, పగటి భాగవతులు, పంబకథలు, కాటిపాపలు, గంగిరెద్దులవారు, ఆరెబుడబుక్కలు, గారడివిద్యలు, చెక్కభజనలు, పాములవాళ్ళు, మాతంగి, జంగమలు, పులివేషాలు, హరిదాసులు ఇలా అనేక రకాల జానపద కళారూపాలు జిల్లాలో ఉండేవి. వీటిలో కొన్ని జానపద కళారూపాలు అనువంశికంగా వస్తూ తరతరాలవారు వాటిని ఆధారంగా చేసుకుని జీవించేవారు. కొన్ని జానపద కళాకారులు సంచారజాతులుగా ఉంటూ గ్రామగ్రామాన తమ కళను ప్రదర్శించి జీవనం గడిపేవారు. ముఖ్యంగా పండుగరోజులలో, తిరునాళ్ళలో, ఆఖరికి ఊరి పెద్ద ఇంటిలో ఏ శుభకార్యమైనా జానపద కళాప్రదర్శనలు ఏర్పాటయ్యేవి. రాజువెడలె రవితేజములలరగ, కుడియెడమల డాల్ కత్తులు మెరయగ అంటూ సాగే వీధి నాటకాలను తిలకించటానికి చుట్టుపక్కల ఐదారు గ్రామాల ప్రజలు బండ్లు కట్టుకుని వచ్చేవారు. బంటుపల్లి పెద ఓబులు, బండారు సుబ్బయ్య, పులి అంజయ్య, దొడ్డవరపు వెంకటరామయ్య, కనుపర్తి వెంకటేశ్వర్లు, చేవూరి బాలకోటయ్య తదితర వీధినాటక కళాకారులు నాడు ఆంధ్రదేశమంతటా జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. ఇక ఆబాలగోపాలాన్ని అలరింపజేసిన జానపద కళారూపం తోలుబొమ్మలాట. హాస్య ప్రధానంగా సాగే తోలుబొమ్మలాటలో కేతిగాడు, జుట్టుపోలిగాడు, బంగారక్క తదితరపాత్రలు కడుపుబ్బనవ్వించేవి. ఇందులో సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనంవంటి కళలు ఇమిడి ఉండేవి. జిల్లాలో తోలుబొమ్మలాట కళాకారులు అద్దంకి, దర్శి ప్రాంతాలలో ఎక్కువగా ఉన్నారు. మజ్జా హనుమంతరావు, వనపర్తి తిరుపతిరావు, రేకనార శ్రీనివాసరావు వంటి ఎందరో కళాకారులు తోలుబొమ్మలాటను అత్యంత నేత్రానందంగా ప్రదర్శిస్తూ ఉండేవారు. ఇక మరొక ముఖ్యమైన జానపద కళారూపం బుర్రకథ. తంబుర భుజాన వేసుకుని ప్రధాన కథకుడు కథ చెబుతుంటే ఇద్దరు కళాకారులు వంతపాడే సన్నివేశం నయనానందకరం. పద్మశ్రీ బిరుదుపొందిన నాజరు బుర్రకథ పితామహుడుగా పేరొందారు. ఆయనతో వంతలుపాడిన కర్నాటి నర్సయ్య, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిలు ప్రజానాట్యమండలి కళాకారులుగా సుప్రసిద్ధులు. అనంతరకాలంలో జిల్లాకు చెందిన కుమ్మరి మాష్టారు, దొడ్డారపు వెంకటస్వామి ఆంధ్రదేశాన్ని తమ బుర్రకథాగానంతో ఉర్రూతలూగించారు. ఇక శివశివ మూర్తివి గణనాథ నీవు శివునీ కుమారుడివి గణనాథ అంటూ సాగే కోలాట ప్రదర్శన ఆంధ్రుల జానపద కళారూపాలలో అతిముఖ్యమైనదిగా చెప్పొచ్చు. చినకొత్తపల్లి, పెదకొత్తపల్లి, బొమ్మనంపాడు, దర్శి తదితర చోట్ల కోలాట బృందాలు ఇప్పటికీ ఉన్నాయి. - (ఒంగోలు కల్చరల్)



తప్పెటగుళ్ళు ప్రదర్శిస్తున్న కళాకారులు



మహిళల కోలాట రూపకం



హరికథా గానం

విశిష్ట పండుగ వినాయకచవితి





పూజకు ఉపయోగించే పత్రి

ప్రకృతి ఆరాధనకే పెద్దపీట

ఆరోగ్యశాస్త్రం, ఖగోళశాస్త్రాల మేళవింపు

పూజలో వెదురుతో చేసిన పాలవెల్లి

హిందూ సంస్కృతిలో ఉగాది మొదలు ఏడాది పొడవునా ఎన్నో పండుగలు వస్తుంటాయి. వివిధ దేవుళ్లకు, దేవతలకు సంబంధించిన అనేక పండుగలను మనం జరుపుకుంటాం. అయితే అన్ని పండుగలకంటే విభిన్నమైన పండుగ 'వినాయక చవితి'. ఉగాది, శ్రీరామనవమి, శ్రీకృష్ణ జన్మాష్టమి.. ఇలా ఏ పండుగ చూసినా ఆయా దేవుళ్లను పూజించటానికి మనం వివిధ రకాల పుష్పాలను ఉపయోగిస్తుంటాం. అయితే ఒక్క వినాయకచవితి రోజున విఘ్నేశ్వరుడిని పూజించటానికి మాత్రం పత్రాలను (ఆకులను) ఉపయోగిస్తాం. దీనినే మనం పత్రిపూజ అని పిలుస్తాం. ఈ పత్రి పూజను వినాయకచవితికి ఏర్పాటు చేయటం వెనుక పెద్దల దూరదృష్టి, ఆరోగ్య శాస్త్రం ఇమిడి ఉన్నాయి. గరిక, ములక, ఉత్తరేణి, ఉమ్మెత్త, తులసి, మారేడు వంటి 21 రకాల చెట్ల ఆకులను పూజలో ఉపయోగిస్తాం. శ్రావణ, భాద్రపద మాసాలు వర్షరుతువు. ఈ కాలంలో పడే వర్షాలకు చెరువులు, కుంటలు, బావులలో కొత్తనీరు చేరుతుంది. అందులో అనేక సూక్ష్మక్రిములు చేరతాయి. అటువంటి కొత్తనీరు తాగటం వలన అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. మనం వినాయకుని పూజలో ఉపయోగించే 21రకాల ఆకులలో ప్రతి ఒక్కటి ఎన్నో ఔషధగుణాలను కలిగి ఉంటుంది. అందులో నీటిని శుభ్రంచేసేవి, రోగనిరోధకశక్తిని పెంచేవి కూడా ఉన్నాయి. తులసి కఫం నివారిస్తే, జిల్లేడు చర్మవ్యాధులను, శ్వాసకోస వ్యాధులను నశింపజేస్తుంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కొక్క రకం ఆకు వలన ఒక్కో విధమైన మేలు ఉంది. వినాయకుని పూజించిన తర్వాత ఆ పత్రిని ఊరివారందరూ చెరువులో, కుంటలో, బావులలో వేయటం వలన వాటిలోని ఆల్కలాయిడ్స్ నీటిలో కలిసి ఆ నీరు శుభ్రపడుతుంది. ఇది ఆరోగ్యరీత్యా ఎన్నో శతాబ్దాల క్రితం పెద్దలు చేసిన ఏర్పాటు. అంతేకాకుండా ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఇందులోని కొన్ని ఆకులను చేతితో తాకటం వల్లనే కొన్ని రకాల అతి సామాన్య వ్యాధులు నయమవుతాయి. ఈ ఆకులలో కొన్ని ఇంటిలో ఆరోగ్యకరమైన ప్రాణవాయువును నింపుతాయి. గతంలో ప్రతి ఊరి బయట చేల గట్ల మీద అన్ని పత్రి రకాలు లభించేవి. ప్రతి ఒక్కరు వినాయకచవితి తెల్లవారుజామున వెళ్లి అన్ని రకాల పత్రిని కోసుకుని తెచ్చేవారు. అయితే ఇప్పుడు కేవలం కొన్నిరకాలు మాత్రమే అమ్మకానికి దొరుకుతున్నాయి. ఈ విధంగా చూసినపుడు శతాబ్దాల క్రితమే పండుగ పర్యావరణ పరిరక్షణగా ఉపయోగపడేది.



ఇక అన్ని పండుగలకు ఆయా దేవుళ్ల పటాలకు పూజ చేస్తాం. అయితే ఒక్క వినాయక చవితికి మాత్రమే మట్టితో చేసిన వినాయకుని ప్రతిమను పూజిస్తాం. దీని వెనుక శాస్త్ర పరమైన కారణం ఉంది. వర్షాకాలంలో చెరువులు, కుంటలు నీటితో, మట్టితో నిండుతాయికనుక, వాటిని పూడిక తీసేవారు. అలా పూడిక తీసిన బంకమట్టితో వినాయక ప్రతిమను తయారు చేస్తారు. కాలక్రమేణా ఇది వినాయక ప్రతిమల తయారీకి చెరువులలో, కుంటలలో మట్టితీసే ప్రక్రియగా మారింది.

ఒక్క వినాయకుని పూజలో మాత్రమే వెదురుతో చేసిన 'పాలవెల్లి'ని ఉపయోగిస్తాం. ఇది ఖగోళశాస్త్రంలో చెప్పబడిన పాలపుంతగా పెద్దలు చెబుతారు. విఘ్నేశ్వరుడు మూలాధారచక్రంలో ఉంటాడని అంటే నడిమధ్యలో ఉంటాడని ఆతనిపైన ఉండేది నక్షత్రాల సముదాయమైన పాలపుంతను సూచిస్తుందని పెద్దలు చెబుతూ పిల్లలకు ఖగోళశాస్త్రంపై అవగాహన కలిగిస్తారు.




ఇక ఈ పండుగలో మరో విశేషం ఏమిటంటే పూజ చేసేటపుడు అక్కడ పిల్లల పుస్తకాలను ఉంచి పూజించటం. విఘ్నేశ్వరుడు హస్తా నక్షత్రంలో జన్మించాడు. హస్తానక్షత్రం కన్యారాశిలో ఉంటుంది. కన్యారాశికి అధిపతి బుధుడు. బుధుడు బుద్ధికారకుడు. అంటే విఘ్నేశ్వరుని పూజించటం వలన బుద్ధి అంటే విజ్ఞానం కలుగుతుందని, విజ్ఞానానికి ప్రతీక అయిన పుస్తకాలను అక్కడ ఉంచి పూజిస్తారు. ఇక వినాయకుని మీద ఉంచే గొడుగు వర్షాకాలానికి సూచికగా భావిస్తారు.

ఇలా ప్రతి కోణంలో మనం జరుపుకునే మిగతా పర్వదినాలకంటే విభిన్నమైనది, విశిష్టమైనది 'వినాయక చవితి' పర్వదినం.

(ఒంగోలు కల్చరల్)



గుండ్లకమ్మ నదిలో ప్రవహిస్తున్న నీరు



ఎత్తిపోతల పథకాల సమీపంలో ప్రవహిస్తున్న నీరు

గుండ్లకమ్మకు వర్షపు నీరు

ఎత్తిపోతల , మంచినీటి పథకాలకు ఊరట

నేడు గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు చేరే అవకాశం

అద్దంకి: గుండ్లకమ్మ నదికి నీటి ప్రవాహం వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ నదికి చేరిన నీరు క్రమేపి సాగుతూ సోమవారం ఉదయానికి అద్దంకి ప్రాంతానికి చేరింది. సాయంత్రానికి గుండ్లకమ్మ నదిలో అద్దంకి పట్టణం సమీపంలోని బ్రిడ్జి దాటి కిందకు సాగుతున్నాయి. మంగళవారం నాటికి అనమనమూరు సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీటిలో కలిసే అవకాశం ఉంది. నదిలో నీటి ప్రవాహంతో పరివాహక ప్రాంతంలో ఉన్న సుమారు 50 గ్రామాలకు మంచినీటి లభ్యతకు అవకాశం ఏర్పడింది. అదే సమయంలో ముండ్లమూరు, బల్లికురవ, అద్దంకి మండలాల్లోని 10 కి పైగా ఎత్తిపోతల పథకాలకు నీటి లభ్యత చేకూరుతుంది. దీంతో ఎత్తిపోతల పథకం ఆయకట్టు పరిధిలోని రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. మంచినీటి పథకాల ఊట బావులలో నీటి లభ్యత పెరిగే అవకాశం ఉంది.

భక్తిశ్రద్ధలతో సోమవతి అమావాస్య పూజలు

ప్రత్యేక హోమం నిర్వహించిన ఎమ్మెల్సీ కరణం

శివాలయాలలో ప్రత్యేక అభిషేకాలు

బారులు తీరిన భక్తజనం

ఒంగోలు కల్చరల్: సోమవతి అమావాస్య సందర్భంగా సోమవారం రోజున అనేక శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సోమవారం, అమావాస్య కలిసి వచ్చిన రోజును అత్యంత పవిత్రమైనసోమవతి అమావాస్యగా జరుపుకుంటారనేది విదితమే. ఈ సందర్భంగా నగరంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరాలయం, పశుపతీశ్వరాలయం, రాజరాజేశ్వర స్వామి దేవస్థానం మున్నగు చోట్ల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పరమశివునికి అభిషేకాలను నిర్వహించారు. సంతపేట సాయిబాబా మందిరంలో శాసనమండలి సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి కుటుంబసమేతంగా ప్రత్యేక హోమం, అభిషేకంలో పాల్గొన్నారు. ప్రముఖ వేదపండితులు మఠంపల్లి దక్షిణామూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది వేద పండితులు కరణం బలరామకృష్ణమూర్తిచే మహాపాశుపత హోమం, అఘోర పాశుపతహోమం నిర్వహింపచేశారు. అనంతరం ఆయన శివలింగానికి పంచామృత అభిషేకం చేశారు. సోమవతి అమావాస్య సందర్భంగా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కరణం కుటుంబీకులు

వృషభసహిత గోపూజ

సోమవతి అమావాస్యను పురస్కరించుకుని జ్ఞానసింధు ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీ బాపూజీ గో సంరక్షణశాలలో సోమవారం వృషభ సహిత గోపూజను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పరమాత్ముని రామచంద్రమూర్తి సోమవతి అమావస్య విశిష్టత, గోపూజ ఫలితం గురించి వివరించారు.



శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) పూజల కోసం బారులు తీరిన భక్తులు

India's largest trade partner?

Current Affairs & GK

A. Ravi Prakash Reddy
Senior Faculty



1. Justice Deepak Mishra, 45th Chief Justice of India, will assume office on…..
1) 27 August 2017 2) 28 August 2017
3) 29 August 2017 4) 30 August 2017
5) 31 August 2017

2. Who is the President of Kenya re-elected for second term in the August 2017 general elections?
1) Uhuru Kenyatta
2) Muhammadu Buhari 3) Jacob Zuma
4) Robert Mugabe 5) None of these

3. Ruth Pfau, popularly known as Pakistan's Mother Teresa has passed away. She hailed from which country?
1) Switzerland 2) South Sudan
3) South Africa 4) Saudi Arabia
5) Germany

4. Name the countries for first time are going to conduct Indra tri-services exercise, involving their armies, navies and the air forces in October 2017 to further ramp up military ties?
1) India and USA 2) India and UK
3) India and Russia 4) India and China
5) India and Japan

5. Usain Bolt announced retirement to athletics recently. He is widely considered to be the greatest sprinter of all time. He belongs to ……
1) Jamaica 2) Kenya 3) Zimbabwe
4) Brazil 5) None of these

6. Who was served as the Returning Officer for the 15th Presidential election held on 17 July 2017?
1) Anoop Mishra 2) Shumsher K. Sheriff
3) Hamid Ansari 4) Sumitra Mahajan
5) None of the above

7. Which of the following lines forms border between North Korea and South Korea?
1) 18th Parallel north
2) 28th Parallel north
3) 38th Parallel north
4) 48th Parallel north
5) None of the above

8. Which of the following statements correct regarding Asian Infrastructure Investment Bank (AIIB)?
1) AIIB started operation after the agreement entered into force on 25 December 2015 and opened for business on 16 January 2016.
2) The Headquarters of AIIB is in Beijing, China.
3) Jin Liqun (China) is currently President of AIIB.
4) AIIB is an multilateral development bank that aims to support the building of infrastructure in the Asia-Pacific region.
5) All of the above

9. Which of the following bank has introduced biometric attendance in the place of the existing system of signing attendance in the attendance register?
1) State Bank of India
2) Punjab National Bank
3) Corporation Bank
4) Bank of India 5) None of these

10. The Senior IAS officer from Gujarat S. Aparna is appointed as Executive Director of the …….
1) World Bank
2) International Monetary Fund
3) World Trade Organisation
4) SAARC 5) None of these

11. Who defeated China's Zulpikar Maimaitiali in the unified WBO Asia Pacific and Oriental Super Middle weight title?
1) Vijender Singh 2) Manoj Kumar
3) Jitender Kumar 4) Gurcharan Singh
5) None of these

12. Match the following?

Author	Book
A. Y.V.Reddy	(i) A Life in Science
B. C.N.R.Rao	(ii) Advice and Descent : My Life in Public Service
C. Arundhati Roy	(iii) Matoshree
D. Sumitra Mahajan	(iv) The Ministry of Utmost Happiness

	A	B	C	D
1)	(i)	(ii)	(iii)	(iv)
2)	(iv)	(iii)	(ii)	(i)
3)	(i)	(iii)	(ii)	(iv)
4)	(ii)	(i)	(iv)	(iii)
5)	(iv)	(i)	(iii)	(ii)

13. The 75th anniversary of the Quit India Movement was observed across the country on ……
1) 7th August 2017 2) 8th August 2017

FOR ALL COMPETITIVE EXAMS

3) 9th August 2017 4) 10th August 2017
5) None of these

14. The Eighth Mekong-Ganga Cooperation Ministerial Meeting (8th MGCMM) was held on 7 August 2017 in..
1) Manila, Philippines
2) Bangkok, Thailand 3) Hanoi, Vietnam
4) Phnom Penh, Cambodia
5) None of these

15. Find the Arundhati Roy's first novel?
1) The God of Small Things
2) The End of Imagination
3) The Cost of Living
4) The Greater Common Good
5) The Algebra of Infinite Justice

16. Usain Bolt, greatest sprinter, belongs to …..
1) South Africa 2) South Sudan
3) South Korea 4) Sierra Leone
5) None of these

17. World's largest Crude Oil importer?
1) China 2) USA 3) India 4) Japan
5) None of these

18. World's largest Crude Oil exporter?
1) Saudi Arabia 2) Russia 3) Iraq
4) Canada 5) None of these

19. India's largest trade partner?
1) China 2) USA 3) UAE
4) Saudi Arabia 5) None of these

20. NABARD has conferred the 'best performance award' for 2016-17 to which regional rural bank?
1) Andhra Pragathi Grameena Bank
2) Karnataka Vikas Grameena Bank
3) Telangana Grameena Bank
4) Kaveri Grameena Bank
5) None of these

21. Who is the author of book "The Adivasi Will Not Dance"?
1) Arundhati Roy
2) Hansda Sowvendra Shekhar
3) Chetan Bhagat 4) Amitav Ghosh
5) None of these

22. Which state has the highest number of elephants, as per the Elephant census report 2017, released by the Union Ministry of Environment, Forests and Climate Change (MoEFCC)?
1) Karnataka 2) Assam 3) Kerala
4) Tamil Nadu 5) None of these

23. Who is the Union Minister for Environment, Forests and Climate Change?
1) Suresh Prabhu 2) Prakash Javadekar
3) Harsh Vardhan
4) Thawar Chand Gehlot
5) Radha Mohan Singh

24. India's Elephant population as per Elephant Census 2017 released by Union Ministry of Environment, Forests and Climate Change (MoEFCC)?
1) 27,312 2) 37,312 3) 47,312
4) 57,312 5) None of these

25. What is the nation wide campaign to protect elephants, launched by Union Ministry of Environment and Forests on the occasion of World Elephant Day observed on 12th August 2017?
1) Project Elephant
2) Project Heritage Animal
3) Project Gaja Raja 4) Gaj Yatra
5) None of these

26. Which of the following is the India's largest Regional Rural Bank (RRB)?
1) Andhra Pragathi Grameena Bank
2) Prathama Bank
3) Allahabad UP Gramin Bank
4) Maharashtra Gramin Bank
5) Kerala Gramin Bank

27. Mercosur is a sub-regional bloc between countries of which of the following continents?
1) North America
2) South America
3) Africa 4) Asia 5) None of these

28. McMohan Line represents boundary between which following two countries?
1) India and Afghanistan
2) India and Pakistan 3) India and China
4) India and Bangladesh 5) None of these

29. Which company occupies No.1 position in Fortune Global 500 list 2017, which ranks companies by their revenues in 2016?
1) Walmart 2) State Grid
3) Sinopec Group
4) China National Petroleum
5) Toyota Motors

30. How many Indian companies listed in Fortune Global 500 companies list?
1) 6 2) 7 3) 8 4) 9 5) None of these

31. SBI's rank in the Fortune Global 500 companies list?
1) 117 2) 217 3) 317 4) 417
5) None of these

32. Match the following?

Company	Country
A. Toyota Motors	(i) USA
B. Berkshire Hathaway	(ii) Germany
C. Volkswagen	(iii) South Korea
D. Samsung Electronics	(iv) France
E. AXA	(v) Japan

	A	B	C	D	E
1)	(ii)	(iii)	(iv)	(v)	(i)
2)	(iii)	(iv)	(ii)	(i)	(v)
3)	(iv)	(iii)	(i)	(ii)	(v)
4)	(i)	(ii)	(iii)	(iv)	(v)
5)	(v)	(i)	(ii)	(iii)	(iv)

33. First bank to introduce ATM in India was HSBC in…
1) 1957 2) 1967 3) 1977 4) 1987
5) None of these

Answers

1) 2	6) 1	11) 1	16) 5	22) 1	28) 3
2) 1	7) 3	12) 4	17) 1	23) 3	29) 1
3) 5	8) 5	13) 3	18) 1	24) 1	30) 2
4) 3	9) 2	14) 1	19) 1	25) 4	31) 2
5) 1	10) 1	15) 1	20) 2	26) 5	32) 5
			21) 2	27) 2	33) 4

Jobs ఉద్యోగాలు

బిఇసిఐఎల్

బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బిఇసిఐఎల్) - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 42
- **కంటెంట్ ఆడిటర్**

ఖాళీలు: 1
అర్హత: పీజీ డిప్లొమా(జర్నలిజం/ మాస్ కమ్యూనికేషన్) + విజువల్ మీడియా లేదా న్యూస్ ఏజెన్సీ(ఎఎన్ఐ/ పిటిఐ/ యుఎన్ఐ)ల్లో మూడేళ్ల అనుభవం ఉండాలి. లేదా న్యూస్ ఎడిటర్/ డిప్యూటీ డైరెక్టర్ (న్యూస్) గా పనిచేసి రిటైర్ అయి ఉండాలి.
- **సీనియర్ మానిటర్**

ఖాళీలు: 3
అర్హత: పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం ఉత్తీర్ణత + మీడియా / న్యూస్ ఏజెన్సీల్లో రెండేళ్ల అనుభవం ఉండాలి. లేదా న్యూస్ ఎడిటర్/ అసిస్టెంట్ డైరెక్టర్(న్యూస్) గా పనిచేసి రిటైర్ అయి ఉండాలి.
- **మానిటర్**

ఖాళీలు: 38
అర్హత: గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత + కంప్యూటర్ పరిజ్ఞానం + ప్రాంతీయ భాషల్లో ప్రావీణ్యం ఉండాలి. పీజీ డిప్లొమా(జర్నలిజం)/డిగ్రీ(జర్నలిజం / మాస్ కమ్యూనికేషన్) పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.300
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.becil.com

సిఎస్ఐఆర్ నెట్

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సిఎస్ఐఆర్)- నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)కు ప్రకటన విడుదల చేసింది.
విభాగాలు: కెమికల్ సైన్సెస్/ ఎర్త్, అట్మాస్ఫియరిక్/ ఓషన్/ ప్లానెటరీ సైన్సెస్/ లైఫ్ సైన్సెస్/ మేథమెటికల్ సైన్సెస్/ ఫిజికల్ సైన్సెస్
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఎమ్మెస్సీ / తత్సమాన పరీక్ష/ ఇంటిగ్రేటెడ్ బిఎస్- ఎంఎస్/ నాలుగేళ్ల బిఇ/ బిటెక్/ బిఫార్మసీ/ ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: జెఆర్ఎఫ్‌లకు జూలై 1 నాటికి 28 ఏళ్లు మించరాదు. లెక్చరర్‌షిప్‌నకు వయోపరిమితి నిబంధన లేదు.
సిఎస్ఐఆర్ - యుజిసి టెస్ట్ జరిగే తేదీ: డిసెంబరు 17
పరీక్ష కేంద్రాలు: గుంటూరు, హైదరాబాద్
పరీక్ష ఫీజు: రూ.1000(ఒబిసిలకు రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.)
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 23 నుంచి
ఫీజు డిపాజిట్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
ఆన్‌లైన్ దరఖాస్తునకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 16
ఆన్‌లైన్ దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 23
వెబ్‌సైట్: www.csirhrdg.res.in

పీజెటిఎస్ఎయు

హైదరాబాద్, రాజేంద్ర నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (పీజెటిఎస్ఎయు)- **అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 224
విభాగాలు: అగ్రికల్చర్ 186(6 పోస్టులను లైబ్రరీ సైన్స్‌కు కేటాయించారు), అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 22, హోం సైన్స్ 16
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 20
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 29
వెబ్‌సైట్: www.pjtsau.ac.in

బల్బులోని ఫిలమెంటును దేనితో తయారు చేస్తారు?

విద్యుత్

1. విద్యుత్ ప్రవాహం ------
ఎ) సదిశ రాశి బి) అదిశ రాశి
సి) ఎ, బి డి) ఎ, బి లు కావు

2. ఓం, వెబ్ ఓంల మధ్య సంబంధం?
ఎ) 1 Ω = 10^{10} ab Ω బి) 1 Ω = 10^{8} ab Ω
సి) 1 Ω = 10^{9} ab Ω డి) 1 Ω = 10^{7} ab Ω

3. మూడు నిరోధాలను శ్రేణిలో కలిపితే ఫలిత నిరోధం R_1, సమాంతరంగా కలిపితే ఫలిత నిరోధం R_2 అయితే R_1 / R_2 విలువ?
ఎ) 3 బి) 9 సి) 1/9 డి) 1/3

4. ఒక ఆదర్శ అమ్మీటర్ నిరోధం?
ఎ) సున్నా బి) అనంతం సి) 1000 Ω డి) 10 Ω

5. ఓం నియమం అనువర్తించకూడనిది?
ఎ) ఎసి వలయం
బి) అధిక ఉష్ణోగ్రత ఉన్న వాహకాలు
సి) వాహకాలు డి) అర్ధ వాహకాలు

6. ఒక నిరోధం పొడవును రెట్టింపు చేస్తే నిరోధం?
ఎ) సగమవుతుంది బి) రెట్టింపవుతుంది
సి) నాలుగోవంతవుతుంది డి) మారదు

7. ప్రామాణిక నిరోధాలు తయారుచేయడానికి వాడే పదార్థం?
ఎ) రాగి బి) కాన్‌స్టంటన్ సి) వెండి డి) టంగ్‌స్టన్

8. 1 KWH విలువ =
ఎ) 36 x 10^5 J బి) 36 x 10^5 ev
సి) 36 x 10^6 J డి) 36 x 10^3 J

9. వివిధ సంయోగాలతో రెండు ఫలిత నిరోధాలు 18 Ω, 4 Ω . అయితే ఆ నిరోధాలు Ω లలో
ఎ) 9, 9 బి) 11, 7 సి) 6, 12 డి) 10, 8

10. ఒక వాహకం ద్వారా 0.5 ఆంపియర్ విద్యుత్ ప్రవహిస్తుంది. అయితే ఒక నిముషంలో దాని ద్వారా ప్రవహించిన ఆవేశం?
ఎ) 3C బి) 0.3C సి) 33C డి) 30C

11. విద్యుత్ ప్రవాహం వల్ల అయస్కాంత ఫలితం కలుగుతుందని కనుగొన్నది?
ఎ) మాక్స్‌వెల్ బి) ఆయిర్‌స్టెడ్ సి) ఫెర్మి డి) ఫ్లెమింగ్

12. ప్రేరిత విద్యుచ్ఛాలక బలం దిశను తెలుసుకోవడానికి ఉపయోగించే నియమం?
ఎ) ఆంపియర్ ఎడమచేతి నిబంధన
బి) మాక్స్‌వెల్ నిబంధన
సి) ఫ్లెమింగ్ ఎడమచేతి నిబంధన
డి) ఫ్లెమింగ్ కుడి చేతి నిబంధన

13. స్వయం ప్రేరణ గుణకానికి, అన్యోన్య ప్రేరణ గుణకానికి ఎస్ఐ ప్రమాణాలు వరసగా?
ఎ) హెన్రీ, ఫారడ్ బి) ఫారడ్, ఫారడ్
సి) హెన్రీ, హెన్రీ డి) ఫారడ్ హెన్రీ

14. ఒక తీగచుట్ట నుంచి నిలువుగా వదలిన దండయస్కాంతం తీగచుట్టలో నుంచి కిందికి పడుతోంది. దాని త్వరణం?
ఎ) g కంటే ఎక్కువ బి) g కంటే తక్కువ
సి) g కి సమానం డి) పైవేవీ కావు

15. పాస్ఫర్ - బ్రాంజ్ ధర్మం?
ఎ) యంగ్ గుణకం ఎక్కువ, దృఢతా గుణకం తక్కువ
బి) యంగ్ గుణకం తక్కువ, దృఢతా గుణకం ఎక్కువ
సి) యంగ్ గుణకం ఎక్కువ, దృఢతా గుణకం ఎక్కువ
డి) యంగ్ గుణకం తక్కువ, దృఢతా గుణకం తక్కువ

16. ఫ్యూజ్ వైర్ ముఖ్య ధర్మాలు
ఎ) తక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
బి) ఎక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
సి) తక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
డి) ఎక్కువ నిరోధం, ఎక్కువ ద్రవీభవన స్థానం

17. 'గాస్' కు సమానమైన విలువ?
ఎ) 10^4 T బి) 10^3 T సి) 10^2 T డి) 10T

18. రెండు ఎలక్ట్రానిక్ పుంజాలు సమాంతరంగా ఒకే దిశలో ఉన్నాయి. అవి
ఎ) వికర్షించుకొంటాయి బి) ఆకర్షించుకొంటాయి
సి) వాటి వేగాలు తగ్గుతాయి
డి) ఎటువంటి అన్యోన్య ప్రభావం ఉండదు

19. అయస్కాంత అభివాహంలో మార్పు ఆగిపోయినపుడు ప్రేరిత విద్యుచ్ఛాలక బలం?
ఎ) తగ్గుతుంది బి) స్థిరం
సి) శూన్యం డి) పెరుగుతుంది

20. సమాంతరంగా షంట్ నిరోధాన్ని కలిపిన గాల్వనోమీటర్‌ను వలయంలో శ్రేణిలో కలిపితే ఆ అమరిక పేరు?
ఎ) వోల్టుమీటరు బి) అమ్మీటరు
సి) మల్టిమీటరు డి) ఓం మీటరు

21. B, H, I ల సంబంధం?
ఎ) $B = u_0H$
బి) $B = u_0 (H + I)$
సి) $B = u_0 I + H$ డి) $B = uH$


22. కండెన్సర్ పలకల మధ్య నిరోధకాన్ని ఉంచితే స్థితి శక్తి?
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) మారుతుంది.

23. ఒక కండెన్సర్‌లో నిలువ ఉండే శక్తి?
ఎ) QV బి) QC / 2 సి) QV/2 డి) 1/2 CV/2

24. సబ్బు బుడగను ఆవేశ పరిస్తే?
ఎ) వ్యాకోచిస్తుంది బి) సంకోచిస్తుంది
సి) పేలిపోతుంది
డి) ఎటువంటి మార్పునకు లోను కాదు


శీలం దేవేందర్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం - ఫిజిక్స్



25. ఎలక్ట్రాన్ల శక్తిని పెంచాలి అంటే వాటిని -------
ఎ) బాగా ఎత్తునుంచి కిందికి పడవేయాలి
బి) సీసం దిమ్మె ద్వారా పంపాలి
సి) విద్యుత్ పొటెన్షియల్ ద్వారా ప్రయాణం చేయించాలి
డి) అధికంగా వేడిచేయాలి.

26. ఒక వస్తువు ఆవేశానికి, పొటెన్షియల్‌కు గల నిష్పత్తి?
ఎ) వాహకత్వం బి) కెపాసిటెన్స్
సి) ప్రేరకత్వం డి) నిరోధం

27. ఒక సర్పిలాకారపు స్ప్రింగ్ ద్వారా ఏకముఖ విద్యుత్ ప్రవాహాన్ని పంపారు. ఆ స్ప్రింగ్ -----
ఎ) సాగుతుంది బి) గుండ్రంగా తిరుగుతుంది
సి) సంకోచిస్తుంది డి) ఏదీకాదు

28. 100 w, 200V బల్బు నిరోధం ------
ఎ) 200 Ω బి) 100Ω సి) 150Ω డి) 400Ω

29. మానవుని నిరోధం సుమారు -------
ఎ) 10^2 Ω బి) 10^4 Ω సి) 10^5 Ω డి) 10^6 Ω

30. ఒక అర్థ వాహకం ఉష్ణోగ్రతను పెంచినపుడు దాని నిరోధం
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) పైవేవీ కాదు

31. 3Ω నిరోధం గల తీగను మూడు సమాన భాగాలుగా కత్తిరించారు. ఆ తరవాత ఈ మూడు భాగాలను వాటి చివరలు కలిసేటట్లు ముడిపెట్టారు. ఈ అనుసంధాన నిరోధం?
ఎ) 3 Ω బి) 1/3 Ω సి) 2/3 Ω డి) 1Ω

32. శక్మాంతరాన్ని -------తో కొలుస్తారు?
ఎ) అమ్మీటర్ బి) గాల్వనా మీటర్
సి) ఓల్టు మీటర్ డి) కెపాసిటర్

33. మేఘాలలోకి గాలి పటాలను ఎగురవేసి అవి విద్యుదావేశంతో ఉంటాయని నిరూపించిన శాస్త్రవేత్త--------
ఎ) ఆంపియర్ బి) ఆయిర్‌స్టెడ్
సి) ఫ్లెమింగ్ డి) ఫ్రాంక్లిన్

34. రేడియో, టార్చిలైట్, టేపు రికార్డర్లలో ఉపయోగించే ప్రాథమిక ఘటం?
ఎ) వోల్టా ఘటం బి) అనార్ద్ర ఘటం
సి) లెక్లాంచి ఘటం డి) బైక్రోమేట్ ఘటం

35. టెలిగ్రాఫ్‌ల్లో ఉపయోగించే కోడ్?
ఎ) పిన్ బి) BCD సి) మోర్స్ డి) టెలి

36. ఎలక్ట్రిక్ బల్బుల్లో నింపే వాయువు?
ఎ) హైడ్రోజన్ బి) ఆర్గాన్
సి) ఆక్సిజన్ డి) నైట్రోజన్

37. కరెంట్ ప్రయాణించడానికి అది ఏ మార్గాన్ని ఎంచుకొంటుంది?
ఎ) గరిష్ఠ నిరోధం బి) మధ్యస్థ
సి) కనిష్ఠ నిరోధం డి) పైవేవీ కాదు

38. షార్ట్ సర్క్యూట్ అయినపుడు వలయంలో కరెంట్?
ఎ) పెరుగుతుంది బి) స్థిరంగా ఉంటుంది
సి) తగ్గుతుంది డి) చెప్పలేం

39. విశిష్ట నిరోధానికి ప్రమాణం?
ఎ) ఓం/ మీటర్ బి) మో/ మీటర్
సి) ఓం మీటర్ డి) మీటర్ / మో

40. బల్బులోని ఫిలమెంటును దేనితో తయారు చేస్తారు?
ఎ) నిక్రోం బి) టంగ్‌స్టన్
సి) మాంగనీస్ డి) క్రోమియం

41. విద్యుత్ప్రవాహం వల్ల ఉష్ణ ఫలిత అనువర్తనం?
ఎ) విద్యుత్ - ఇస్త్రీ పెట్టె బి) ఇమ్మర్షన్ హీటర్
సి) ఎలక్ట్రిక్ స్టౌ డి) పైవన్నీ

42. విద్యుత్ పని w, కరెంట్ i, నిరోధం R, కాలం t ల మధ్య సంబంధం?
ఎ) $w = iRt$ బి) $w = i^2 R/t$
సి) $w = i^2Rt$ డి) $w = i^2t/R$

43. ఒక విద్యుత్ సాధనం వాటేజ్(P)ను తెలిపే సమీకరణం?
ఎ) $p = vi$ బి) $p = v^2/R$
సి) $p = i^2R$ డి) పైవన్నీ

44. ఇళ్లలోకి సరఫరా చేసే విద్యుత్ పొటెన్షియల్ భేదం?
ఎ) 220v బి) 130v సి) 240v డి) 180v

45. నిత్య జీవితంలో విద్యుత్ శక్తిని కొలిచేందుకు ఉపయోగించే పెద్ద ప్రమాణం
ఎ) వాట్ - గంట బి) కిలోవాట్ - గంట
సి) వాట్ - సెకను డి) జౌల్ / సెకను

46. విద్యుత్ ప్రవాహం వల్ల ఉత్పత్తి అయ్యే ఉష్ణరాశిని కొలిచే సూత్రం?
ఎ) $Q = mst$ బి) $Q = ms/t$
సి) $Q = m/st$ డి) $Q = ms$

47. విద్యుత్ రసాయన తుల్యాంకానికి ప్రమాణాలు?
ఎ) గ్రామ్/ కూలూమ్ బి) గ్రామ్ కూలూమ్
సి) కూలూమ్/ గ్రాం డి) గ్రామ్ / ఆంపియర్

48. విద్యుద్విశ్లేషణం వల్ల కాపర్ సల్ఫేట్ ద్రావణం గాఢత-----
ఎ) పెరుగుతుంది బి) మారదు సి) తగ్గుతుంది
డి) పెరిగి తగ్గుతుంది

49. విద్యుత్ప్రవాహం వల్ల ఏదైనా బిందువు వద్ద ఏర్పడిన అయస్కాంత క్షేత్ర (B) దిశ ఆ బిందువు వద్ద గీసిన ------- దిశలో ఉంటుంది.
ఎ) అభిలంబ రేఖ బి) సరళరేఖ
సి) స్పర్శ రేఖ డి) ఏదీకాదు

50. ప్రాంతీయ ట్రాన్స్‌ఫార్మర్లు------
ఎ) స్టెప్ అప్ ట్రాన్స్‌ఫార్మర్
బి) స్టెప్ డౌన్ ట్రాన్స్‌ఫార్మర్
సి) స్టెప్ అప్, స్టెప్ డౌన్ ట్రాన్స్‌ఫార్మర్
డి) ఏదీ కాదు

సమాధానాలు

1) బి	9) సి	17) ఎ	25) సి	34) బి	43) డి
2) సి	10) డి	18) బి	26) బి	35) సి	44) సి
3) బి	11) బి	19) సి	27) సి	36) బి	45) బి
4) ఎ	12) డి	20) బి	28) డి	37) సి	46) ఎ
5) డి	13) సి	21) బి	29) సి	38) ఎ	47) ఎ
6) బి	14) బి	22) బి	30) బి	39) సి	48) బి
7) బి	15) ఎ	23) ఎ	31) బి	40) బి	49) సి
8) ఎ	16) బి	24) ఎ	32) సి	41) డి	50) బి
			33) డి	42) సి	

ఉద్యోగాలు

డిఎంఇ

ఆంధ్రప్రదేశ్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) - అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 198
విభాగాలు: అనాటమీ/ ఫిజియాలజీ/ ఫార్మకాలజీ/ మైక్రోబయాలజీ/ ఎమర్జెన్సీ మెడిసిన్/ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్
అర్హత: (ఎమ్మెస్/ ఎండి)(అనాటమి)/ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ (మెడికల్ అనాటమీ) + పిహెచ్‌డి(మెడికల్ అనాటమీ)/ (ఎమ్మెస్సీ + డిఎస్సీ)(మెడికల్ అనాటమీ)/ ఎండి(ఫిజియాలజీ)/ ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ (ఫిజియాలజీ)/ (ఎమ్మెస్సీ+ పిహెచ్‌డి)(మెడికల్ ఫిజియాలజీ)/ ఎండి(బయోటెక్నాలజీ/ మైక్రో బయాలజీ/ ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ(బ్యాక్టీరియాలజీ/ మెడికల్ బ్యాక్టీరియాలజీ) + పిహెచ్‌డి(మెడికల్ బ్యాక్టీరియాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: జూలై 1 నాటికి 40 ఏళ్లు మించరాదు
ఎంపిక: అకడమిక్ మెరిట్ లిస్ట్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1000
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కానీ పర్సనల్‌గా గానీ కింది చిరునామాకు పంపుకోవాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 4
చిరునామా: Director of Medical Education, AP, Vijayawada
వెబ్‌సైట్: www.dme.ap.nic.in

అడ్మిషన్స్

టాటా మెమోరియల్ హాస్పిటల్

టాటా మెమోరియల్ హాస్పిటల్ - కేన్సర్ పేషెంట్లకు క్లినికల్ కేర్ & సైకో సోషల్ కేర్ అందించేందుకు ఉద్దేశించిన **'పేషెంట్ నేవిగేటర్ సర్టిఫికెట్ కోర్స్'**కు దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు కాల వ్యవధి: ఆరునెలలు
కోర్సు ఫీజు: రూ.18,000
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: https://tmc.gov.in

యూనివర్సిటీ ఆఫ్ లక్నో

యూనివర్సిటీ ఆఫ్ లక్నో - **ఎంబిఏ** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది
కోర్సు విభాగాలు: ఫైనాన్స్ & కంట్రోల్/ హెచ్ఆర్& ఐఆర్/ ఇంటర్నేషనల్ బిజినెస్/ మార్కెటింగ్
అర్హత: 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణ.
ఎంపిక: క్యాట్ 2017 స్కోరు ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా క్యాట్ 2017కు దరఖాస్తు చేసుకొని ఆ తరవాత లక్నో యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోవాలి.
క్యాట్ రిజిస్ట్రేషన్: సెప్టెంబరు 20 వరకు
క్యాట్ 2017 ఎగ్జామ్: నవంబరు 26
యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ: 2018 జనవరి 31
వెబ్‌సైట్: www.lkouniv.ac.in

ఐఐటిబి - మోనాష్

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటిబి), ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని మోనాష్ యూనివర్సిటీ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'ఐఐటిబి - మోనాష్ రీసెర్చ్ అకాడమీ - **పిహెచ్‌డి ప్రోగ్రామ్**నకు దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సైన్స్/ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ ఐటి/ ఇంజనీరింగ్/ హ్యూమానిటీస్/ సోషల్ సైన్సెస్/ డిజైన్ / మేథమెటిక్స్
అర్హత: ఫస్టు క్లాస్ మార్కులతో పీజీ/ బిఎస్సీ/ బిఇ/ బిటెక్ పూర్తిచేసి ఉండాలి. గేట్/ జిఆర్ఇ/ సిఎస్ఐఆర్- నెట్ / జామ్ ఎగ్జామ్స్‌లో అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
వెబ్‌సైట్: www.iitbmonash.org

భవిత కేంద్రం తనిఖీ

త్రిపురాంతకం: భవిత కేంద్రాన్ని మండల విద్యాశాఖాధికారి కేటీ మల్లికార్జున్ నాయక్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ వైద్య పరీక్షలను పరిశీలించారు. 10 మంది విద్యార్థులు హాజరు కాగా, ఎక్కువ మంది హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఐఈఆర్టీలకు ఆయన సూచించారు. అనంతరం భవిత కేంద్రం నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యులు వి.అంకారావు, ఐఈఆర్టీలు సీహెచ్.వెంకటేశ్వర్లు, బాల విజయ పాల్గొన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మల్లికార్జున్

ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్

త్రిపురాంతకం: ప్రాథమిక పాఠశాలలో తెలుగు, ఆంగ్లం, గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులకు స్థానిక జడ్పీ పాఠశాలలో అభ్యసన సామర్థ్యాలపై టెలీకాన్ఫరెన్స్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కేటీ మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని తరగతులలో వారి స్థాయిని బట్టి తగిన సామర్థ్యాలు తప్పనిసరిగా వచ్చి ఉండాలని దీని కోసం అదనపు సమయాన్ని కేటాయించి ఫలితాలు రాబెట్టాలని ఉపాధ్యాయులను కోరారు. శ్రద్ధగా వినడం, భావ వ్యక్తీకరణ, పఠన సామర్థ్యం, లేఖనం, స్వీయ కల్పనతో కథలు, కవితలు రాయడం, భాష, లయ, ప్రాసనలపై విద్యార్థులకు అవగాహన, ప్రావీణ్యం కల్పించాలన్నారు. ఆంగ్లం, గణితంలో కూడా నూతన ఒరవడితో బోధన సాగించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశేఖరరెడ్డి, బి.భీమశేఖరరావు, వైఎస్ ఆర్కే ప్రసాదు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆదినారాయణరెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రేడియో తరగతులు సోమవారం నిర్వహించారు. వీరాయిపాలెం హెచ్ఎం జోత్స్న, టీచర్లు నవనీత రేడియో క్లాసులు నిర్వహించారు.

పెద్దారవీడు: విద్యావనరుల కార్యాలయంలో ఉపాధ్యాయులకు సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్‌పీ వెంకటరెడ్డి పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పుల్లలచెరువు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీల కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 23 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మాణిక్యరావు తెలిపారు. 23న ఎస్టీ, మైనార్టీలకు, 24న బీసీ, కాపులకు, 28న ఎస్సీలకు ఇంటర్వ్యూలు పుల్లలచెరువు ఎంపీడీవో కార్యాలయంలో 10 గంటల నుంచి లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయని తెలిపారు. ఆధార్, రేషన్, కులధృవీకరణ పత్రం, బ్యాంకు పాసుబుక్, దరఖాస్తు అప్లికేషన్‌తో హాజరుకావాలని కోరారు.

పెద్ద దోర్నాల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపికలకు పాల్గొనాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. 23వ తేదీ ఉదయం ఎస్టీ, మధ్యాహ్నం మైనార్టీ, 24న బీసీ, మధ్యాహ్నం కాపు, 28న ఎస్సీ వర్గానికి చెందిన అభ్యర్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

వాగులా మారిన హైవే రోడ్డు

- **రోడ్లపైకి మురుగు నీరు**
- **కాల్వల ఆక్రమణ కారణం**
- **ఆధునిక డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి**

ఎర్రగొండపాలెం : పట్టణంలోని జాతీయ హైవే రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన మురుగు కాల్వలు నిర్లక్ష్యం కారణంగా నీరు పోయే మార్గం లేకుండా పోయింది. చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారీ కాల్వ నుంచి నీరు రోడ్లపైకి పారుతుంది. 2009లో 1000 మీటర్లు పొడవునా కోటికి పైగా నిధులు వెచ్చించి ఈ కాల్వలను నిర్మించారు. కొందరు భవన యజమానులు ఇరువైపులా కాల్వలను ఆక్రమించారు. కాల్వలను శుభ్రం చేయడానికి వీలులేకుండా సిమెంట్ దిమ్మలు వేసి బడ్డీ బంకులు, రేకుల షెడ్లు, చిన్నచిన్న దుకాణాలు కాల్వపైనే ఏర్పాటు చేశారు. దీంతో కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మురుగు కాల్వ ఆక్రమణతో కుచించుకుపోతోంది. మురుగునీరు రోడ్లపైకి రావడంతో మార్జిన్‌లో వేసిన బీటీ రోడ్డడకు కోతకు గురరై రోడ్లు ధ్వంసమవుతున్నాయి. హైవే రోడ్డుకు ఇరు పక్కల ఉన్న ఆక్రమణలను తొలగించకపోవడంతో కొత్తగ మంజూరైన సైడు కాల్వలు నూతన విధానంతో నిర్మించాల్సి ఉండగా, ఆక్రమణల కారణంగా కాంట్రాక్టర్ కాల్వలు నిర్మించకుండానే పనులు ముగించే ప్రయత్నంలో ఉన్నారు. ఆక్రమణలు తొలగించడంలో రెవెన్యూ అధికారులు సహకరించలేదని సాకుగా చూపి హైవే అథారిటీ ఇంజనీర్లు శ్రద్ధ చూపడంలేదు. నాడు నిర్మించిన కాల్వలను తొలగించి, కొలతలు పెంచి తిరిగి నిర్మించేందుకు నిధులు విడుదలైనా నిర్మాణానికి ముందుకు రావడంలేదు. ఆక్రమణలు తొలగించి కాల్వను నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



జాతీయ రహదారిపై నిలిచిన నీరు

గ్యాస్‌పై భోజనం వండాలి



గ్యాస్ పొయ్యిని ప్రారంభిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

ఎర్రగొండపాలెం : ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంను మధ్యాహ్న భోజనంను గ్యాస్ పై వంటచేసి విద్యార్థులకు వడ్డించాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. సోమవారం ప్రాథమిక పాఠశాలలో గ్యాస్ పొయ్యిపై వంట ప్రారంభించారు. గ్యాస్‌పై వంటచేయడం ఆరోగ్యకరమన్నారు. పొగ రహిత సమాజమే లక్ష్యమంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండలంలోని ఏనుగులదిన్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట గ్యాస్ పొయ్యిని ప్రధానోపాధ్యాయులు షేక్ మీరావలి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్‌పై వండి నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంగళరెడ్డి, రాజేంద్రప్రసాదు, రమణ, ఉదయ్‌కుమార్, రమణారెడ్డి, వంట నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులకు ప్రభుత్వ రాయితీలు

ఎర్రగొండపాలెం : రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్తులకు కల్లు గీత కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని గౌడ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గజ్జా వెంకటేశ్వర్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. కల్లు గీత, బీసీ కార్పొరేషన్‌ల ద్వారా గౌడ కులస్తులు ఆర్థిక సహాయం కోసం రుణాలు పొందవచ్చని తెలిపారు. 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులకు వృద్ధాప్య పింఛన్ పొందచ్చని, తాటి ఉత్పత్తులపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

జాబ్‌కార్డులకు వినతి

త్రిపురాంతకం: ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఇవ్వాలని, పనులు కల్పించాలని కోరుతూ మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 40 మంది ఎం పీడీవో కే మాణిక్యరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇంత వరకు జాబ్‌కార్డులు ఇవ్వలేదని, పనులు కల్పించి ఆదుకోవాలని ఎంపీడీవోను కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

ఎర్రగొండపాలెం : యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు ఎం. శ్యాంరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.రంగనాయకులు, నాగేశ్వరరావు నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు వీరాచారి, ఎం.శ్రీనివాసులు, బాబుల్‌నాయక్, మస్తాన్‌రావు, లక్ష్మీనారాయణ, రవీంద్ర, రంగ్వామిరెడ్డి పాల్గొన్నారు.

23న ఎన్టీఆర్ వైద్య శిబిరం

పెద్ద దోర్నాల: సుందరయ్య కాలనీలో ఈ నెల 23వ తేదీన ఎన్టీఆర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీటీ ఎల్.హుస్సేన్ వలి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఒంగోలుకు చెందిన వెంకటరమణ, సంఘమిత్ర వైద్యాధికారులు వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బంజరు భూములు పంచాలి

పెద్ద దోర్నాల: బినామిలతో ఉన్న ప్రభుత్వ బంజరు భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్‌నాయకులు సోమయ్య మాట్లాడుతూ చాలా మంది నిరుపేదలు సెంటు భూమిలేక అవస్థలు పడుతున్నారని మరో పక్క ఐనముక్కల పరిధిలో కుంటి స్వామి ఆక్రమణలో 64 ఎకరాల భూమి, ఎర్రగొండపాలెంకు చెందిన పుల్లారెడ్డి బంధువుల బినామీలతో 74.46 ఎకరాల బంజరు భూమి ఉందని వాటిని రద్దు పరిచి నిరుపేదలకు పంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కందుల కాశిరెడ్డి, బెల్లంకొండ నాగేశ్వరరావు, గోదా దావీద్, చాముండేశ్వరి, షేక్ మహిమున్, లక్ష్మీదేవి, ఆత్మారాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీ పట్ల ఆర్యవైశ్య సంఘం హర్షం

ఎర్రగొండపాలెం : పేద ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ పట్ల రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం కోశాధికారి చీదెళ్ళ నాగేశ్వరరావు, వాసవీ సేవాదళ్ జోనల్ ఛైర్మన్ అనుమాలశెట్టి సుబ్బారావు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చీదెళ్ళ సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు కృష్ణయ్య సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కరువు పరిహారంపై విచారణ

పుల్లలచెరువు : 2015-16 ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారంలో కొన్ని గ్రామాల్లో ఏకపక్షంగా ఒకే వర్గానికే ఇచ్చారని మానేపల్లి గ్రామానికి చెందిన కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టరు ఆదేశాల మేరకు మంగళవారం కరువు పరిహారంపై విచారణ చేపడుతున్నారు. సోమవారం మండల కేంద్రమైన పుల్లలచెరువులో మాల్లాపాలెం గ్రామానికి చెందిన ఒకే వర్గానికి చెందిన రైతులకు పరిహారం ఇచ్చారని గ్రీవెన్సుకు వచ్చిన వారు కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయ జేడీఈ ఆదేశాల మేరకు ఎర్రగొండపాలెం ఏడీఏ సుదర్శనం మానేపల్లిలో విచారణ చేపట్టునున్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి

పెద్ద దోర్నాల: పెద్దల ఆక్రమణలో బీళ్ళుగా ఉన్న ప్రభుత్వ బంజరు భూములు స్థానికులైన తమకే ఇవ్వాలంటూ మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఎక్కడి నుంచో వచ్చిన కోటీశ్వరులు ప్రభుత్వ బంజరు భూములను ఆక్రమించారని, ఆ పట్టాలను రద్దు పరచి పేదలకు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ వేణుగోపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో పూర్ణకంటి తిరుమలరావు, కాశయ్య, మహిళలు పాల్గొన్నారు.

మీకోసంకు 4 అర్జీలు

పెద్దారవీడు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసంలో 4 అక్షౌలు అందినట్లు తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. భూమి ఆన్‌లైన్ సంబంధించిన 4 అర్జీలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా పలువురు అర్జీలు ఇచ్చి పెద్దారవీడు ఇలాకాలో దూదేకుల కాశమ్మ పేరుమీద ఉన్న సర్వే నెంబరు 270/1 నెంబరులో 3 ఎకరాల 25 సెంట్ల భూమిని వేరొకరి పేరుతో ఆన్‌లైన్ చేశారని తహసీల్దార్‌కు అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ బ్రమరాంబ, సర్వేయర్ గురవయ్య, వీఆర్వో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

త్రిపురాంతకం: మేడపి గ్రామంలో ఉన్న సీతారామస్వామి, చెన్నకేశవస్వామి దేవస్థానాల భూములకు కౌలుకు వేలం పాటలు ఈనెల 23న మేడపి గ్రామంలో నిర్వహించనున్నట్లు ఆలయాల ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. 2017-18 సంవత్సరానికి కౌలు వర్తిస్తుందని, వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా రూ.2వేలు ధరావతు చెల్లించాలని తెలిపారు.

కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం : మార్కాపురం పురపాలక సంఘ పరిధిలో 18 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సుగల యువకులు ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ నిరుద్యోగులు ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా సోమవారం ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్టీ, మైనార్టీలు, 24న బీసీ, కాపు, 28న ఎస్సీ కార్పొరేషన్ అర్జీదారులు సంప్రదించాలని ఆయన అన్నారు.

ముమ్మరంగా సాగు పనులు

తర్లుపాడు: గత మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు పొలాలు పదునెక్కటంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులపై నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు కంది, జొన్న, కొర్ర పంటలు జీవం పోసుకోగా ప్రస్తుతం మిరప నాట్లు ముమ్మరంగా నాటుతున్నారు. కొందరు రైతులు మిరప విత్తనాలను పొలాల్లో విత్తుతుండగా కొందరు రైతులు హైబ్రీడ్ రకాలైనటువంటి తేజ, నెంబరు-344 వంటి రకాలను దూర ప్రాంతాల నుంచి మొక్క 75 పైసలు వంతున కొనుగోలు చేసి నాటుతున్నారు. కంది పంటలకు కొందరు అంతరసేద్యం చేస్తూ కలుపులు తీస్తున్నారు. గత ఏడాది భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లకు నీరు రాకపోవటంతో మిర్చి పంటను సాగు చేసిన రైతులు భారీ స్థాయిలో నష్టపోయారు. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు రాకపోయినా రైతన్నలు ఆ రకొరగా వ్యవసాయ బోర్లకు వచ్చే నీటితో మిరప పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది గానుగపెంట, పోతలపాడు, కలుజువ్వలపాడులో 150 హెక్టార్లలో పత్తి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంటకు మందును యదబెడుతున్నారు. కొర్ర, సజ్జ పంటలు కంకి దశకు రావటంతో ప్రస్తుతం కురిసిన వర్షాలకు జీవం పోసుకొని పంట పండుతుందని రైతులు ఆశిస్తున్నారు.


నాయుడుపల్లిలో కొర్ర పంట


గానుగపెంటలో సాగులో ఉన్న పత్తి

ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్

మార్కాపురం: మండల విద్యావనరుల కేంద్రం, వివిధ ఉన్నత పాఠశాలల్లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులకు సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు మండల విద్యావనరుల కేంద్రంలో 40 మంది ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 20 మంది, రాయవరం హైస్కూల్‌లో 28 మంది, వేములకోట హైస్కూల్‌లో 31 మంది, భూపతిపల్లి హైస్కూల్‌లో 8 మంది హాజరైనట్లు ఎంఈవో బి.రాందాస్ నాయక్ తెలిపారు. మండలంలో 256 మంది ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు గాను మొదటి రోజు 124 మంది హాజరయ్యారన్నారు. మిగిలిన 132 మంది మంగళవారం జరిగే టెలికాన్ఫరెన్స్‌కు హాజరవుతారని ఎంఈవో తెలిపారు.

సాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

మార్కాపురం: కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడి గ్రామీణ తపాలా ఉద్యోగుల వేతనాలు అమలు చేయాలని జాడీఎస్ మార్కాపురం బ్రాంచి ఉద్యోగుల సంఘం కార్యదర్శి డి.నారాయణ రెడ్డి అన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె సోమవారం 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ కమలేష్ చంద్ర ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కమిటి నియమించి రిపోర్టును ప్రభుత్వానికి 2016లో సమర్పించిన నేటి వరకు అమలు పరచలేదని తెలిపారు. ఉద్దేశ పూర్వకంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ విషయంలో జాప్యం చేసి అరియర్స్‌ను ఎగవేయటానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అనంతరం వినతిపత్రాన్ని ఆర్డీవో కిశోర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు వి.మణి కుమార్, ఎన్.రమణారెడ్డి, కెఎం.నాయక్, వీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

పొదిలి : డిగ్రీ చదువుతున్న విద్యార్థినిని వేధిస్తున్న ఆటోడ్రైవర్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.సుబ్బారావు తెలిపారు. స్థానిక నవాబ్‌మిట్టకు చెందిన ఆటోడ్రైవర్ మాబువలి విద్యార్థినిని గత కొంతకాలంగా వెంటబడి వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక ఆ విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జ్ఞాన సముపార్జనే విజయానికి మూలం

నైపుణ్య శిక్షణ నిపుణుడు వేణుగోపాల్

మార్కాపురం: విద్యార్థులు నిత్యం కొత్త విషయాలను తెలుసుకోడంతోపాటు అధ్యయనం చేయటంతో విషయ పరిజ్ఞానం కలిగి ఉంటూ విజయాలు సాధించవచ్చని నైపుణ్య శిక్షణ నిపుణులు ఎం.వేణుగోపాల్ అన్నారు సాధన డిగ్రీ కళాశాలలో సోమవారం నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ సమర్థత విషయంలో వ్యక్తుల మధ్య వ్యత్యాసాలు ఉండవన్నారు. కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడే విజయాలు సొంతమవుతాయన్నారు. తల్లిదండ్రులు, గురువులు సమాజం పట్ల కృతజ్ఞతతో ముందడుగు వేయాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకొని విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్తు బంగారు బాటలు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఎస్‌సీ కళాశాల సమన్వయ కర్త కె.పవన్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేణుగోపాల్

నీలకంఠేశ్వరునికి పూజలు

తర్లుపాడు: తర్లుపాడు గ్రామంలో వెలసిన శ్రీ గంగా పార్వతి సమేత నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం అమావాస్య కావటంతో సహస్ర లింగేశ్వరునికి, నీలకంఠేశ్వరునికి పూజలను అర్చకులు దేవులపల్లి పవన్‌కుమార్ శర్మ అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ సోమవారం అమావాస్య రావటంతో శివునికి అభిషేకం, శివలింగ దర్శనం, రావి వేపచెట్టు కలిసి ఉన్న ప్రదర్శనలు అత్యంత పుణ్యమని భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఇఓ ఈదుల చెన్నకేశవ రెడ్డి స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యస్ ఐ లక్ష్మారెడ్డి, ధర్మకర్త నేరెళ్ళ శంకర్, సాంబశివరావు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు మందు ఇచ్చే వైద్యుడు మృతి



తర్లుపాడు: పాము కాటుకు వైద్యం చేసే రాజేశ్వర రావు (65) సోమవారం మృతి చెందారు. ఆయన పోస్టుమాస్టర్‌గా కూడా సుపరిచితులు. రాజేశ్వరరావు కుటుంబం వంశపారంపర్యంగా పాము కాటుకు గురైన వారికి వైద్యం చేసి ప్రాణం పోస్తున్నారని, ఆయన సేవలు మరువలేనివని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు చిట్టిబాబు తెలిపారు. రాజేశ్వరరావు మృతదేహానికి పలువురు ప్రముఖులు, పరిసర గ్రామాల ప్రజలు నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మార్కాపురం: పర్యావరణాన్ని పరిరక్షణకు అందరూ తమవంతు బాధ్యతగా వ్యవహరించాలని జన విజ్ఞాన వేదిక ప్రచార కార్యదర్శి వి.నారాయణరావు అన్నారు. కొండేపల్లి రోడ్డులోని జీవీఆర్ హైస్కూల్‌లో పర్యావరణాన్ని కాపాడుదాం అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కారణంగా వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు చిరంజీవి, వృక్ష శాస్త్ర అధ్యాపకుడు కె.మల్లయ్య, జంతు శాస్త్ర అధ్యాపకులు డి.సతీష్ రెడ్డి, జీవీఆర్ హైస్కూల్ ప్రెసిడెంట్ బి.శంకర్ రెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ డి. కాశీశ్వరరెడ్డి ఉన్నారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ

మార్కాపురం : జవహర్ నగర్ కాలనీలోని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ దివ్యాంగుల పాఠశాలలో అనాథలకు చైతన్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన విద్యార్థులు కళాశాల ఛైర్మన్ వెన్నా హనుమారెడ్డి ఆధ్వర్యంలో పలకలు, పెన్నులు, ప్లేట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీఎస్.కుమార్, విష్ణు, శ్రీకాంత్ రెడ్డి, సౌజన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంఆర్ టీకాలు

తర్లుపాడు: బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు ఎంఆర్ టీకాలను సోమవారం వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అర్షద్ అలీ, స్టాఫ్‌నర్సు సరస్వతి, కార్యకర్త సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రోగులకు పండ్ల పంపిణీ

మార్కాపురం : ఏపీయూడబ్ల్యూజే 60 వసంతాల వేడుకల సందర్భంగా సోమవారం మార్కాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కోర్టు సెంటరులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, మున్సిపాలిటీలోని పొట్టి శ్రీరాములు, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాలకు యూనియన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్‌వీ రమణ యూనియన్ సాధించిన విజయాలు, జర్నలిస్టుల సమస్యలపై జరిపిన పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూనియన్ అధ్యక్షుడు మూల అల్లూరిరెడ్డి, ఐజేయూ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, జగన్నాథరెడ్డి, బంకా శ్రీనివాసరావు, బాబీ, రఘురామిరెడ్డి, షాకీర్ హుస్సేన్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జర్నలిస్టులు

పరిహారం కోసం మిర్చి రైతుల ఆందోళన

మార్కాపురం : నష్టపోయిన మిర్చి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయంలో పెద్ద ఎత్తున రైతన్నలు ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకట రామిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేసిన మిర్చి పంట ఎండిపోయి పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారన్నారు. ఎండిన మిర్చి రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 232 కోట్లు విడుదల చేసిన అధికారుల నిర్లక్ష్యంతో నేటికి నష్టపరిహారం రైతులకు అందలేదన్నారు. వరుస నష్టాలతో అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఏరువ పాపిరెడ్డి, ఉసుళ్ళపల్లి నాగేశ్వరరావు, కందుల ప్రభాకర్, కాసు శ్రీనివాసరెడ్డి, మూల కాశి రెడ్డి, జి. నాగేశ్వరరెడ్డి, రంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కిశోర్‌కు వినతిపత్రం సమర్పించారు.

అనుమతులు లేకుండా బోర్లు వేస్తే చర్యలు

పొదిలి : అనుమతులు లేకుండా బోర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి.విద్యాసాగరుడు హెచ్చరించారు. సోమవారంతహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ బోర్లు వేయటం నేరమన్నారు. నీరుపడని బోరుబావులను తక్షణమే పూడ్చివేయాలని వీఆర్వోలకు ఆదేశించారు.కొత్తగా బోర్లు వేసేవారు విధిగా రెవెన్యూ అధికారుల అనుమతి పొందాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జానీబేగ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏవీ రవిశంకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

• సినిమాలు

మార్కాపురం

జగదీశ్వరి	- జయజానకి నాయక
విజయా	- రారాండోయ్
శ్రీనివాస	- నేనేరాజు నేనే మంత్రి
రాధాకృష్ణ	- ఆనందోబ్రహ్మ
సాయిబాలాజి	- ఫిదా
విశ్వేశ్వర	- లై

పొదిలి

వెంకటేశ్వర	- లై
హరికృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
రామవేంద్ర	- జయ జానకి నాయక

టంగ్ ట్విస్టర్స్

1. Farrell's features fablous food 'n' fantastic fountain fantasies for frolicking, fun-filled festive families.
2. Thomas Tattamus took two T's to tie two tots to two tall trees.
3. The Final Fixing of the Foolish Fugitive

సూక్తి

మానవుడు ఎంత గొప్పవాడు అయితే.. అంత కఠినమైన పరీక్షలు దాటవలసి ఉంటుంది.

నవ్వుల్ నవ్వుల్

సాంబా : వాస్తు తెలిసిన డాక్టరు దగ్గరకు వెళ్లడం తప్పైపోయింది.

లింగం : ఏమన్నాడేంటి?

సాంబా : వాస్తు బాగాలేదు. గుండె వేరే ప్రదేశానికి మార్చమంటున్నాడు.

లింగం : !!!!!!!!

పాయిజన్ ప్లాంట్స్

ముళ్లతో ఉండే గులాబీలు ఎవరికి ఏ హానీ చేయవు.. బురదలో పుట్టే కమలం సుగంధ పరిమళాల్నే వెదజల్లుతుంది. కానీ విషపూరితమైన పువ్వులను, చెట్లను చూశారా? ఆ చెట్లను ముట్టుకున్నా, వాటి గాలి పీల్చినా ప్రాణాలు పోవాల్సిందే. అలాంటి విష పూరిత చెట్లతో ఇంగ్లాండ్‌లో 'పాయిజన్' అనే ఓ పూదోట ఉంది. ఆ విశేషాలు..



పాయిజన్ గార్డెన్‌లోని రకరకాల రంగు రంగుల పూలు ఇంగ్లాండ్ వాసుల్ని రారమ్మని స్వాగతం పలుకుతాయి. కానీ ఆ పూదోట గేటుపై 'ఈ చెట్లు మిమ్మల్ని చంపేస్తాయి' అని రాసుంటుంది. అంతేకాదు గేటు దాటి లోపలికి అడుగు పెట్టగానే 'ఈ పూలను తుంచకూడదు, ముట్టుకోకూడదు, ఇక్కడి గాలి కూడా పీల్చకూడదు. పిల్లలు ఈ చెట్లకు వీలైనంత దూరంగా ఉండాలి' అంటూ పుర్రె గుర్తుతో ఉన్న ఓ బోర్డు ' డేంజర్ ' అంటూ మిమ్మల్ని హెచ్చరిస్తుంది. ఈ పాయిజన్ గార్డెన్‌లో అనేక ఆకర్షణలున్నాయి. ట్రీ హౌస్,



అందమైన ఫౌంటెయిన్లు, గులాబీ, టొపీరియ పూల వనాలు అందరిని ఆకట్టుకుంటాయి. పూదోట మధ్యలో ఉండే వాటర్ కాస్కేడ్ మరో ప్రధాన ఆకర్షణ. ప్రతి సంవత్సరం వేలాది మంది సందర్శకులు ఈ పూదోటను చూడటానికి వస్తుంటారు.

మొక్కలయందు విషపు మొక్కలు వేరు..

దాదాపు 100 విషపూరిత మొక్కలు ఈ పూదోటలో ఉన్నాయి. ఈ మొక్కలున్న చోట ప్రమాద హెచ్చరిక బోర్డుతో పాటు వాటి చుట్టూ కంచె ఉంటుంది. వీటి గురించి వివరాలు తెలపడానికి గైడ్లు ఉంటారు. ఈ విషపూరిత మొక్కలపై పరిశోధనలు కూడా చేస్తుంటారు. వీటిని మెడిసిన్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ విషపూరిత మొక్కల గురించి తెలియజేసే పుస్తకాలు ఈ పూదోటలోని బుక్ షాప్‌లో లభిస్తాయి.

ప్రకృతిలో నడక

పూదోటలో వుడ్‌ల్యాండ్ వాక్ బాగుంటుంది. అందమైన ప్రకృతి సాక్షిగా వేవేల వర్ణాల పువ్వుల మధ్యలో వెళ్లడం ఓ మధురానుభూతి. ఈ దారిలోనే ట్రీ హౌస్ ఉంటుంది. ఇది సందర్శకులను ప్రధానంగా ఆకర్షిస్తుంది. చెట్లపై ఉండే ఈ ట్రీహౌస్‌లో ఓ రెస్టారెంట్ ఉంటుంది. చవులూరించే స్థానిక ఆహార పదార్థాలెన్నో ఉంటాయి.





పువ్వుల్లో దాగున్న...

అక్విల్జియా : ఈ మొక్క వేర్లు, విత్తనాలు చాలా విషపూరితమైనవి.

అట్రోపా బెల్లడోన : ఈ మొక్క మరింత విషపూరితమైనది. ఇది చాలా ప్రమాదకరమైన మొక్క. దీని వాసన పీల్చడం వల్ల శ్వాసలో ఇబ్బందులు వస్తాయి. అంతేకాదు హృదయం వేగంగా కొట్టుకుంటుంది.

బ్రుగ్స్‌మాన్సియా, డిజిటాలిస్, రిసినస్ కొమ్యునిస్, నక్స్ వొమిక, హెమ్‌లాక్ వంటి మొక్కలు కూడా ప్రమాదకరమైనవే.


పదాలు కనుక్కోండి

w	f	a	k	o	i	x	h	p	k
a	i	b	r	e	l	l	i	m	f
r	z	s	p	i	n	n	i	n	g
t	r	i	c	k	d	l	o	g	q
s	k	s	d	f	p	o	t	k	h

gold
straw
miller
trick
spinning



బొమ్మ గీయండి



జంతర్‌మంతర్

1. సఆక్తి ▶ ....
2. డిరాబ ▶ ....
3. వియంష ▶ ....
4. క్కువఎ ▶ ....


జంబ్లింగ్ వర్డ్స్

1. HNTU ▶ ....
2. MBOB ▶ ....
3. WODO ▶ ....
4. DETI ▶ ....


రంగులు వేయండి



దారి కనుక్కోండి



ఔనా!



వాహనాలకు సరైన పార్కింగ్ దొరకాలని అమెరికాలో 7 శాతం మంది ప్రార్థన చేస్తారు.

చెప్పగలరా?

విరిలో ఉన్నా
కానీ పురిలో లేను
లుప్తంలో ఉన్నా
కానీ గుప్తంలో లేను
వరిలో ఉన్నా
కానీ గిరిలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు

చెప్పగలరా? : విలువ
జంతర్‌మంతర్
1. ఆసక్తి 2. రాబడి
3. విషయం 4. ఎక్కువ
జంబ్లింగ్ వర్డ్స్ :
1.HUNT 2.BOMB
3.WOOD 4.TIDE

మీకు తెలుసా?



తేనె తిన్న తర్వాత కేవలం 20 నిమిషాల్లోనే రక్తంలో కలిసిపోతుంది.

సమన్వయంతో అభివృద్ధి



ఒంగోలులో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సుజనా చౌదరి

సంకల్ప్ సే సిద్ధి సదస్సులో కేంద్ర మంత్రి సుజనా పిలుపు

మంత్రికి ఘన సత్కారం

ఒంగోలు, ఆంధ్రజ్యోతి : 'స్వాతంత్ర్యం వచ్చి 2022 నాటికి 75 సంవత్సరాలు పూర్తవుతాయి. అప్పటికి నవ భారత్ నిర్మాణానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సంకల్పించారు. ఆ సందర్భంగా దేశంలో వెనుకబడిన వంద జిల్లాలను గుర్తించి వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా నీతి అయోగ్ దేశంలో వంద వెనుకబడిన జిల్లాలను గుర్తించగా వాటిలో ప్రకాశం జిల్లా మొదటి స్థానంలో ఉంది. దీనిపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఆలోచించాలి. సమన్వయంతో ముందుకు సాగి అభివృద్ధి చేసుకోవాలి'. అని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి వై. సుజనా చౌదరి సూచించారు. అందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సోమవారం ఒంగోలులోని ఏ1 కన్వెన్షన్ హాలులో నిర్వహించిన సంకల్ప సిద్ధి సదస్సులో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకూ పాలించిన ప్రభుత్వాలు దేశాభివృద్ధికి ఎంతో కృషి చేశాయన్నారు. ఆ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ మరో అడుగు ముందుకు వేశారన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో దేశాన్ని అగ్రస్థానంలో ఉంచేందుకు సంకల్పించారని చెప్పారు. 2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతుందని, అప్పటికి నవ భారత నిర్మాణానికి నిర్ధిష్ట కార్యచరణతో కూడిన విజన్‌కు ప్రధాని మోదీ రూపొందించారని దాని సాధనకు ప్రజలంతా కలిసి రావాలని కోరారు. దేశంలో వంద వెనుకబడిన జిల్లాలను నీతి అయోగ్ గుర్తిస్తే అందులో తొలిస్థానంలో ప్రకాశం జిల్లా ఉందని, అందుకే తాను ఇక్కడ సభకు హాజరయ్యానని చెప్పిన సుజనా చౌదరి 2022 నాటికి అందరికీ ఇళ్లు, విద్య, వైద్య సౌకర్యాలు, పౌష్ఠికాహారం వంటి మౌలిక సదుపాయాల కల్పన, పేదరిక నిర్మూలన, స్వచ్ఛ భారత్ వంటివి సంకల్ప సిద్ధిలో ప్రధాన లక్ష్యాలన్నారు. వాటన్నింటినీ జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలకు సైతం అందేలా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. అందుకోసం సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

గ్రామీణ రైతులు, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం రుణ మాఫీతో రైతు సమస్యలన్నీ పరిష్కారం కావన్న ఆయన ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులు వారికి అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అత్యధిక శాతం మంది యువత దేశంలో ఉన్నారని వారి శక్తి వినియోగం, ఉపాధి మార్గాల పెంపుతో దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు.



నవ భారత నిర్మాణ సంకల్ప ప్రతిజ్ఞ చేయిస్తున్న సుజనా చౌదరి

అంతకు ముందుకు స్థానిక సంస్థల నిధులకు సంబంధించి జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు, మరికొంత మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై మంత్రి సుజనా స్పందిస్తూ 14వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా రాష్ట్రాలకు వస్తాయని వాటిని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు అందించాల్సి ఉందన్నారు. జీఎస్టీ అమలు అనంతరం రాష్ట్రాలకు నిధులు బాగా పెరుగుతాయని వాటి నుంచి స్థానిక సంస్థలు కొంత తెచ్చుకోవాలని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కలెక్టర్ వినయ్‌చంద్ మాట్లాడుతూ కరువు నివారణతో జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. భారీగా నీటి కుంటల తవ్వకాలు, చెక్‌డ్యాంల నిర్మాణం, పూడిక తీత పనులు, వెలిగొండ, గుండ్లకమ్మ, కొరిశపాడు ఎత్తిపోతల వంటి పథకాలు అందులో భాగమన్నారు. జిల్లాకు భారీ పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం దొనకొండలో మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుండగా ఇప్పటికే రెండు కంపెనీలు అక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చాయన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాల పెంపునకు, తీర ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రధాని సూచనలకు అనుగుణంగా 2022 నాటికి అభివృద్ధికి నిర్ధిష్ట ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామన్నారు. సదస్సులో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వారధిగా వ్యవహరిస్తూ రాష్ట్రానికి అధిక నిధులు రాబట్టడంలోనూ, రాష్ట్రాభివృద్ధిలోనూ కేంద్రమంత్రిగా సుజనా చౌదరి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. అదే సమయంలో వెనుకబడిన జిల్లా అభివృద్ధికి కూడా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ మన్నం శ్రీధర్‌బాబు, కనిగిరి ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్‌లు మంత్రి సుజనా చౌదరిని సభా వేదికపై ఘనంగా సత్కరించారు. సదస్సులో ఎమ్మెల్సీలు కరణం బలరామకృష్ణమూర్తి, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, పోతుల సునీత, జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు, ఎమ్మెల్యేలు పోతుల రామారావు, డాక్టర్ స్వామి, లిడ్‌క్యాప్ చైర్మన్ గూడూరి ఎరిక్షన్‌బాబు, జడ్పీ సీఈవో సాయి కుమారి, డ్వామా పీడీ పోలప్ప, ఒంగోలు ఆర్డీవో కె. శ్రీనివాసరావుతోపాటు పలువురు జిల్లా అధికారులు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత మంత్రి సుజనా.. క్విట్ ఇండియా ఉద్యమం 70 వసంతాల రోజున ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన సందేశాన్ని చదివి వినిపించారు. 2022 నాటికి నవ భారత నిర్మాణంపై సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు.

టీడీపీలో సుజనాపై గుస్సా

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ వర్గీయుల్లో చర్చనీయాంశమైంది. సోమవారం ఒంగోలులో నిర్వహించిన ఆయన కార్యక్రమం మరింత వివాదాస్పదమైంది. పొరుగున ఉన్న కర్నూలు జిల్లాలోని నంద్యాల ఉప ఎన్నికల బాధ్యతల్లో జిల్లాకు చెందిన అత్యధిక మంది నేతలు తలమునకలై ఉండగా కేంద్ర మంత్రి కార్యక్రమం నిర్వహించడాన్ని పలువురు ప్రశ్నిస్తుండగా, కనీసం ఆయన కార్యాలయం నుంచి సమాచారం కూడా ఇవ్వకపోవడంపై మరికొందరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు టీడీపీలో జిల్లా పరిషత్ సీఈవో నుంచి వచ్చిన మొక్కుబడి సమాచారమే ఆహ్వానంగా భావించాల్సి రావడాన్ని పలువురు అధిష్ఠానం దృష్టికి కూడా ఆవిషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిసింది.

కేంద్ర మంత్రి సుజనా చౌదరితో రాజకీయంగా మన జిల్లాతో అవినాభావ సంబంధం ఉంది. గత ఎన్నికల ముందు నుంచి ఆయన జిల్లా పార్టీ వ్యవహారాల పర్యవేక్షకుడిగా ఉన్నారు. గతంలో అనేక అంశాల్లో ఆయన సూచనలు, అభిప్రాయాలే కీలకంగా మారాయి. ఎన్నికల అనంతరం జిల్లాలో టీడీపీయేతర పార్టీల నుంచి గెలుపొందిన ఐదుగురు శాసనసభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆతర్వాత పార్టీపరంగా ఎదురైన కొన్ని సమస్యలు కూడా సుజనా చౌదరి దృష్టిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయన మంత్రిగానే కాకుండా, పార్టీపరంగానూ జిల్లా విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అయితే ఆయన జిల్లాకు వచ్చే ఏ సందర్భంలోనూ ఇక్కడి ముఖ్యులకు, చివరకు పార్టీ శాసనసభ్యులకు కూడా సమాచారం ఉండటం లేదన్న అభిప్రాయం ఉంది. సోమవారం నాటి కార్యక్రమం దాన్ని మరింత పెంచింది. జిల్లాకు చెందిన మంత్రి శిద్దా రాఘవరావు, ఒంగోలు, బాపట్ల లోక్‌సభలకు ఇన్‌చార్జిలుగా ఉన్న మంత్రులు నారాయణ, పరిటాల సునీతలు నంద్యాల ఎన్నికల్లో నిమగ్నమై ఉన్నారు. వీరికి తోడు చీరాల, పర్చూరు శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్, ఏలూరి సాంబశివరావులకు నెల క్రితమే అక్కడి కొన్ని మండలాల బాధ్యతలు అప్పగించగా వారు అనుచరగణంతో అక్కడ తిష్ఠ వేశారు. ఎర్రగొండపాలెం, గిద్దలూరు శాసనసభ్యులకుతోడు మరి కొందరు ముఖ్య నేతలు నంద్యాల ఎన్నికల ప్రచారంలో ఉన్నారు. వారంతా సోమవారం రాత్రికి కాని తిరిగిరాలేని పరిస్థితి. ఇంకోవైపు పార్టీ జిల్లా అధ్యక్షుడు దామచర్ల జనార్దన్ అధిష్ఠానానికి ముందుగా చెప్పి కుటుంబంతో వేరే ప్రాంతానికి వెళ్లారు. సోమవారం ఆయన తన తల్లిదండ్రులకు వైద్య పరీక్షల నిర్వహణను ఏర్పాటు చేసుకున్నారు. ఇక మిగిలిన శాసనసభ్యులు, ముఖ్య నాయకులు కూడా వివిధ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అయితే ఒకే ఒక్కరోజు ముందుగా ఆదివారం జడ్పీ సీఈవో ఫోన్ చేసి కేంద్ర మంత్రి సుజనా చౌదరి హాజరయ్యే సదస్సుకు ఆహ్వానించడంతో నాయకులంతా ఆశ్చర్యపోయారు. నంద్యాల ఎన్నికల హడావుడి సమయంలో ఈ సమావేశమా! అంటూ నిర్వాహకుల తీరును తప్పుపట్టారు. కేంద్ర మంత్రి సుజనా చౌదరి కార్యాలయం నుంచి కనీస సమాచారం రాకపోవడం, జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు టీడీపీలో లేకపోవడాన్ని దృష్టిలో ఉంచుకుని ఇదంతా నిజం కాకపోవచ్చన భావనతో ఎవరిపనిలో వారు ఉండిపోయామని ఒక ముఖ్య శాసనసభ్యుడు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

అనుకున్నట్లే చివరికి సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రి శిద్దాతోపాటు, ఇన్‌చార్జి మంత్రి నారాయణ, నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు భాగంగా ఉన్న బాపట్ల లోక్‌సభకు ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి సునీతలు హాజరుకాలేకపోయారు. ఎమ్మెల్యేల్లో కొండపి శాసనసభ్యుడు స్వామి మాత్రమే ముందు హాజరయ్యారు. ఇటీవల వివాహం చేసుకున్న ఆయన నియోజకవర్గంలోనే ఉన్నందున సమావేశానికి వచ్చారు. చివరి క్షణంలో కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు హాజరయ్యారు. ఇక జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు, శాసన మండలి సభ్యులు కరణం బలరాం, మాగుంట శ్రీనివాసులరెడ్డి సభా వేదిక వద్ద మంత్రికి స్వాగతం పలుకుతూ కన్పించారు. సుజనాతో తొలి నుంచి పరిచయాలున్న కనిగిరి ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ మన్నం శ్రీధర్‌లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి హడావుడి చేశారు. సభలో అధికారులు, హాజరైన కొద్దిమంది నేతలు ఎంత ప్రసంగించినప్పటికీ మొత్తం జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ముఖ్యులు లేని లోటు కన్పించింది. దీనికితోడు ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో ఆయా నియోజకవర్గాల వారీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పలువురిని పార్టీలోకి చేర్చుకున్న నేపథ్యంలో ఒకట్రెండు నియోజకవర్గాలకు సంబంధించిన అంశాలు అక్కడికి చర్చకు రావడం వివాదాస్పదమైంది.

పార్టీలో సీనియర్‌లుగా ఉన్న కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, మార్కాపురం, సంతనూతలపాడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కందుల నారాయణరెడ్డి, బి.ఎన్. విజయ్‌కుమార్ కూడా సమావేశానికి రాలేకపోయారు. ఈ నేపథ్యంలో మంత్రి సుజనా చౌదరి కార్యాలయం నుంచి జిల్లాలోని కొంత మంది నాయకులకే ఆయన కార్యక్రమ సమాచారం అందుతుందా? అన్న అనుమానాలు పార్టీ నాయకుల్లో పెరిగిపోయాయి. తదనుగుణంగా సుజనా చౌదరి పర్యటన వ్యవహారాలు టీడీపీ వర్గీయుల్లో చర్చనీయాంశమవడమే కాక, ఇప్పుడిప్పుడే పెరుగుతున్న సమైక్యతను దెబ్బతీసేలా తయారయ్యాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.



బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇస్తున్న లక్ష్మి

బాలికలు ఆత్మస్థయిర్యంతో రాణించాలి

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత లక్ష్మి

పర్చూరు : బాలిలకలు ఆత్మస్థయిర్యంతో ముందుకు సాగి అన్ని రంగాల్లో రాణించాలని మార్షల్స్ ఆర్ట్స్‌లో అంతర్జాతీయ గోల్డ్ మెడలిస్టు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత ఎన్. లక్ష్మి అన్నారు. స్థానిక ఎంఆర్‌ఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సోమవారం ఆత్మ రక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో మహిళలపై పెరిగిన దాడులు, ఈవ్ టీజింగ్‌లను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై కొన్ని మెలకువలను వివరించారు. చిన్నచిన్న సమస్యలతో కుమిలిపోకుండా ధైర్యంగా వాటిని ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ రవి, పాఠశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ చెందు శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మినీ లోకం



మండుతున్న ఇటుక ధరలు

పెరిగిన ఇంటి నిర్మాణ వ్యయం

మారెడ్డి వెంకటేశ్వర్లు, బి.నిడమానూరు, నాగులుప్పలపాడు మండలం



నెల రోజుల వ్యవధిలో వెయ్యి ఇటుకలు రూ. 4వేల నుంచి రూ. 4,300 వరకు కొనుగోలు చేశాం. ఒక్కసారిగా వెయ్యి ఇటుకలకు రూ. వెయ్యి నుంచి రూ.1300 వరకు పె రిగింది. ఇంటి నిర్మాణానికి 20 వేల ఇ టుకలు కొనుగోలు చేయాల్సి రావటంతో అదనం గా రూ.30 వేలు పెరిగింది.

అరకొరగా నిల్వలు

మక్కెన లక్ష్మయ్య, ఇటుక బట్టీల నిర్వాహకులు, అద్దంకి



అత్యధిక శాతం ఇటుక బట్టీలలో అమ్మకాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం కొద్ది మేర మాత్రమే నిల్వలు ఉన్నాయి. 2012లో వచ్చిన ధర మరలా ఇప్పుడు వచ్చింది. ఐదారు సంవత్సరాల నుండి ఇటుక బట్టీల నిర్వహకులు బాగా నష్టాలకు గురయ్యారు.

వరుస నష్టాలతో చాలామంది మానుకోవటంతో ఇటుక బట్టీలు తగ్గాయి. ప్రస్తుతం ఉన్న ధర ఎక్కువ కాలం ఉండదు. మరో నాలుగు నెలల వరకు ఇటుక తయారికి అవకాశం లేనందున బట్టీల నిర్వహకులకు పెద్దగా ప్రయోజనం ఉండదు. ఇటుక నిల్వ ఉన్న బట్టీల నిర్వాహకులకు మాత్రం మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది.



అద్దంకి: ఇటుకల ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. రెండు సంవత్సరాల క్రితం వరకు అద్దంకి ప్రాంతంలో సుమారు 150కు పైగా ఇటుక బట్టీలు ఉండగా ప్రస్తుతం 70 బట్టీలకే పరిమితం అయ్యాయి. 2012లో ఇటుక బట్టీల యజమానులు లాభాలబాట పట్టడంతో అప్పటివరకు 70 వరకు ఉన్న బట్టీలు ఒక్కసారిగా 150కు పెరిగాయి. అయితే, ఏటికేడు ధరలు తగ్గటంతో నష్టాలు పెరిగి ఇటుక బట్టీలను మానుకున్నారు. ఇటుక బట్టీలతో అత్యధికశాతం అప్పుల పాలై ఉన్న ఆస్తులను కూడా అమ్ముకున్నారు.

2012లో వెయ్యి ఇటుకల ధర అత్యధికంగా రూ.5 వేలకు చేరింది. దీంతో అప్పట్లో ఇటుక బట్టీల యజమానులకు లాభాలు వచ్చాయి. తరువాత పెరిగిన కూలీల ఖర్చులు, రవాణా చార్జిలతో ఇటుక తయారీ ఖర్చులు పెరిగాయి. దీనికి తోడు ధరలు తగ్గాయి. 2013 నుండి 2016 వరకు వెయ్యి ఇటుకల ధర రూ.3200 మాత్రమే ఉంది. ఈ ఏడాది ప్రారంభం నుండి రూ.3800 నుంచి పెరుగుతూ వచ్చింది. నెల రోజుల క్రితం వరకు అదే ధర కొనసాగింది. ఇటీవల కురిసిన వర్షాల తరువాత ఇటుక బట్టీల యజమానులు ఇటుక తయారి నిలిపివేయటంతో ధర ఒక్కసారిగా పెరిగింది. రూ.3800 నుంచి పెరుగుదల ప్రారంభమై రూ.4 వేల వరకు చేరింది. అనంతరం రూ. 4300కు చేరింది. వారం రోజుల వ్యవధిలో రోజు రోజుకు పెరుగుతూ ఒక్కసారిగా ప్రస్తుతం రూ.5,400 కు చేరింది.

ఎన్టీఆర్ గృహనిర్మాణ లబ్ధిదారులకు భారం

ప్రస్తుతం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా పెద్ద ఎత్తున ఇళ్ళ నిర్మాణం ప్రారంభమైన నేపథ్యంలో ఒక్కసారిగా పెరిగిన ఇటుక ధరలు భారంగా మారనున్నాయి. ఒక్కో ఇంటికి సరాసరిన 20 వేల ఇటుకల వరకు అవసరమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రూ.30 వేల వరకు అదనపు భారం పడుతుందని గృహ నిర్మాణ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటుక బట్టీల వద్ద వెయ్యి ఇటుకల కొనుగోలు ధర రూ. 5,300 కాగా, దూరాన్ని బట్టి రవాణా ఖర్చులు, అన్‌లోడింగ్ చార్జిలు అదనంగా మరో వెయ్యి రూపాయల వరకు ఉంటుంది. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు ఎంతవరకు పోతాయే అర్థం కాక గృహ నిర్మా ణదారులు కొనుగోళ్ళ కోసం ఒక్కసారిగా ఎగబడుతున్నారు. దీనికితోడు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఇటుక బట్టీల యజమానులు పెద్ద మొత్తంలో ఇటుక తయారీ, నిల్వలు చేపట్టలేదు. తయారు చేసిన ఇటుకలలో అత్యధిక భాగం ఇప్పటికే అమ్మకాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం నిల్వ ఉంచుకున్న ఇటుక బట్టీల యజమానులకు మాత్ర మే ప్రస్తు తం పెరిగిన ధరలతో ప్రయోజనం కలుగుతుందని పలువురు ఇటుక బట్టీల యజమానులు అభిప్రా యపడుతున్నారు. ధర పెరుగుదలతో కొందరు ఇటుక బట్టీల యజమానులు మరలా ఇటుక బట్టీల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం అం ఐనందున ఇటుక తయానికి అంత అనుకూలంకాదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలను దృష్టిలో ఉంచుకొని పెద్ద సంఖ్యలో కొత్తగా ఇటుక బట్టీలు ఏర్పాటుకు పలువురు సిద్ధమయ్యే అవకాశం ఉంది. గత 5 సంవత్సరాలుగా నష్టల బాటలో ఉన్న ఇటుక బట్టీల యజమానులకు ప్రస్తుతం పెరిగిన ధరలతో ఆనందం వ్యక్తమవుతుండగా... పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్ళ నిర్మాణం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున గృహాలు మంజూరు చేయగా ప్రస్తుతం పెరిగిన ధరలతో భారం కానుందని గృహ నిర్మా ణ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

సగానికి సగం మిగిలిన ఇటుకబట్టీలు

వారం రోజులలో రూ.1500 పెరుగుదల

ఇళ్ల నిర్మాణదారులకు భారంగా మారిన వైనం

నేడు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ఒంగోలు, ఆంధ్రజ్యోతి: బ్యాంకుల పరిరక్షణ, ప్రభుత్వ సంస్కరణలకు వ్యతిరేకంగా మంగళవారం బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు దిగుతున్నారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకులలో వివిధ స్థాయిల్లో పనిచేసే సుమారు పది లక్షలమంది సమ్మెలో పాల్గొంటున్నారు. బ్యాంకుల్లోని తొమ్మిది ఉద్యోగ సం ఘాలు సంయుక్తంగా సమ్మెకు పిలుపు నివ్వడంతో మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడనున్నాయి.

కాగా జిల్లాలో బ్యాంకు ఉద్యోగ సంఘ నేతలు సమ్మె విజయవంతానికి సర్వం సిద్ధం చేశారు. ప్రధాన యూనియన్ల నేతలు విడివిడిగా, ఐక్యంగా ఇప్పటికే వివిధ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి ఉద్యోగులను సమ్మెకు సమాయత్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం బ్యాంకులను మూసివేసి ఆయా పట్టణాల్లో భారీ ర్యాలీలు, ధర్నాల నిర్వహణకు నిర్ణయించారు. ఒంగోలులోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు కలిసి స్థానిక నెల్లూరు బస్టాండు సమీపంలోని ఆంధ్రా బ్యాంకు వద్ద భారీ ధర్నాకు ఏర్పాటుచేశారు. జిల్లాలోని ఇంచుమించు మూడు వేలం మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొననుండగా దాదాపు 400 ప్రభుత్వ రంగ బ్యాంకుల బ్రాంచిలు మూతపడనున్నాయి.

ఇదిలా ఉండగా ఈనెల 25నుంచి 27 వరకు తిరిగి బ్యాంకులు పనిచేసే అవకాశం లేదు. వరుసగా మూడు రోజులు బ్యాంకులకు సెలవులు రావడంతో ఆ మూడు రోజులు బ్యాంకులు పనిచేసే అవకాశం లేదు. ఇక ఈ వారంలో బుధ,గురువారాల్లో రెండు రోజులు మాత్రమే బ్యాంకులు పనిచేస్తాయి.

'విజయనగరం' విజయం



ఒంగోలు కార్పొరేషన్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు శర్మా కళాశాల క్రీడామైదానంలో మూడు రోజులపాటు హోరా హోరీగా జరిగిన గుంటూరు, విజయనగరం జట్ల మధ్య మ్యాచ్‌లో విజయనగరం విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో రాణించిన గుంటూరు జట్టు సెకండ్ ఇన్నింగ్స్‌లో ఘోరంగా వైఫల్యం చెందింది. తొలి ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్లు 25.2 ఓవర్లకు 50 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ కాగా, గుంటూరు జట్టు 79.2 ఓవర్లకు 161 పరుగులు చేసింది. విజయనగరం సెకండ్ ఇన్నింగ్స్ 85.5 ఓవర్లకు 205 భారీ స్కోరు చేసింది. జట్టులోని ఎం.రవికిరణ్ 103 పరుగులు చేశారు. గుంటూరు జట్టు విజయం సాధించడానికి 95 పరుగులు చేయాలి. అయితే సెకండ్ ఇన్నింగ్స్‌లో గుంటూరు 23.1 ఓవర్లకు కేవలం 66 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. గెలుపొందిన విజయనగరానికి ఆరు పాయింట్‌లు అధికృత దక్కగా, గుంటూరుకు ఒక్క పాయింట్ కూడా లభించలేదు.

కొత్తూరులో ఇద్దరికి డెంగ్యూ లక్షణాలు

బల్లికురవ: మండలంలోని కొత్తూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి డెంగ్యూ జ్వరం లక్షణాలు కనిపిచాయి. దీంతో వారి బంధువులు వారిని అద్దంకిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గ్రామంలోని ఒకే కుటుంబానికి దొడ్డా గోవిందరావు, దొడ్డా రాధ గత నాలుగు రోజుల నుండి జ్వరం రావడంతో చికిత్స కొరకు అద్దంకి వైద్యశాలకు వెళ్లగా అక్కడ వైద్యులు రక్తంలో ప్లేట్‌లెట్స్ పూర్తిగా తగ్గాయని తెలిపారు. డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని వెంటనే వైద్యశాలలో చేర్చుకొని చికిత్సలు ప్రారంభించారు.

ఇదిలాఉండగా, గ్రామంలో సాధారణ జ్వరాలు ఉన్నట్లు తెలుస్తుంది. వైద్య ఆరోగ్యశాఖ తక్షణమే శిబిరం ఏర్పాటుచేసి జ్వర బాధితులను గుర్తించి చికిత్సలు అందించాల్సి ఉంది. గ్రామాల్లోని ప్రజలు డెంగ్యూ జ్వరాలు వస్తున్నాయని భయాందోళనలో ఉన్నారు. అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు

బాలకార్మికులను పాఠశాలలో చేర్పించిన చైల్డ్‌లైన్

ఒంగోలు నగరం : వీధుల వెంట తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను ఏరుకుంటున్న ఐదుగురు బాలికలను గుర్తించిన చైల్డ్ లైన్ ప్రతినిధులు సోమవారం పాఠశాలలో చేర్పించారు. హెల్ప్‌గర్ల్ అడ్వకసీ కమ్యూనిటీ మొబలైజర్ కె.సులోచన, ప్రోగ్రాం ఆఫీసర్ బి.వి. సాగర్ ఆ బాలలను స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. నగరానికి చెందిన ఆ బాలల తల్లిదండ్రులకు స్థోమత లేక వారు వ్యర్థాలను ఏరి డబ్బు సంపాదిస్తున్నారని సాగర్ చెప్పారు.

సుజనా, స్వామిలకు శుభాకాంక్షలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు కార్పొరేషన్ : స్థానిక ఎ1 కన్వెన్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన సంకల్ప సే సిద్ధి అవగాహన సదస్సుకు విచ్చేసిన సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్ర సహాయ మంత్రి సుజనా చౌదరి, కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డి.బి.వి.వి. స్వామిలకు సదస్సుకు విచ్చేసిన వారు శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో రాష్ట్ర ప్రతినిధిగా సమర్థ మంత్రిగా సుజనా చౌదరి ప్రత్యేకత సాధించుకున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. ఇదే సమయంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి వివాహమైన అంశాన్ని ఈదర సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సభకు విచ్చేసిన వారి చేత ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపి కరతాళ ధ్వనులతో సుజనా, స్వామిలను అభినందించారు. అనంతరం చందు డ్యాన్స్ అకాడమీ, మాంటిస్సోరి హై స్కూలు, కేంద్రియ విద్యాలయ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయ గీతాలపన వీనుల విందుగా సాగాయి.



కేంద్రియ విద్యార్థులతో కేంద్ర మంత్రి సుజనా

ముందస్తు ప్రణాళిక లేకనే నీటి కష్టాలు



ఎస్ఎస్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న వైసీపీ నేతలు

- గత ఎన్నికల హామీ అమలులో విఫలం

- అధికార పార్టీ నేతల తీరుపై ధ్వజం

ఒంగోలు కలెక్టరేట్ : నగరానికి తాగునీటి ఎద్దడి ముంచుకోస్తుందని తెలిసినా ముందస్తు ప్రణాళిక లేని కారణంగా ప్రజానీకం తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వైసీపీ నగర అధ్యక్షుడు సింగరాజు వెంకట్రావు ఆరోపించారు. సోమవారం సాయంత్రం ఒంగోలులోని ఎస్ఎస్ ట్యాంకులను పరిశీలించి, నీటి నిల్వలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోజూ నీటిని అందిస్తామని ప్రగాల్భాలు పలికి ఇప్పుడు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు జిల్లాలో నెలకొని ఉన్నా తెలిసి కూడా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లనే నీటి సమస్య తీవ్రమైందన్నారు. ముఖ్యంగా శివారు కాలనీల్లో ప్రజల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. ఒక వైపు పైపులైన్ల ద్వారా నీరు రాక, మరో వైపు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు అందక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మహిళా విభాగం ప్రతినిధులు కావూరి సుశీల, బడుగు ఇందిర, పల్లాల అనురాధ, బి. అరుణ, వైసీపీ వివిధ విభాగాల అధ్యక్షుడు కఠారి శంకర్, జె. ఆనందరావు, డి.ఎస్. క్రాంతికుమార్, ఓబుల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వల్లెపు మురళీ, చాంద్‌బాషా, యనమల నాగరాజు, యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు నీటిని విడుదల చేయాలి

ప్రజల దాహార్తిని తీర్చేందుకు సాగర్ నుంచి నీటిని విడుదల చేయించేందుకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వంతో చర్చించాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం సీపీఎం నాయకులు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిశీలించారు. నగర కార్యదర్శి జి.వి. కొండారెడ్డి, జి. రమేష్, దామా శ్రీనివాసులు, సిహెచ్. రమాదేవి, తంబి శ్రీనివాసులు, ఎ. శ్రీనివాసులు, కేఎఫ్.బాబు, ఎస్‌డి. హుస్సేన్, కె. బాలచంద్రం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తపాల ఉద్యోగులు

తపాల డాక్ ఉద్యోగుల నిరసన ప్రదర్శన

ఒంగోలు వ్యవసాయం : అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుంచి భాగ్యనగర్‌లోని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు కార్యాలయం వరకు అర్ధనగ్నంగా డాక్ సేవక్‌లు ప్రదర్శన నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎస్‌పీ టి.వి.ఎ శర్మకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆరు రోజులుగా చేపట్టిన సమ్మె సందర్భంగా స్థానిక ప్రధాన తపాలా కార్యాలయ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాస్‌కుమార్, నాయకులు కె.బి. మీరావలి, అరుణ, శైలజ, రమాదేవి, నూకరాజు, శేషగిరి, ఎన్.బసవయ్య, మహ్మమద్ కాశీం, రఫీ, పూర్ణచంద్రరావు, రమేష్ పాల్గొన్నారు.

కరువు నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్ : కరువు పరిస్థితులతో గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఉపాధి లేక వలసలు పోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం జరిగిన రిలే దీక్షకు జిల్లా అధ్యక్షుడు ఎస్‌డి మీరావలి అధ్యక్షత వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ కరువు ఉన్నా ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకం అమలును నిర్వీర్యం చేస్తుండడంతో పేదల పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలకు ఉపాధి కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీలో ఏడాదికి 200 పనిదినాలు కల్పించి రోజు కూలీ రూ. 400 కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో జీపీ రామారావు, చినిగే సుబ్బారావు, తన్నీరు సింగరకొండ, పి. పృధ్వీ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నేతలు

97వేలమందికి రైతులకు బీమా ప్రీమియం చెల్లింపు

ఒంగోలు వ్యవసాయం : జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద 2017 ఖరీఫ్ సీజన్‌కు 97,400మంది రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు జె.మురళీకృష్ణ తెలిపారు. అందులో బ్యాంకుల్లో రుణాలు తీసుకోకుండా 21,098 హెక్టార్లలో సాగుచేసిన 16,599మంది రైతులు రూ.1,41,55,393 ప్రీమియం చెల్లించారు. ఖరీఫ్‌లో కంది, సజ్జ, మొక్కజొన్న, మిరప, ఆముదం తదితర పంటలు రైతులు ప్రీమియం చెల్లించారు. బ్యాంకుల్లో పంటల బీమా పథకం కింద 80,801మంది రైతులు చెల్లించిన ప్రీమియం వివరాలు అధికారులకు ఇంకా రాలేదని బదులిచ్చారు.

ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌పై దాడికి అప్సా ఖండన

ఒంగోలు విద్య : కర్నూలులోని ఒక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య ఘటనపై కర్నూలు జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు పాశవికంగా దాడి చేయడాన్ని అప్సా రాష్ట్ర కోశాధికారి పి.కిషోర్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. సోమవారం సాయంత్రం స్థానిక గోపాల్‌నగర్‌లోని గౌతమి పాఠశాలలో జరిగిన అప్సా సమావేశానికి జిల్లా అధ్యక్షుడు సిహెచ్. మల్లిఖార్జునరావు అధ్యక్షత వహించారు. దాడికి పాల్పడిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పూనుకుంటామని కిషోర్‌కుమార్ హెచ్చరించారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు ధనుంజయ్, జిల్లా సెక్రటరీ కె.శేఖర్, బాబూరావు, వంశీ, శ్రీనివాసరెడ్డి, కొండయ్య, వెంకటేశ్వర్లు, వాసు పాల్గొన్నారు.

భార్యను హత్య చేయబోయిన భర్త

ఒంగోలు క్రైం : నిత్యం వేధిస్తూ భార్యను హత్య చేసేందుకు భర్త యత్నించిన సంఘటన నగరంలోని మామిడిపాలెంలో ఈ నెల 17న చోటుచేసుకుంది. పి. భరత్‌కుమార్, ప్రణ ప్రిస్కితో 2011లో వివాహమైంది. అప్పటి నుంచి అతను భార్యను నిత్యం వేధిస్తూ, హింసిస్తూ ఉండేవాడు. గతంలో వేధింపుల కేసు కూడా నమోదైంది. ఈ నెల 17న మద్యం సేవించి ఇంటికి వచ్చాక ముఖంపై దిండు వేసి ఒత్తి కత్తితో పొడవబోయాడని ప్రయణ ప్రిస్కి ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై నాయబ్‌రసూల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధుల తరలింపును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్ : భవన నిర్మాణ బోర్డు నిధులను చంద్రన్న బీమాకు తరలించే విధానాన్ని ఉపసహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్. మోహన్ డిమాండ్ చేశారు. ఆదర్శ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ఉద్దానం కిడ్నీ బాధితులకు తరలిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలన్నారు. గతంలో భవన నిర్మాణ బోర్డుకు చెందిన నిధులను చంద్రన్న భీమాకు రూ 234 కోట్లు తరలించారని, మళ్లీ ఇప్పుడు ఉద్దానం కిడ్నీ బాధితులకు రూ. 45 కోట్లు తరలిస్తున్నారని ఆరోపించారు. నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగారావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె. బాబు, కె. వెంకటేశ్వర్లు, సిహెచ్. రవి, పివైఎల్ కార్యదర్శి ఎన్. నాగరాజు, చక్రవర్తి, సిహెచ్. మధు, శ్రీనివాస్, సిహెచ్. రవి పాల్గొన్నారు.

ప్రభుత్వం జీవోలను అమలు చేయాలి



ధర్నా చేస్తున్న డప్పు కళాకారులు

ఒంగోలు కలెక్టరేట్ : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి జీవో నెంబరు 25ను పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మాదిగ చర్మకారులు డప్పు కళాకారుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంద్రాజుపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం జరిగిన ధర్నాలో ప్రధాన కార్యదర్శి కవలకుంట్ల గోవింద ప్రసాద్, గోచిపాతల రోశయ్య, పల్లె కోటేశ్వరరావు, ఓబయ్య, సూరిబాబు, పృధ్వీ పాల్గొన్నారు.

గత దరఖాస్తులనూ ఇంటర్వ్యూలకు అనుమతించాలి

ఒంగోలు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాలకు గతంలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారినీ ఇంటర్వ్యూలకు అనుమతించాలని ఏపీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు విజేంద్ర బహుజన్ కోరారు. స్థానిక మహాసభ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో అల్లాడి శ్యామ్‌బాబు, మాకం జాన్‌పాల్, మన్నం ప్రసన్నరాజు, కె. వెంకటేశ్వర్లు, చిటిమాల సంగీతరావు, బత్తుల మరియమ్మ, టి. విద్యాసాగర్, జిలకర పున్నయ్య, కె. రాజు పాల్గొన్నారు.

వల్లాపల్లిని పరిశీలించిన తహసీల్దార్

బల్లికురవ : మండలంలోని వల్లాపల్లి గ్రామాన్ని సోమవారం తహసీల్దార్ ఎస్వీ సుధాకర్ పరిశీలించారు. గ్రామంలో విష జ్వరాలు ఉన్నాయని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని ఆయన స్పందించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని సందర్శించారు. జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను మెరుగు పరచాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ కోదండరామ్ తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్ రుణాల మంజూరుకు సహకరించండి

● బ్యాంకర్లను కోరిన
మున్సిపల్ కమిషనర్ నారాయణరావు

అద్దంకిటౌన్ : కార్పొరేషన్ రుణాల మంజూరుకు నగర పంచాయతీ పరిధిలోని బ్యాంక్ అధికారులు సహకారించాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు కోరారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని బ్యాంక్ అధికారులతో 2017-18 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాల మంజూరుపై ముందస్తు సమావేశం నిర్వాహించారు. గత ఏడాది అద్దంకి నగర పంచాయతీలో వివిధ కార్పొరేషన్‌లకు సంబంధించి 229 రుణాలు మంజూరు కాగా వాటిలో 137 పలు బ్యాంకులు మంజూరు చేయగా మిగిలిన వారికి ఆయా బ్యాంకుల అధికారులు సహకరించలేదన్నారు. దీంతో గత ఏడాదికి సంబంధించి 92 యూనిట్‌లు మంజూరు చేయక నిలిచిపోయాయని తెలిపారు. ఈ క్రమంలో రుణాల మంజూరులో కాలయాపన జరగడంతో గడువు ముగిసిపోయిందని, ఈ ఏడాది అయినా సకాలంలో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు బ్యాంకుల అధికారులు మాట్లాడుతూ రుణాలు మంజూరు చేసిన వారికి సంబంధించి విచారణకు వెళ్లగా అక్కడ వారు ఎవరూ లేరని, అడ్రసులు కూడా సక్రమంగా లేవని, అసలు రుణం కోసం దరఖాస్తు చేసినట్టు మాకు తెలియదని తెలిపారని, దీని వల్ల రుణాలను మంజూరు చేయలేదని వివరించారు. మళ్లీ అటువంటి పొరపాట్లు జరగకుండా ఇంటర్వ్యూలు జరిగే సమయంలోనే పరిష్కారిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణంలోని అన్ని బ్యాంక్‌లకు సంబంధించి మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.


బాంకర్లతో సమావేశమైన మున్సిపల్ కమిషనర్

కొరిశపాడు మండలానికి 256 రుణాలు

మేదరమెట్ల : కొరిశపాడు మండలానికి 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా 256 రుణాలు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్‌లో రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారు నిర్దేశించిన తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. 23న మైనార్టీ, ఎస్టీ, 24న బీసీ, కాపు, 28న ఎస్సీలకు ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలంయంలో ఇంటర్వ్యూలకు జరుగుతాయన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

సంతమాగులూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసే వినాయక విగ్రహాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఇంచార్జి ఎస్సై అనూక్ తెలిపారు. గ్రామాల్లో వినాయక మందిరాలు ఏర్పాటు చేయాలనుకున్న వారు ముందుగా మీసేవా ద్వారా మైక్ అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు దగ్గర నుంచి ఎప్పటి వరకు పూజలు నిర్వహిస్తారు, నిమగ్నం రోజున ఎన్ని గంటలు ఊరేగింపు ఉంటుందని తదితర అంశాలతో ఆయా కమిటీలు పోలీసుల వద్ద అనుమతి పొందాలని సూచించారు.

ఫాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ

సంతమాగులూరు : మండల ఫాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీని సోమవారం మండలంలోని వలీవల ప్రార్థనా మందిరంలో ఎన్నుకున్నారు. కమిటి అధ్యక్షుడిగా బి.కిష్టాఫర్, ఉపాధ్యక్షుడిగా జక్రయ్య, సెక్రటరీగా సువర్ణరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌కు చెందిన పాల్ అక్బర్ ఖాన్ హాజరయ్యారు.

24 నుంచి రుణాలకు ఇంటర్వ్యూలు

సంతమాగులూరు : వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాకాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూల తేదీలు ఖరారయినట్లు ఎంపీడీవో హేమాద్రినాయుడు తెలిపారు. ఈ నెల 24న కాపు, బీసీ, 28న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇంటర్వ్యూలు స్థానిక మండల పరిషత్ కార్యాలంలో జరుగుతాయన్నారు.

అద్దంకి పట్టణంలో 23 నుంచి..

అద్దంకిటౌన్ : నగర పంచాయతీలో 2017-18 సంవత్సరం కార్పొరేషన్ల రుణాలకు ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 23 నుంచి స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 11 గంటలకు మైనార్టీ, 24న కాపు, బీసీ, 22న షెడ్యూల్ కులాల వారికి బ్యాంక్ అధికారుల సమక్షంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు.

సీతారావమ్మకు ఎమ్మెల్యేల నివాళులు

అద్దంకి : అద్దంకి రూరల్ విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ దారం రాంబాబు సతీమణి సీతారావమ్మ విద్యుత్ షాక్‌తో హైదరాబాద్‌లోని నిజాం పేటలో మృతిచెందగా మృత దేహాన్ని ఆదివారం రాత్రి అద్దంకి తీసుకు వచ్చారు. అర్ధరాత్రి చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, సోమవారం ఉదయం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.


ఊటబావులు, ఎత్తిపోతల పథకాల సమీపంలో ప్రవహిస్తున్న నీరు

గుండ్లకమ్మ నదికి వరద నీరు

అద్దంకి : గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. నది ఎగువ పరివాహక ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు చేరిన నీరు క్రమేపి సాగుతూ సోమవారం ఉదయానికి అద్దంకి ప్రాంతానికి చేరింది. సాయంత్రానికి పట్టణం సమీపంలోని బ్రిడ్జి దాటింటి. మంగళవారం నాటికి అనమనమూరు సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీటిలో కలసే అవకాశం ఉంది.

పాఠశాలను పునరుద్ధరించాలి

శాంతినగర్ (అద్దంకి రూరల్) : మండలంలోని చక్రాయపాలెం పంచాయతీ శాంతి నగర్ గ్రామంలో విద్యార్థుల తక్కువమంది ఉన్నారనే నెపంతో ప్రాథమిక పాఠశాలను వారం రోజుల క్రితం మూసివేశారని, వెంటనే తెరంపించాని సీపీఎం నాయకుడు మోండ్రు చిన్న సుబ్బారావు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సోమవారం ఎంపీడీవో హేమాద్రి నాయుడుకు వినతి పత్రం అందజేశారు. విద్యా సంవత్సరం మధ్యలో పాఠశాల మూసివేస్తే పిల్లల భవిష్యత్తు ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నించారు. చదువు కొనసాగించాలన్నా గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చక్రాయపాలెం పాఠశాలకు నామ్ రహదారిపై నడిచి వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. సమస్యను డీఈవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఎంపీడీవో హామీ ఇచ్చారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు


ఏవీపాలెంలో పూడ్చివేసిన బోరును పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి

25 బోరు బావుల పూడ్చివేత

పంగులూరు : మండలంలో నిరుపయోగంగా తెరుచుకొని ఉన్న 25 బోరు బావులను పూడ్చివేయించినట్టు తహసీల్దార్ పి.పార్వతి తెలిపారు. కొండమూరులో 12, కోటపాడులో 4, కొప్పెరపాడు, తక్కెళ్లపాడు, ఏవిపాడు, అలవలపాడులో బోరు బావులను మట్టితో కప్పివేశామని వివరించారు. రైతులు తమ పంట పొలాల్లో బోరు బావులు తీయించి వినియోగించకుండా వదిలేస్తే వాటిని వెంటనే పూడ్పించాలని ఆమె కోరారు.

కాలువల పనులు ప్రారంభం

అద్దంకిటౌన్ : నగర పంచాయతీ పరిధిలోని భవాని థియేటర్ వెనుక కాలనీలో మురుగు కాలువల నిర్మాణం సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏఈ శ్రీరామమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్లుకు ఇరువైపులా మురుగు కాలువను నిర్మించేందుకు పనులు ప్రారంభించామన్నారు. రూ. 11 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాలనీకి చెందిన ఓ వ్యక్తి తనకు తెలియకుండా పనులను చేయడం ఏమిటని అడ్డుకున్నాడని దీంతో ఆ పక్క పనులు ఆపి వేసి మరోక వైపు పనులు చేపడుతున్నామన్నారు. 14 సంవత్సరాల క్రితం కాలనీ ఏర్పడినా ఇప్పటి వరకు ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదు. ప్రస్తుతం రోడ్డు, కాలువ పనులు చేపట్టడంపై కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పనులు జరుగుతున్న దృశ్యం

విద్యార్థులకు అవగాహన

అద్దంకిటౌన్ : విద్యార్థులు చదువుకునే రోజుల నుంచి ఉద్యోగాలు పొందే విషయంలో శిక్షణ ఎంతో అవసరమని హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు శ్యామ్, గోపీ అన్నారు. సోమవారం స్థానిక శింగరకొండ వద్ద కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగ శిక్షణా కార్యక్రమాలు ఇన్ చార్జి ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందడంపై విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు ఎలా మెలగాలనే దానిపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ ఎన్ . వెంకటరమణ పాల్గొన్నారు.

దివ్యాంగుల గ్రూపులు బలోపేతం

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దివ్యాంగుల పొదుపు గ్రూపులను బలోపేతం చేస్తామని వెలుగు ఏపీఎం సుబ్బారావు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో దివ్యాంగుల మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దివ్యాంగులకు అందుతున్న రాయితీలు తదితర అంశాలపై ఆయన వివరించారు.

24న ప్రజా తనిఖీ వేదిక

బల్లికురవ : ఉపాధి హామీ పథకం ఆడిట్‌కు సంబంధించి ఈ నెల 24న స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సామాజిక ప్రజా తనిఖీ వేదిక జరుగుతుందని ఏపీవో మురళీ తెలిపారు.

బహుమతుల ప్రదానం

బల్లికురవ : మండలంలోని ఈర్లకొండ వద్ద ఈ నెల 7 నుంచి 12 వరకు 18వ భద్రతా వారోత్సవాలు జరిగాయి. ఈ వారోత్సవాల్లో అన్ని క్వారీలను తనిఖీ బృందాలు పరిశీలించాయి. భద్రతా ప్రమాణాలు చేపట్టిన క్వారీలను గుర్తించి ఆదివారం ఒంగోలులో భద్రతా వారోత్సవాల సెంటర్ జోన్ డీడీజీ స్వప్నకుమార్ దత్తు చేతులమీదగా బహుమతులు అందజేశారు. ఇందులో ఏ గ్రూపులో ప్రథమ స్థానంలో కృష్ణసాయి, ద్వితీయ స్థానంలో అంకమ్మ చౌదరి, తృతీయ స్థానంలో ఎస్ఆర్ కనస్ట్రక్షన్, బి గ్రూపులో ప్రథమ స్థానంలో శ్రీ శ్రీనివాస, ద్వితీయ స్థానంలో రాఘవేంద్ర, తృతీయ స్థానంలో జమ్ము గ్రానైట్ క్వారీలు నిలిచి బహుమతులను కైవసం చేసుకున్నాయి.

రికార్డులు పూర్తిచేయండి

సంతమాగులూరు : మండలంలోని వీఆర్వోలందరూ వచ్చే నెలలో జరిగే జమాబందీకు రికార్డులను పూర్తి చేయాలని తహసీల్దార్ టీఎల్ కాంతారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అన్ని గ్రామాల వీఆర్వోలతో సమావేశం జరిగింది.

నేడు రైతులకు అవగాహన

సంతమాగులూరు : విద్యుత్ వినియోగంపై మంగళవారం ఉదయం 10 గంటలకు సంతమాగులూరు విద్యుత్ ఉపకేంద్రం వద్ద అవగాహన జరుగుతుందని విద్యుత్ ఏఈ శ్రీనివా సరావు తెలిపారు. సమావేసానికి ఏడీ నాగేశ్వరరావు హాజరవుతారన్నారు.

సినిమాలు

అద్దంకి

వీఎన్ఎస్ - నేనే రాజు నేనే మంత్రి
మినీ వీఎన్ఎస్ - లై
కళామందిర్ - జయ జానకి నాయక
శ్రీరామ - ఆనందో బ్రహ్మ

మేదరమెట్ల

నారాయణ
చిత్రాలయ - జయ జానకీ నాయక

గ్రీవెన్స్‌కు 45 అర్జీలు

చీరాల రూరల్ : తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 45 అర్జీలు అందినట్టు తహసీల్దార్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. రేషన్‌కార్డులకు 7, నివేశన స్థలాలకు 8, ఎన్‌ఎఫ్‌బీఎస్‌కు 5, గృహనిర్మాణానికి 16, పింఛన్లకు 2, ఇతర సమస్యలపై 7 అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి పరిష్కారిస్తామన్నారు.

పారిశుధ్యం.. అధ్వానం

సాయికాలనీ, ఎన్‌టీఆర్ నగర్ ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్త

కాలుష్యం దుర్వాసనతో ప్రజల అవస్థలు



ఇళ్ల మధ్య పేరుకు పోయిన చెత్త



పాఠశాల ప్రాంగణంలో వేస్తున్న చెత్త

చీరాల రూరల్ : మండలంలోని బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీ, ఎన్‌టీఆర్‌నగర్ ప్రాంతాల్లో పారిశుధ్యం అత్యంత దయనీయంగా మారింది.

గ్రామానికి ఆనుకొని మురికి వాసనతో ఇబ్బంది పెట్టే కుందేరు ఒక సమస్య అయితే చెత్తను తొలగించకుండా పేరుకుపోతున్న దిబ్బలు మరో అవస్థ. పందుల సంచారం, దోమల బెడద కూడా అధికంగా ఉంది. వీటి వల్ల వచ్చే కుళ్లిన దుర్వాసనలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో యథేచ్ఛగా చెత్తను పోయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని, మురుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ సిబ్బంది రావడం లేదు..



పంచాయతీ పరిధిలోని మా గ్రామం అంటే ఎప్పుడూ చిన్నచూపే. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎవరూ రారు. చెత్త పేరుకుపోయి కాలుష్యంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

- మొగిలి బాబు, రిక్షాపుల్లర్

బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ ఉండాలి..



పంచాయతీ సిబ్బంది ఎప్పుడో ఒకసారి వస్తుంటారు. వచ్చినా ఏం చర్యలు తీసుకుంటారో తెలియదు. పాఠశాల పరిసరాలు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. కనీసం బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతూ ఉంటే కొన్ని క్రిములు ప్రబలకుండా ఆపవచ్చు.

- టి.విలియమ్స్, హెచ్‌ఎం, ఎన్టీ ఆర్‌నగర్ పాఠశాల

ఇంటర్వ్యూ

చిన్నారుల్లో సమస్యను గుర్తించండి



డి.రాజశేఖర్ బాబు, ఐఈఆర్‌టీ, చీరాల

ప్రశ్న: భవిత సెంటర్ వల్ల ఉపయోగాలు ఏమిటి?

జవాబు : మానసిక దివ్యాగుంలకు అంగవైకల్యం కలిగిన 2 నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లలకు అవసరమయ్యే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం.

ప్ర: పిల్లల ఎంపిక ఎలా చేస్తారు ?

జ: ఏదైనా సమస్యతో బాధపడుతున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలు లేదా పాఠశాల హెడ్‌మాస్టర్ దృష్టికి తీసుకువస్తే మాకు తెలియపరుస్తారు.

ప్ర: పిల్లలకు ఎలాంటి వసతులు కల్పిస్తారు?

జ: ప్రతి సోమవారం ఫిజియోథెరఫీ, ప్రతిరోజు మానసిక, వినికిడి అంధత్వం లోపం ఉన్నవారికి ప్రత్యేక శిక్షణ ఇస్తాం.

ప్ర: సెంటరు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సాధించిన ఫలితాలు ఏమిటి?

జ: సుమారు 70 శాతం మంది పిల్లలు పనులను సొంతంగా చేసుకోగలుగుతున్నారు. ఒకరికి ప్రత్యేక పరికరం అమర్చి మాట్లాడేలా చేయగలిగాం.

ప్ర: ప్రజలకు మీరిచ్చే సూచనలు, సలహాలు ?

జ: చిన్న పిల్లలకు ఏ విధమైన సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకురావడానికి వెనుకాడవద్దు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను అందిపుచ్చుకోవాలి. ఏం అవసరం వచ్చినా 9949778961 ఈ నెంబరులో మమ్మల్ని సంప్రదించవచ్చు. *- చీరల రూరల్*

రుణాల ఇంటర్వ్యూలకు తేదీలు ఖరారు

చీరాల రూరల్ : 2017-18 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూల నిర్వహణకు తేదీలు ఖరారు చేసినట్టు ఎం పీడీవో కె.కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ఉదయం 10.30 గంటలకు ఎస్టీ, మ ధ్యాహ్నం 2.30 గంటలకు మైనార్టీ, 24 న ఉదయం 10.30 గంటలకు కాపు, ఫె డరేషన్ మధ్యాహ్నం 2.30 గంటలకు బీసీ, 25న ఉదయం 10.30 గంటలకు ఎస్సీ రుణాలు ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. దరఖాస్తుదారులు తప్పనసరిగా హాజరుకావాలన్నారు.

సినిమాలు

చీరాల

మోహన్	- జయ జానకి నాయక
సంగం	- లై
సాయిప్యాలెస్	- ఆనందోబ్రహ్మ
శాంతి	- నేనే రాజు నేనే మంత్రి

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

• ఎంపీడీవో కోటేశ్వరరావు



పంచాయతీ కార్యదర్శులతో చర్చిస్తున్న ఎంపీడీవో కోటేశ్వరరావు

చీరాల రూరల్ : మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో కోటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మురుగుదొడ్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పలు మారుమూల ప్రాంతాల్లో పూర్తి కావాల్సిన మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం చేయకుండా చూడాలన్నారు. అన్ని రోగాలకు మూలకారణాలైన బహిరంగ మలవిసర్జన, పేరుకుపోతున్న చెత్తపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి సమస్యలైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

సమావేశంలో ఈవోఆర్‌డీ బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రం అందజేత



వినికిడి యంత్రం అందజేస్తున్న లయన్ క్లబ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు

చీరాల : ఆదినారాయణపురం ఎయిడెడ్ పాఠశాల విద్యార్థి భాస్కరరాజుకు సోమవారం లయన్‌క్లబ్ ప్రెసిడెంట్ రావూరి వెంకటేశ్వర్లు వినికిడి యంత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం భవనం బద్రిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో లయన్ డాక్టర్ పున్నారావు వినికిడి యంత్రం వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సోమవతి సోమవారం ప్రత్యేక పూజలు

చీరాల : శ్రావణమాసం ఆఖరి రోజు, సోమవారం, సూర్యగ్రహణం, అమావాస్య కలిసిన రోజుకు ఎంతో విశిష్టత ఉంటుంది. సోమవారం సోమవతి సోమవారం కావడంతో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తే సఖల శుభాలు చేకూరతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో సోమవారం భక్తులు శివాలయాల్లో పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చక స్వాములు శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించారు. పూజా క్రతవు అనంతరం ప్రసాద వితరణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో శివాలయాలు కిక్కిరిసాయి. ఇలాంటి రోజు అత్యంత అరుదుగా, శతాబ్దాలకు ఒకసారి వస్తుందని పండితులు పేర్కొన్నారు. ఒక వ్యక్తి జీవిత కాలంలో ఈ రోజు రావడం, ఆ రోజు ప్రత్యేక పూజల్లో పాల్గొనడం శుభమని వారు వివరించారు.



పూజలు చేస్తున్న దృశ్యం

భవిత కేంద్రాలను వినియోగించుకోండి

చీరాల రూరల్ : మానసిక దివ్యాంగులకు, అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భవిత సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని భవిత సెంటర్ ఐఈఆర్‌టీవో డి.రాజశేఖర్ అన్నారు. ప్రతి సోమవారం రెండు నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లలకు ఫిజియోథెరఫీ, ప్రతిరోజు స్పీచ్‌థెరఫీ, ప్రత్యేక శిక్షణలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సోమవారం నిర్వహించిన ఫిజియోథెరఫీలో ఫిజియోథెరపిస్ట్ విజయకుమారి, ట్రైనింగ్ టీచర్ దేవదాసు, తల్లిదండ్రులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు పాల్గొన్నారు.



ఫిజియోథెరఫీ చేస్తున్న దృశ్యం

మండపాలు, నిమజ్జనానికి అనుమతి తప్పనిసరి

• సీఐ సూర్యనారాయణ



చీరాల : వినాయకచవితికి పట్టణంలో మండపాల ఏర్పాటు, నిమజ్జనాకి తప్పనిసరిగా పోలీసుల ముందస్తు అనుమతి తీసుకోవాలని వన్‌టౌన్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ వన్‌టౌన్ స్టేషన్‌లో పందిళ్ల నిర్వాహకులు ఎస్‌హెచ్‌వోను కలిసి అనుమతి పొందాలన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు నుంచి మైక్‌లు, లైటింగ్ తదితర విషయాల్లో అనుమతి తప్పనిసరి అన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా పందిళ్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కమిటీ నిర్వాహకులదేనన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఊరేగింపులు, నిమజ్జనం సమయాల్లో నిర్వాహకులు కోరితే అవసరమైన వారికి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తామన్నారు. ఎవరికి వారు స్వీయనియంత్రణతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు.

ప్రజావాణికి 19 ఆర్జీలు

వేటపాలెం : తహసీల్దార్ కార్యాలయలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి వివిధ సమస్యలపై 19 మంది అర్జీలు వచ్చాయని తహసీల్దార్ మాదవీలత తెలిపారు. ఎన్‌ఎఫ్‌డీఎస్ కోసం 11, రేషన్‌కార్డులకు 2 పొలం సర్వే1, పిం ఛన్‌కు 1, నివేశశ స్థలాలకు 4 అర్జీలు అందాయన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కురిచేడు వాసి ఎంపిక

కురిచేడు : పాండిచ్చేరి యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కురిచేడుకు చెందిన సయ్యద్ ఖాసిం షరీఫ్ ఎంపిక అయ్యారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన ఒకే ఒక్క వ్యక్తిగా ఖాసిం షరీఫ్ రికార్డు సృష్టించారు. ప్రాథమిక విద్యాభ్యాసం కురిచేడులోనూ, ఇంటర్ నరసరావుపేట, డిగ్రీ దర్శిలో చదివారు. ఉన్నత చదువులు నాగార్జున యూనివర్సిటీలో చదివాడు. ఇటీవల జరిగిన ఇంటర్వ్యూలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 13 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారిలో ఖాసిం ఒక్కరే ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా షరీఫ్‌ను పలువురు అభినందించారు.

‘మారళ్ల’లో ట్రయల్ రన్

ఎత్తిపోతల పథకం ప్రారంభానికి ఎస్ఐ శ్రీకారం : 2530 ఎకరాలకు సాగునీరు అందుతుందని అంచనా

ముండ్లమూరు : మారెళ్ల సమీపంలో రూ.22 కోట్లతో గుండ్లకమ్మ నదిపై చేపట్టిన గంగన్నపాలెం ఎత్తిపోతల పథకం-2కు ఎస్ఐ బాలరంగయ్య సోమవారం ట్రయల్ రన్ వేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో రైతులు సంబరపడ్డారు. ఈ పథకానికి ఏడాది కిందట అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు భూమి పూజ నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుండ్లకమ్మకు నీరు చేరడంతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు ట్రయన్‌రన్ వేశారు. ఈ పథకం ద్వారా గంగన్నపాలెం, సుంకరవారిపాలెం, నూజెళ్లపల్లి, తూర్పు కంభంపాడు, మారెళ్ల గ్రామాలకు చెందిన 2530 ఎకరాలకు సాగునీరు అందనున్నదని అధికారులు అంచనా వేశారు. ఎత్తిపోతల పథకాన్ని వినియోగం చుకొని రైతులు సిరులు పండించాలని ఎస్ఐ బాలరంగయ్య ఆకాం క్షించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎస్ఐ అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సుంకర రాఘవరెడ్డి, జంపాని రమా శ్రీనివాసరావు, బుర్రి వెంకటరత్నం, మేడికొండ చిన నారాయణస్వామి, రమణయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నీటి పారుదలను పరిశీలిస్తున్న ఎస్ఐ, రైతులు


సాగులో ఉన్న వాగు పోరంబోకు

వాగు పోరంబోకు ఆక్రమణ

కురిచేడు : పడమరవీరాయపాలెంలో ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించి సాగు చేశారు. దీనివిలువ రూ.కోటి రూపాయలు పైబడి ఉంటుందని అంచనా. మరికొందరు వాగులో బావులు తీస్తున్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. వెంగాయపాలెం నుంచి పడమర వీరాయపాలెం వెళ్ళే దారిలో ఉన్న ఉప్పువిన్నెల వాగు పక్కనే ఉన్న సర్వే నం240/2లో ఉన్న 41.55 ఎకరాల భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించి సాగు చేశారు. అందులో వరి పండిస్తున్నారు. మరికొందరు దళారులు వాటిని అమ్ముకుని లక్షలు కాజేసినట్లు సమాచారం. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ శ్రీనివాస రావు గ్రామంలో దండోరా వేయించారు. వాగులో కానీ, వాగు పోరంబోకు భూముల్లో బావులు తవ్వకాలు కుదరదన్నారు.

పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు

కురిచేడు : విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక ఆహారాన్ని అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కురిచేడు ఎంఈవో ఆర్ వస్రాం నాయక్ చెప్పారు. ప్రతి పాఠశాలకు గ్యాస్‌కనెక్షన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇకపై పాఠశాలలో తప్పని సరిగా గ్యాస్ మీదనే వంట చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

టీచర్లకు అవగాహన తరగతులు

కురిచేడు :ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయలకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు చెందిన 65 మంది ఉపాధ్యాయులు సోమవారం టెలికాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. వారికి ప్రాథమిక స్థాయి తరగతులకు సంబంధించిన శిక్షణకు ఇచ్చారు.

శివాలయంలో పూజలు

కురిచేడు : శ్రావణమాస సోమవతి ప్రత్యేకతను పురస్కరించుకుని స్థానిక శ్రీ జ్ఞాన ప్రసూనాంబ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కరిచేటి ఆదిశేషయ్య, పోతిరెడ్డిపల్లి మారుతి కోటేశ్వర శర్మ, దేవలపల్లి విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు

దర్శి సినిమాలు

వెంకటేశ్వర	:	ఫిదా
శ్రీనివాస	:	లై
శివశంకర్	:	జయ జానికి నాయక
భాస్కర్	:	నేనే రాజు నేనే మంత్రి

క్షతగాత్రులను ఆదుకున్న ఎస్ఐ

దొనకొండ : క్షతగాత్రులను పోలీసులు ఆదుకున్నారు. దొనకొండలో సోమవారం ఈ సంఘటన జరిగింది. తెల్లబాడు గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై భార్య, కుమారుడితో దొనకొండకు వస్తున్నాడు. అదుపు తప్పి వారి వాహనం బోల్తాపడడంతో ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన వారిని ఎస్ఐ అజయ్‌కుమార్ వెంటనే తన జీపులో ఎక్కించుకొని వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐను పలువురు అభినందించారు.

కోతికి అంత్యక్రియలు

ముండ్లమూరు : పెద ఉల్లగల్లు గ్రామ స్థులు కోతికి అంత్య క్రియలు నిర్వహిం చారు. కొత్తూరు సెంటర్‌లో సోమవారం ఈ సంఘటన జరిగింది. వేప చెట్టుపై నుంచి కిం దపడిన కోతి మృతిచెందడంతో మిగతా వా నరలంతా అక్కడికి చేరుకొని దీనస్థితిని ప్రదర్శించాయి. ఇది చూసిన పెద ఉల్లగల్లు గ్రామస్థులు వెంటనే చనిపోయిన వానరాన్ని ఊరేగించిన తరువాత అంత్యక్రియలు చేశారు.

శివాలయాలకు భక్తుల తాకిడి

ముండ్లమూరు : శివాలయాలకు భక్తులు సోమవారం పోటెత్తారు. కొన్ని వందల సంవత్సరాలకు ఒక్కసారి అమావాస్య రోజు సోమవారం రావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడిపోయాయి. ఈ సందర్భంగా శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

28 మందికి జైలు

దర్శి : మద్యం సేవించి వాహనాలు నడిపిన 28 మంది నిందితులకు జైలుశిక్ష విధిస్తూ దర్శి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి. శ్రీనివాసరావు సోమవారం తీర్పు ఇచ్చారు. దర్శి మండలంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా దర్శి ఎస్ఐ ఎం. సుబ్రహ్మణ్యం కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరు పర్చుగా ఇద్దరికి 15 రోజులు, ఒకరికి 10 రోజులు, ఒకరికి 9 రోజులు, 4గురికి 12రోజులు, ఒకరికి 7 రోజులు, 5గురికి 6 రోజులు, 5గురికి 4రోజులు, 6గురికి 5 రోజులు, ముగ్గురికి 3 రోజుల చొప్పున జైలుశిక్ష విధించారు. ఒక్కొక్క నిందితుడికి వెయ్యి రూపాయిలు చొప్పున జరిమానా విధించారు.

పొలం కోసం ఘర్షణ

ముండ్లమూరు : పులిపాడు పంచాయతీ బృందావనం తండాలో పొలం కోసం ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం ఈ సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయిజానవత్తు గోవిందనాయక్ పొలాన్ని అదే గ్రామానికి చెందిన మాన్‌సింగ్ నాయక్‌తోపాటు మరికొందరు అక్రమంగా దున్నతుండగా గోవిందనాయక్ వెళ్లి అడ్డుకున్నారు. దీంతో మాన్‌సింగ్‌నాయక్ మరికొందమంది దాడిచేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ పి. బాలరంగయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూనివర్సిటీ ఏర్పాటుకు డిమాండ్

దర్శి : జిల్లాలో యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకులు జిల్లా కేంద్రమైన ఒంగోలులో యూనివర్సిటీని నెలకొల్పుతామని ఎన్నో ఏళ్లగా చెబుతున్నప్పటికీ, ఆచరణలో అమలు కావలేదన్నారు.జిల్లా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య వైఖరి వల్ల తీరని అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర జిల్లాలకు వర్సిటీలు మంజూరు అవుతున్నప్పటికి ప్రకాశం జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా హామీని నిలబెట్టుకోకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యు. శ్రీకాంత్, వి. సుభాష్, ఎస్.సాయి వెన్నెల, ఎస్. రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్


మాట్లాడుతున్న సీపీఎం డివిజన్ కార్యదర్శి ఆంజనేయులు

బ్యాంకర్ల సమ్మెకు మద్దతు

దర్శి : బ్యాంకు ఉద్యోగులు మంగళవారం చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం మద్దతు ఇస్తోందని దర్శి డివిజన్ సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ఆంజనేయులు తెలిపారు. దర్శిలో సోమవారం జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడుతూ బినామీ పేర్లతో బడా వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు కోట్లాది రూపాయలు రుణాలు తీసుకొని ఎగవేయడంతో బ్యాంకులు తీవ్ర నష్టాలకు గురవుతున్నాయని, ఆ భారం సామాన్యులపై వేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం కాకుండా ఉద్యోగులు చేపడుతున్న ఆందోళనలో అన్నివేళ్లల సీపీఎం పార్టీ మద్దతు ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పి నాయకులు సంద వెంకటేశ్వర్లు, ఈమని నాగేశ్వరరావు, జూపల్లి కోటేశ్వరరావు, కేవీ పిచ్చయ్య పాల్గొన్నారు.

పొలాలకు కరెంటు పెడితే చర్యలు

దొనకొండ : అడవి పందుల బారినుంచి పంటలను కాపాడుకునేందుకు పొలాల చుట్టూ కరెంటు పెడితే కఠిన చర్యలు తప్పవని మండల విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చందవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దేశిరెడ్డిపల్లె, లక్ష్మీపురం మరికొన్ని గ్రామాల్లో పొలాల చుట్టూ రైతులు వేసిన కరెంటు తీగలను ఆయన తన సిబ్బందితో సోమవారం తొలగించారు. పొలాల చుట్టూ కరెంట్ పెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఏగ్రామంలోనైనా పొలాలకు కరెంటు పెడితే అందుకు రైతులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

నంద్యాలలో తాళ్లూరు నేతల ప్రచారం


మంత్రి శిద్దాతో తాళ్లూరు టీడీపీ నేతలు

తాళ్లూరు : నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర మంత్రి శిద్దారాఘవరావుతో పాటు తాళ్లూరు మండల టీడీపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. టీడీపీ అభ్యర్థికి మద్దతుగా వారు సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరించారు. నంద్యాల టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని అధిక మెజా ర్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన వారిలో మండల టీడీపీ సీనియర్ నేతలు మారం ఇంద్రసేనారెడ్డి, పులి బ్రహ్మారెడ్డి ఉన్నారు.

బృందావనం కాలనీలో దాడి

ముండ్లమూరు : పులిపాడు పంచాయతీ పరిధిలోని బృందావనం కాలనీకి చెందిన కాటూరి మార్క్‌పై సోమవారం అదే గ్రామానికి చెందిన కాటూరి రోశయ్య, కాటూరి నారయ్య మరి ఇద్దరు అకారణంగా దాడిచేసి గాయపరిచినట్లు స్థానిక పోలీసు స్టేషన్ మార్క్ ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి. బాలరంగయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి దృష్టికి హాస్టల్ సమస్యలు

దర్శి : దర్శి నియోజకవర్గంలో ప్రభుత్వం వసతి గృహాలకు సొంతభవనాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్క ఆనందబాబుకు రాష్ట్ర దళితసేన అధ్యక్షత ప్రధాన కార్యదర్శులు కె. మార్కు, జి. ప్రేమ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. నంద్యాల నుంచి అమరావతి వెళ్తున్న ఆయన స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సోమవారం మధ్యాహ్నం కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా దళితసేన నాయకులు మంత్రిని కలిశారు. హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు హాస్టల్ వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ముంచుకొస్తున్న ముప్పు

- అడుగంటిన మంచినీటి జలాశయాలు
- 162 గ్రామాలకు పొంచిఉన్న మంచినీటి సమస్య


ఎండిపోయిన చందవరం-2 మంచినీటి స్టోరేజీ

దొనకొండ : మండలంలో రెండు మంచినీటి జలాశయాలు అడుగంటిపోయాయి. దీంతో రానున్న రోజుల్లో నాలుగు మండలాలకు చెందిన దాదాపు 162 గ్రామాల మంచినీటి సమస్య ఎదురు కానున్నది. వర్షాలు కురవడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారయ్యే అవకాశం ఉంది. మండలంలో ఇప్పటికే 21 గ్రామాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నీటి సరఫరా చేస్తున్నారు. చందవరం-1 స్టోరేజీ వద్ద ఏర్పాటు చేసిన రెండు బోర్ల ద్వారా దొనకొండ వరకు నీటిని సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. దొనకొండ మండలంలోని 29 గ్రామాల ప్రజలకు మంచినీటిని అందించేందుకు 1982లో చందవరం సమీపంలోని సాగర్ కెనాల్‌కు దాదాపు 2కిలోమీటర్ల దూరంలో 885 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన చందవరం-1 స్టోరేజీని నిర్మించారు.40 ఏళ్ల కిందట నిర్మించిన పథకం స్టోరేజీ రివిట్‌మెంట్ ఇప్పటికే దెబ్బతింది.పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతినడంతో పలు సమస్యలు ఏర్పడు తున్నాయి. పథకానికి చెందిన ట్యాంకులు సైతం శిధిలావస్థకు చేరుకున్నాయి. గ్రామాల్లో అక్రమ కొళాయిలు అధికమవ్వడంతో నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. కెనాల్‌కు సమీపంలో కొత్తగా స్టోరేజీ నిర్మించి పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా ప్రయోజనం లేకపోయిందని దొనకొండ ప్రజలు వాపోతున్నారు. సాగర్ కెనాల్‌కు సమీపంలో 800 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో చందవరం-2 స్టోరేజీని నిర్మించారు. కనిగిరి, కొనకనమిట్ల, హనుమంతునిపాడు, పొదిలి మండలాలకు చెందిన 132 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం రెండు స్టోరేజీల్లో సాగర్‌నీరు ఖాళీ అవ్వడంతో నీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితి కనిపిస్తోంది.సాగర్ కెనాల్‌కు నీటి సరఫరా జరిగితేనే మంచినీటి సరఫరా కొనసాగనున్నది. రానున్న మంచినీటి సమస్యను అధిగమించేందుకు ముఖ్యంగా సాగర్ జలాల విడుదలకు పాలకులు కృషి చేయాలని ఇప్పటికే పలువురు కోరుతున్నారు. సాగర్ కెనాల్ విడుదలయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని మరికొందరు సూచిస్తున్నారు.


సిద్ధాయిపాలెంలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

కెనాల్‌కు నీరు విడుదల చేయాలి

జి.శ్రీనివాసరావు, ఎన్‌ఏపీ ఏఈ

కెనాల్‌కు సాగర్ జలాలు విడుదలైతేనే నీటి సమస్య పరిష్కారమవుతుంది. స్టోరేజీలు పూర్తిస్థాయిలో నింపితే గ్రామాలకు మంచినీటిని అందించడానికి అవకాశం ఉంటుంది. చందవరం-1 స్టోరేజీకి నూతనంగా పంప్‌హౌస్, ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు, హైపవర్ మోటార్, కట్ట మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

పరిహారం కోసం వినతి


వినతిపత్రం ఇస్తున్న సీపీఐ బృందం

దొనకొండ : పరిశ్రమల కోసం భూసేకరణను చేపట్టిన అధికారులు 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ నాయకులు చెన్నుబోయిన గురుమూర్తి నేతృత్వంలో సోమవారం తహసీల్దార్ కావేటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాల్లో పట్టాదారులు, సాగు అనుభవదారులు, విక్రయ స్వాధీన పత్రాల ద్వారా సుదీర్ఘకాలంగా భూములను సాగుచేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు. భూములు కోల్పోతున్న రైతులందరికీ నష్టపరిహారంతో పాటు భూమి కోల్పోయే కుటుంబం జీవించడానికి వ్యవసాయ భూములు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ నాయకులు కె.బాలయ్య తదితరులు ఉన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

దర్శి : విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలని దర్శి ఎంఈవో కె. రఘురామయ్య సూచించారు. మండల పరిషత్‌లో సోమవారం జరిగిన కాంప్లెక్స్ సమావేశాలను ఆయన పర్యవేక్షించారు.జాతీయ విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. విద్యాప్రమాణాల పరిస్థితి తెలుసుకునేందుక 3,5,8 తరగతుల విద్యార్థులకు త్వరలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలను ఎలా నిర్వహించాలన్న అంశాలపై ఉపాధ్యా యులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణామండలి డైరెక్టర్ రాజ్యలక్ష్మి, పాండురంగరావు అవగాహన కల్పిం చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పరీక్షలు నిర్వహించాలని ఎంఈవో రఘురామయ్య సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా చెక్కుల పంపిణీ


బీమా చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

దర్శి : పేదలకు చంద్రన్న బీమా పథకం ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందని దర్శి ఎంపీపీ పూసల సంజీవయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నలుగురు బాధితులకు చంద్రన్న బీమా చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తులు మృతిచెందితే మిగతా సభ్యులను బీమా ఆదుకుంటుందన్నారు. పేదలంతా బీమా పథకంలో సభ్యులుగా చేరాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మారం శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో ఆంజనేయ శాస్త్రి, వెలుగు ఏపీఎం మస్తాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు


సమస్యలపై చర్చిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

దొనకొండ : గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా ఉండేదుకు వీఆర్వోలు ప్రతిరోజూ పర్యవేక్షించాలని తహసీల్దార్ కావేటి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వీఆర్వోలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు సంబంధించి భూముల ఆన్‌లైన్ పనులు, ఆన్‌లైన్ పాసుపుస్తకాల మంజూరులో రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సకాలంలో అందజేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కోకుండా ఉండడానికి గ్రామాలను పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోగు వెంకటేశ్వర్లు, ఆర్ఐ రాజేష్, సర్వేయర్ సిహెచ్ వెంకటరావు పాల్గొన్నారు.

దర్శి రూట్లో రాకపోకలకు బ్రేక్

కుంగిన మల్లెలవాగు చప్టా : నడవని ఆర్టీసీ బస్సులు : ప్రజలకు ఇక్కట్లు


రహదారిపై కుంగిన చప్టా

దొనకొండ : దొనకొండ-దర్శి రూట్లో గత మూడు రోజుల నుంచి రాకపోకలు స్తంభించిపోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఒక ప్రాంతంలో రోడ్డు తెగడం, మరో ప్రాంతంలో చప్టా కుంగిపోయింది. దీంతో దొనకొండ-దర్శి రూట్లో ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. గంగదేవిపల్లె గ్రామ సమీపంలోని మల్లెలవాగు ఉధృతంగా ప్రవహించడంతో చప్టా కుంగిపోయింది. తుమ్మెదలపాడు వద్ద రోడ్డు తెగిపోవడంతో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం మట్టిపోసినా ఫలితం లేకపోయింది. మరోసారి వర్షం కురిస్తే ప్రమాదం తీవ్రంగా ఉంటుందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పాడైపోయిన రహదారులకు శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఆస్తి కోసం ఘర్షణ

దొనకొండ : నరసింహనాయునిపల్లెలో ఆస్తి కోసం దాడి జరిగింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.అజయ్‌కుమార్ తెలిపారు. ఆ గ్రామానికి చెందిన కొత్తం రఘునాథరెడ్డిని అదే గ్రామానికి చెందిన కాకర్ల శ్రీనివాసరెడ్డి కర్రతో కొట్టాడు. దీంతో రఘునాథరెడ్డి గాయపడ్డాడు. ఆయన తమ్ముడు శ్రీకాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వైసీపీ సమావేశానికి హాజరుకావాలి

లింగసముద్రం: నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు బాలినేని శ్రీనివాసరెడ్డి ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు కందుకూరులో కార్యకర్తలతో సమావేశమవుతారని మండల వైసీపీ కన్వీనర్ పి.తిరుపతిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్నీ గ్రామాల వైసీపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

రేపు కందుకూరులో వైసీపీ నవరత్నాల సభ

కందుకూరు: నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 23న మధ్యాహ్నం 3 గంటలకు రాజ్ థియేటర్ వద్ద నవరత్నాల సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తూమాటి మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహనరెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలు, కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాలు, వార్డుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మండల కన్వీనర్లు, గ్రామ పార్టీ కన్వీనర్లు, బూత్ కమిటీల నాయకులు సమన్వయంతో అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

బి.వి.రమణకు లెజెండ్ ఆఫ్ ఇండియా అవార్డు

కందుకూరు: అమ్మ వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.వి.రమణకు లెజెండ్ ఆఫ్ ఇండియా అవార్డును అందజేసి సత్కరించారు. గుంటూరులోని ఎన్జీవో హోమ్‌లో గర్తపురి కన్స్యూమర్స్ కౌన్సిల్ వారు నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి డా. అనంతశర్మ, చంద్రకుమార్‌ల చేతుల మీదుగా సత్కారం జరిగింది. బివి రమణ స్వచ్ఛభారత్, నీరు - చెట్టు, మన బడి రుణం తీర్చుకుందాం వంటి కార్యక్రమాల నిర్వహణ, పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ, నిరుపేదలకు ఫీజులు కట్టడం, ఉచిత ప్రాణయోగ ధ్యాన శిక్షణ వంటి సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

నూరుశాతం సబ్సిడీపై జింక్ పంపిణీ

వలేటివారిపాలెం: రైతులకు నూరుశాతం సబ్సిడీపై జింక్ పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ విస్తరణాధికారి హర్షవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. జింకు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పాసు బుక్ జెరాక్సులతో స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చెత్తను రోడ్లపై వేస్తే చర్యలు

ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసన్

కందుకూరులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం



మురుగుకాలువల్లో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

కందుకూరు: పట్టణంలోని ప్రజలంతా చెత్తను చెత్త బుట్టల్లో వేసుకుని ఉంచటం ద్వారా చెత్త వాహనం, ట్రై సైకిళ్లలో మాత్రమే వేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సిహెచ్.శ్రీనివాసన్ విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటపాలెం, నాల్గో తరగతి ఉద్యోగుల కాలనీలలో సోమవారం మున్సిపల్ అధికారులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్లు, కాలువలను శుభ్రం చేసి రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలను తొలగించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో ఆయిల్ స్ప్రే చేయించి ఆయిల్ బాల్స్ వేయించారు. పట్టణంలోని 13,14,15 వార్డులలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున చెత్తను రోడ్లపై వేస్తే చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. దుకాణాల నిర్వాహకులు, ఇతరత్రా చిరు వ్యాపారులు చెత్తను సాయంత్రానికి రోడ్లపై వేస్తున్నారని, ఆ పద్ధతి మార్చుకుని చెత్తను ఓ పెట్టెలో వేసుపెట్టుకుని చెత్త వాహనంలో మాత్రమే వేయాలని స్పష్టం చేశారు. చెత్తను, ఇతర వ్యర్థ పదార్థాలను రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాలలో వేయటం వలన దోమలు పెరిగి అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా మురుగు నిలబడు ప్రదేశాలలో కిరోసిన్, వేస్ట్ ఆయిల్ వేసిన ఎడల దోమలు పెరిగే అవకాశం తగ్గుతుందని, డ్రైనేజీ సౌకర్యం లేని ప్రాంతాలలో మురుగునీరు బయటకు వదలకుండా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రైవేటు స్థలాల యజమానులెవరైనా తమ స్వంత ఖాళీ స్థలాలలో పెరిగే కంప చెట్లు, పిచ్చిమొక్కలు ఎప్పటికప్పుడు తొలగించుకుని ఆ స్థలంలో నీరు నిలువకుండా మెరక చేసుకుని ఆ పరిసర ప్రాంత వాసులకు అసౌకర్యం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పందుల యజమానులు ఊరికి దూరంగా పందులను తరలించుకోవాలని, పట్టణంలో పంది కనిపిస్తే నిబంధనల ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య పర్యవేక్షించారు.

గ్రీవెన్స్‌సెల్‌కు 14 అర్జీలు

లింగసముద్రం: లింగసముద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌కు ప్రజల నుంచి సమస్యల పరిష్కారం కోసం 14 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ టి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో చెప్పారు. వీటిలో కొత్తరేషన్ కార్డుల కోసం 6, ఆన్‌లైన్‌లో 1బీ అడంగల్ కోసం 8 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిని త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు.

గుడ్లూరు మండలంలో...

ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్‌సెల్‌కు 10 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఇందిరాదేవి సోమవారం తెలిపారు. 5 అర్జీలు కొత్తరేషన్ కార్డుల కోసం, మరో 5 అర్జీలు భూముల ఆన్‌లైన్ కోసం వచ్చినట్లు తెలిపారు.

నీళ్లు పడని బోర్ల మూసివేతకు చర్యలు

లింగసముద్రం: మండలంలో బోర్లు తవ్వి నీరుపడక వదిలేసిన బోర్లను గుర్తించి వాటిని మూసివేయించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ టి.వెంకటేశ్వరరావు చెప్పారు. సోమవారం ఆయన లింగసముద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి ఎక్కడెక్కడ బోర్లు మూసివేయకుండా ఉన్నాయో తెలుసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. బోర్ల మూసివేతను ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి పనిచేయాలన్నారు. అలాగే ఇసుక అక్రమంగా తరలిపోకుండా వీఆర్‌ఏలు కూడా తనకు సమాచారం అందించాలని చెప్పారు.

విధుల్లో చేరిన ఇద్దరు వీఆర్వోలు

లింగసముద్రం: మండలంలో మూడునెలల నుంచి సెలవుపై ఉన్న వీఆర్వోలు నందకుమార్, శివకుమార్‌లు సోమవారం విధులలో చేరారు. గడిచిన మూడునెలల క్రితం వీరు తమ వ్యక్తిగత పనులపై సెలవుపై వెళ్లినట్లు తహసీల్దార్ టి.వెంకటేశ్వరరావు చెప్పారు. వీరిలో నందకుమార్ తిమ్మారెడ్డిపాలెం, శివకుమార్ మాలకొండరాయునిపాలెం వీఆర్వోలుగా విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆయా గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం వీరు విధుల్లో చేరడంతో మండలాల్లో పనిచేస్తున్న వీఆర్వోల సంఖ్య 7కు చేరినట్లయింది. మరో నాలుగు వీఆర్వోల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

వినాయకచవితి విగ్రహాలకు అనుమతి తప్పనిసరి

లింగసముద్రం: ఈనెల 25న జరిగే వినాయకచవితి పండుగకు వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో కె.వి.మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విగ్రహం నిలిపి ఉంచే స్థలం ప్రైవేటు వ్యక్తులదా? ప్రభుత్వానిదా? వారి నుంచి అనుమతి ఉందా లేదా అనే వివరాలతో పాటు విద్యుత్ అనుమతి కూడా ఉందో లేదో తెలియజేయాలని చెప్పారు. పండుగ సందర్భంగా అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు, రేపు ఎమ్మెల్యే పర్యటన

లింగసముద్రం: కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు మంగళ, బుధవారాల్లో మండలంలోని 5 గ్రామాలలో పర్యటిస్తారని మండల టీడీపీ అధ్యక్షుడు చిట్టాబత్తిన వీరబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మాలకొండరాయునిపాలెం, గంగపాలెం, విశ్వనాథపురం, బుధవారం యర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలలో పర్యటిస్తారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు.

పేదల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: కందుకూరు పట్టణంలోని నివాసప్రాంత సమస్యలు పరిష్కరించాలని స్థానిక సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం అందజేశారు. ఉప్పు చెరువులో లే అవుట్‌లో నివాసం ఉంటున్న వారికి తాగునీటి కొళాయి కనెక్షన్ ఇవ్వాలని, రోడ్లు కాలువలు నిర్మించాలని, సుందరయ్య నగర్‌లో తాగు నీటి కొళాయి కనెక్షన్‌లు ఇవ్వటంతో పాటు రోడ్లు, కాలువలు నిర్మించాలని, 2014లో పట్టాలు ఇచ్చిన వారికి పొజిషన్ చూయించాలని, జి ప్లస్ 3లో లబ్ధిదారులకు డిపాజిట్ లేకుండా గృహాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ అమీర్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎస్.ఎ.గౌస్, పార్టీ నాయకులు డా. ముప్పా కొండయ్య, ఓ.రామకోటయ్య, డి. రామమూర్తి, ఎం.మనోజ, మెడబలిమి ప్రసాద్, టి. వెంకటరావు, ఎస్.కె.మల్లిక తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

కందుకూరు

రాజ్	- ఫిదా
యువరాజ్	- వైశాఖం
ప్రశాంతి	-ఆనందోబ్రహ్మ
కోటేశ్వర	- నేనే రాజు నేనే మంత్రి
రాఘవ స్క్రీన్-1	- జయ జానకి నాయక
రాఘవ స్క్రీన్-2	- లై

స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేయాలి

కేంద్ర మంత్రి సుజనాకు వినతి

కందుకూరు: స్థానిక సంస్థల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లకు కూడా నిధుల కేటాయింపు జరిగేలా చూడటం ద్వారా ఆ వ్యవస్థలను బలోపేతం చేయాలని కేంద్ర మంత్రి సుజనా చౌదరికి విజ్ఞప్తి చేసినట్లు జడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు, కందుకూరు జడ్పీటీసీ కంచర్ల శ్రీకాంత్ చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. విజన్ 2022 కార్యక్రమంలో భాగంగా ఒంగోలు విచ్చేసిన సుజనా చౌదరిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. తనతో పాటు జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు ఎం.వీరయ్య చౌదరి, ఎంపీపీల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌లు సుజనాని కలిసి నేరుగా పంచాయతీలకు నిధులు ఇస్తూ జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లను నిరక్ష్యం చేస్తుండటం వల్ల ఆ రెండు సంస్థల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతున్న వైనాన్ని వివరించినట్లు తెలిపారు. అలాగే స్థానిక సంస్థల ప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులను వివిధ రాష్ట్రాలలో విజయవంతంగా నిర్వహించబడుతున్న వాటర్ మేనేజ్‌మెంట్, ఆదర్శ గ్రామాలను సందర్శించి అధ్యయనం చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ అత్యాధునిక లేబరేటరీల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా జిల్లా జడ్పీటీసీల సభ్యుల సంఘం ప్రధాన కార్యదర్శి సాయి రాజేశ్వరరావు, జరుగుమల్లి ఎంపీపీ పోటు పద్మావతి, యద్దనపూడి జడ్పీటీసీ సౌజన్య తదితరులు పాల్గొన్నట్లు శ్రీకాంత్ తెలిపారు.

కొనసాగుతున్న జీడీఎస్‌ల సమ్మె

పామూరు : కమలేష్ చంద్ర సర్వే రిపోర్టు సిఫార్సులను అమలు చేయాలని, రిపోర్టులోని కీలక అంశాలను ప్రభుత్వాలు తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని గ్రామీణ డాక్ సేవా (జీడీఎస్)ప్రతినిధులు కోరారు. వారు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి ఆరవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక పోస్టాఫీసు కార్యాలయంల నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మస్తాన్‌వలి, వెంకటరెడ్డి, అబ్దుల్ వాహబ్, ఖాశీంపీరా, వై.విజయలక్ష్మి, ఎస్.రమేష్, శిరీషా పాల్గొన్నారు.

పెదపవని బస్టాండ్ సెంటర్‌లో బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

లింగసముద్రం: మండలంలోని పెదపవని గ్రామంలో బస్టాండ్ సెంటర్‌లో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా పెదపవని పరిసర ప్రాంతాల ప్రజలు కావలి, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్ సెంటర్‌కు అధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తారు. అయితే ప్రయాణికులకు బస్‌షెల్టర్ లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సర్పంచ్ సయ్యద్ నాయబ్‌రసూల్ ఇటీవల బస్టాండ్ పక్కనే ప్రభుత్వ స్థలంలో ప్రయాణికుల కోసం సిమెంటు బల్లలు ఏర్పాటు చేయించారు. అయితే ప్రయాణికులు ఇక్కడ ఎండల్లో కూర్చోవాల్సి వస్తుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి గ్యాస్‌పై మధ్యాహ్న భోజనం వండాలి

లింగసముద్రం: మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూళ్లు మధ్యాహ్న భోజనాన్ని గ్యాస్ సిలిండర్లపై వండాలని ఎంఈవో టి.ఎల్. కాంతారావు చెప్పారు. సోమవారం లింగసముద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో



హెచ్‌ఎంలకు సిలిండర్లను పంపిణీ చేస్తున్న ఎంఈవో కాంతారావు

కాంతారావు మండలంలోని 36 ప్రాథమిక పాఠశాలల, మూడు యూపీ పాఠశాలల, నాలుగు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఒక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా కొనుగోలు చేసిన స్టౌవ్‌లు, రెగ్యులేటర్, పైపులు కూడా వారికి అందించారు. ఒక్కో పాఠశాలకు రెండు సిలిండర్లు చొప్పున అందించినట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాలల్లో గ్యాస్‌లపై మధ్యాహ్న భోజనం వండే సమయంలో ప్రధానోపాధ్యాయులు, కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణులు పింఛన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కశ్యప పథకాన్ని ప్రవేశపెట్టి పేద బ్రాహ్మణులకు నెలవారీ పింఛన్లు మంజూరు చేస్తున్నందున ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ కార్పొరేషన్ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి రామచంద్రుని మల్లిఖార్జునరావు ఒక ప్రకటనలో కోరారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయటమే గాక వివిధ పథకాల ద్వారా నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి నూతనంగా నిరుపేద బ్రాహ్మణులకు పింఛన్లు మంజూరు చేయటం జరుగుతుందని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య, ఎండి మువ్వా పద్మలు ప్రకటించినందున అర్హులైన నిరుపేద బ్రాహ్మణులంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఫొటోలు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఇంటి ధ్రువీకరణ పత్రాలు, ఆంధ్రాబ్యాంక్ అకౌంటు పత్రాలను కూడా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ ఏడాది జూలై నెలాఖరు నాటికి 60 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని వివరించారు. ఇతర వివరాలకు 8333875893 నెంబరులో సంప్రదించాలని కోరారు.

తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు) : బిల్లులు చెల్లింపులో తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ముక్కు తిరుపతిరెడ్డి టీఏ, అరియర్స్ రూ.27,304లు ఇంతవరకు చెల్లించకపోవటం దారుణమన్నారు. ఎంఈవో స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఆర్సీ కార్యాలయంలో టీచర్ల ఫైళ్లను కొందరు తొక్కి పెడుతున్నారని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఓపెన్'లో ప్రవేశాలకు ఆహ్వానం

పామూరు : ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్, 10వ తరగతిలో చేరబోయే విద్యార్థులకు ఈనెల 31 వరకూ గడువు ఉందని విజ్ఞాన్ హైస్కూల్ కోఆర్డినేటర్ షేక్ షబ్బీర్ అహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్టడీస్ చేసే వారు ఉన్నత తరగతులు చదువుకోడానికి అవకాశం ఉందన్నారు.

పాఠశాల ఓ నందనవనం

- మొక్కల సంరక్షణలో ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ
- కళకళలాడుతున్న విద్యాలయం

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యకే పరిమితం కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందించేందుకు కృషిచేస్తున్నారు. ఆ పాఠశాల విద్యార్థులు పాఠశాల పరిసరాలలో పచ్చదనం పరిశుభ్రత బాట పడుతున్నారు. వారందరి కృషి ఫలితంగా నేడు ఉన్నత పాఠశాల ఓ సుందర వనంగా మారింది. విద్యార్థుల సంఖ్యలో మండలంలో ఉన్న అతి పెద్ద ఉన్నత పాఠశాలగా పేరుగాంచిన వలేటివారిపాలెం ఉన్నత పాఠశాల గ్రామపెద్దల సహకారంతో ఉపాధ్యాయులు పరిశుభ్రత, పచ్చదనంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పాఠశాల పరిసరాలలో రకరకాల మొక్కలు పెంచి మిగతా పాఠశాలలకు ఆదర్శంగా నిలిచారు. పాఠశాల భవనం కప్పి ఉండేలా చుట్టూ మొక్కలు పెంచుతున్నారు. చెట్ల మధ్యన సాయంత్రం వేళ పిల్లలకు స్టడీ క్లాసులు నిర్వహిస్తున్నారు. అలాగే విద్యార్థులకు ఆటపాటలు, వ్యాయామాలను నేర్పిస్తున్నారు. పాఠశాలలో సుమారు 425 మంది ఉన్నారు. వారందరూ మొక్కలను నాటడమే కాకుండా సంరక్షణ బాధ్యత కూడా తీసుకున్నారు. ప్రస్తుతమున్న ప్రధానోపాధ్యాయుడు షేక్ జిలానీబాషా ఆధ్వర్యంలో పరిశుభ్రత- పచ్చదనం కొనసాగుతుంది. ఇలా స్వచ్ఛందంగా అన్నీ విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీ స్థలాలలో మొక్కలు పెంచడంపై దృష్టి పెడితే పర్యావరణ పరిరక్షణకు దోహదపడవచ్చునని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పచ్చదనం పరుచుకున్న పాఠశాల ఆవరణ

మల్లేశ్వర ఆలయంలో పూజలు

పీసీపల్లి : పెద యిర్లపాడులోని మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. దశాబ్దాల పుణ్యతిథి సోమావతి అమావాస్య సందర్భంగా అర్చకస్వామి పలుకూరి సుబ్బారావు ఆధ్వర్యంలోని వేదపండితులు రాహుకాలంలో శివుడికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, సహస్రనామార్చనలు చేశారు. శ్రావణ మాసంలో చివరన అమావాస్య సోమవారం కలిసివచ్చిన రోజును సోమావతి అంటారని భక్తులకు వివరించారు.

ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్

హనుమంతునిపాడు : స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులకు సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 3,5,8 తరగతుల విద్యాభ్యాసన స్థాయిని నిర్ణయించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం బోధించే 40 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నాస్ సర్వే జరుగుతుందని, అందులో భాగంగా ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించినట్టు ఎంఈవో పెద్దిరాజు తెలిపారు.

గోడపత్రికల ఆవిష్కరణ

వెలిగండ్ల : ఉద్యోగుల మిలీనియం మార్చ్‌ను జయప్రదం చేయాలని ఏపీసీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గురవయ్య కోరారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో సోమవారం ఏపీసీపీఎస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిలినియం మార్చ్ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దాస్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఐ.వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు హరి కేశవ, ట్రెజరర్ రమేష్ పాల్గొన్నారు.

నారాయణ స్వామి ఆదాయం రూ.రూ.84,533లు

సీఎస్‌పురం(పామూరు) : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం ఆదాయం రూ.84,533లు వచ్చినట్లు దేవస్థాన ఈవో కేపీవీ ప్రసాద్ తెలిపారు. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.39,755లు, తీర్థప్రసాదాలకు రూ.17,450లు, శాశ్విత అన్నదానానికి రూ.27,368లు రాగా సీఎస్‌పురానికి చెందిన గోసు సుబ్బారెడ్డి, అంజమ్మ దంపతులు రూ.5,116లు, పామూరుకు చెందిన అంచూరి వెంకటరెడ్డి, ప్రేమగీతా దంపతులు రూ.5,116లు, వెలిగండ్ల మండలం కట్టకిందపల్లికి చెందిన దేవెండ్ల నారాయణ, సంధ్య దంపతులు రూ.5,016ల విరాళాలను అందజేసినట్టు ఈవో తెలిపారు.

నాంచారపురం దళితులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

కందుకూరు: కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ నాంచారపురం దళితులకు శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం పదేళ్ల క్రితం కేటాయించిన భూమిని ఉపయోగపడేలా దళితుల స్వాధీనంలోకి వచ్చేలా చర్య లు తీసుకోవాలని దళిత బహుజన మహాసంఘం నాయకులు కొండ్రు కోటయ్య, దామవరపు మాలకొండయ్య, ఎస్.కె.మస్తాన్‌వలి, పోకూరి బ్రహ్మయ్య, కుంచాల సుబ్బారావు, బి.కొర్నేలు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటిక లేక దళితులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం 2006లో సర్వే నెం.513/15లో ఎ.1.60 సెంట్లు భూమిని దళితుల శ్మశాన వాటికకు కేటాయిస్తూ అప్పటి తహసీల్దారు సరోజిని దేవి ఉత్తర్వులు జారీ చేశారని వారు తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ భూమి వేరొకరి ఆక్రమణలో ఉన్నందున దళితుల శ్మశాన వాటిక భూమి వారికి దక్కేలా చూడటంతో పాటు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దళితులపై నానాటికీ పెరిగిపోతున్న దాడులను నివారించేందుకు జిల్లా ఉన్నతాధికారులు కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

మరుగుదొడ్లపై అవగాహన కల్పించాలి

వెలిగండ్ల : మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రామ్మోహన్‌రెడ్డి కోరారు. స్థానికంగా మొగుళ్ళూరు పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. మరుగుదొడ్లను వినియోగంపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూస్ ఏఈ పవన్, పంచాయతీకార్యదర్శి షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

పెదవరిమడుగు పాఠశాల అభివృద్ధికి దాతల విరాళాలు

పీసీపల్లి : పెద వరిమడుగు పాఠశాల అభివృద్ధి కోసం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు సీహెచ్ గురుబ్రహ్మం రూ.30 వేలు, గుంటుపల్లి పాఠశాల హెచ్‌ఎం గళ్ళా చెన్నయ్య రూ.10 వేలు, బీఆర్ ప్రసాద్‌రెడ్డి రూ.10 వేలు, ఎంఈవో ఎం.నరసింహరావు రూ.5 వేలు విరాళంగా అందజేశారు. ఈ నగదుతో ప్రహరీ నిర్మిస్తామని హెచ్‌ఎం స్వర్ణ రమణయ్య తెలిపారు. ఎంఈవో నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకురావాలన్నారు. దాతలను ఎంఈవోతో పాటు, గ్రామస్తులు, హెచ్‌ఎం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌస్, కొండలరావు, శ్రీనివాసచారి, రాజాల కొండారెడ్డి, కరణం శ్రీను పాల్గొన్నారు.

స్వయం ఉపాధి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

కొండపి: వివిధ కార్పొరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 23, 24, 28 తేదీల్లో ఇంటర్వ్యూలు మండల పరిషత్ సమావేశం హాలులో జరుగుతాయని ఎంపీడీవో ఎ.ప్రభాకరరావు తెలిపారు. 23న ఎస్టీ, మైనార్టీలు, క్రిస్టియన్ మైనార్టీలకు చెందిన అభ్యర్థులకు కె. ఉప్పలపాడు యూనియన్ బ్యాంక్, కొండపి ఎస్‌బీఐ పరిధిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 24న కాపు, బీసీ, 28న ఎస్సీ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.


అలంకరణలో అమ్మవారు

శివాలయానికి పోటెత్తిన భక్తులు

జరుగుమల్లి : నర్సింగోలు గ్రామంలోని శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వరాలయంలో భ క్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అమావాస్య కావటం తోపాటు శ్రావణమాసంలో రావటం, ఇది అరుదుగా సంభవిస్తుందని, దీనికితోడు సూర్యగ్రహణం ఇదే రోజు రావడంతో ఈ రోజు శివునికి ప్రత్యేక పూజలు చేస్తే ప్రతిఫలం సిద్ధిస్తుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివునికి, శనేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చంద్రన్న బీమా పేదలకు వరం

సింగరాయకొండ రూరల్: సోమరాజుపల్లి గ్రామంలో సోమవారం కుచర్ల ।ను(47) సోమవారం సహజమరణం చెందాడు. ఆయన భార్య ఇందిరకు రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు పొనుగోటి కొండయ్య చేతుల మీదుగా చంద్రన్న భీమా నుంచి మట్టి ఖర్చులకు 5వేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా చంద్రన్న భీమాను అమలు పరచడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కిందని ఆయన అన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయినపుడు చంద్రన్న భీమా భరోసా ఇస్తుందని ఆయన తెలిపారు. వీరి వెంట జన్మభూమి కమిటీ సభ్యులు శీలం సుబ్రమణ్యం వేల్పుల సుధాకర్, భీమా మిత్ర శ్రీదేవి పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు విచారణ

కొండపి: కొండపి పంచాయతీలోని దాసరెడ్డిపాలెం గ్రామానికి చెందిన దాసరి రామకోటయ్య తనను కులం పేరుతో అదే గ్రామంలో ఉంటున్న కొణిజేటి శ్రీనివాసులుపై ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు గతంలో కేసు నమోదు కాగా, ఈ కేసుపై సోమవారంనాడు డీఎస్పీ శ్రీధర్ ఫిర్యాదుదారుడిని, బాధితుడిని, సాక్షులను విచారించారు.

ఆదాయం ఘనం.. వసతులు శూన్యం

- రైల్వే శాఖ నిర్లక్ష్యం
- ఫ్లాట్‌ఫాంపై దొరకని తాగునీరు
- అధ్వానంగా మరుగుదొడ్లు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

సింగరాయకొండ రూరల్: కోట్ల రూపాయల ఆదాయాన్ని అర్జిస్తున్నా వసతుల కల్పనలో రైల్వేశాఖ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ప్రయాణికుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు, కనిగిరి, కొండేపి మూడు నియోజకవర్గాలకు ప్రధానముఖ ద్వారం సింగరాయకొండ రైల్వే స్టేషన్‌నే. ఈ నియోజకవర్గాల ప్రజలు రైలు ప్రయాణాలకు ఈ స్టేషన్ పూర్తి అనుకూలం. ఇంతటి ప్రాధాన్యమున్న స్టేషన్‌లో తాగునీరు ప్లాట్‌ఫారాలపై పారిశుధ్యం లోపించి కొద్దిపాటి చినుకులకే షెడ్‌ల నుంచి వర్షపునీరు రావడం జరుగుతుంది.

మరుగుదొడ్లు వంటి వసతులు పూర్తి స్థాయిలో లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మొదటి ప్లాట్‌ఫారంలో స్త్రీలకు రెండు, పురుషులకు రెండు, దివ్యాంగులకు రెండు ఉండగా అవి వాడుకకు పనికిరాకుండా నిరుపయోగంగా ఉన్నాయి. రెండోప్లాట్‌ఫారం వద్ద ఒక్క మరుగుదొడ్డి కూడా లేకపోవడం గమనార్హం. తాగునీరుకు బదులుగా ఉప్పునీటిని కుళాయిలలో అందిస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ స్టేషన్‌లో ప్రధానంగా తాగునీటి ఎద్దడి ఉంది.స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కుళాయిల ద్వారా వచ్చే నీరు వాడుకకు తప్ప తాగునీటికి పనికిరాదు. స్టేషన్‌లో సుమారు రూ.2లక్షల అంచనా వ్యయంతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికి అది నిరుపయోగంగా ఉంది. ఈ స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫారాల దూరం అధికంగా ఉంటుంది. అంతేగాక ఒక ప్లాట్‌ఫారం నుంచి మరొక ప్లాట్‌ఫారంనకు పోవాలంటే బ్రిడ్జి సౌకర్యం ఉంది. అయితే వికలాంగులు, వృద్ధులు ఈ బ్రిడ్జి ఎక్కాలంటే ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల లగేజీ రవాణాకు కూడా ఇబ్బందిగా ఉంటుంది.

రెండు ప్లాట్‌ఫారాల మధ్య అనుసంధానంగా పుట్‌వే ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. మూడు నియోజకవర్గాల ప్రజలు బెంగలూరు, వైజాగ్, హైదరాబాదు, నాగపూర్,చెన్నై వంటి దూర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. వీరికి అనుకూలంగా ఈ స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఆగినట్లైతే పూర్తి అనుకూలంగా ఉంటుంది.



సింగరాయకొండ రైల్వే స్టేషన్


పని చేయని ఆర్‌వో ప్లాంట్


నిరూపయోగంగా మరుగుదొడ్లు

హెచ్చరిక బోర్డులు తొలగించిన వారిపై చర్యలు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న లింగంగుంట ఎస్సీలు

పొన్నలూరు: వివాదాస్పదమైన భూమిలోకి వెళ్ళవద్దని రెవెన్యూ అధికారులు ఏ ర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి ఆక్రమణకు పూనుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లింగం గుంట గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు సోమవారం నాడు తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్‌కు వినతి పత్రం అం దజేశారు. 2005లో గ్రామ రెవె న్యూ పరిధిలోని సర్వే నెంబర్ 318, 319లో కొంత భూమిని అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఎస్సీలకు ఇచ్చారు. ఈ భూము లకు అధికారులు హద్దులు చూపించకపోవడంతో ఎస్సీలు సాగు చేసుకోలేదు. దీంతో కొం త మంది తమ పట్టా భూమికి పక్కనే ఎస్సీలకు ఇచ్చిన భూములు ఉండడంతో భూములలో ఉన్న చెట్లను ప్రొక్లెయినర్‌తో తొలగించి చదును చేశారు. ఇది గమనించిన ఎస్సీలు ప్రభుత్వం తమకు ఇచ్చిన భూములను ఆక్రమించారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల వారు ఆ భూములు మావంటే మావని గొడవలకు దిగడంతో 6 నెలల క్రితం అధికారులు వివాదాస్పదమైన భూమిని పరిశీలించి తాము చెప్పే వరకు ఎవరు ఈ భూములలోకి వెళ్ళవద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి బైండోవర్ కేసులు నమోదు చేశారు. కానీ గ్రామానికి చెందిన సదరు వ్యక్తి అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగించి వ్యవసాయ పనులు చేస్తున్నారని తమ భూములు కాపాడాలని ఎస్సీలు తహసీల్దార్‌కు విన్నవించారు.

రేపు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రజావేదిక

టంగుటూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 9వ విడత సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై 23న మండల పరిషత్ కార్యాలయ ఆవర ణలో ప్రజావేదిక జరుగుతుందని ఏపీవో రాఘవరాజు సోమవారం తెలిపారు. జాతీ య గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గత ఏడాది జూన్, 1 నుంచి ఈఏడాది మే 31 వరకు జరిగిన పనులపై 9వవిడత సా మాజిక తనిఖీ జరిగింది.ఈతనిఖీలో గుర్తిం చిన అంశాలపై ప్రజావేదిక నిర్వహిస్తున్న ట్లు ఏపీఏ చెప్పారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు విధి గా హాజ రుకావాలని ఆయన కోరారు.

నేడు అభివృద్ధి పనులపై నియోజకవర్గ స్థాయి సమీక్ష

టంగుటూరు: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జరిగిన అభివృద్ధి పనులపై మంగళవారం టంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష జరుగుతుందని ఎంపీడీవో హనుమంతురావు చెప్పారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్ అధ్యక్షతన ఈ సమీక్ష సమావేశం జరుగుతుందని, నియోజకవర్గంలోని ఆరు మండలాల పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ, వెలుగు ఏపీఎం, మండల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. ఉదయం 11గం.లకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

బ్యాంకర్లు సహకారం అందివ్వాలి : ఎంపీపీ చదలవాడ

టంగుటూరు: సబ్సిడీ రుణాలకు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా నిర్ణీత సమయంలో ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయడంలో తగిన సహకారం అందివ్వాలని ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ బ్యాకర్లను కోరారు. 2017-018 వార్షిక ఏడాదికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు ఈనెల 23 నుంచి లబ్ధిదారుల ఎంపిక జరుగనుంది. లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. కమిటీ ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను 72 గంటల్లోనే బ్యాంకర్లు ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీనిపై చర్చించేందుకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ బ్యాకర్ల సహకారం లేనందున గత ఏడాది సబ్సిడీ రుణాల పంపిణీ జాప్యం జరిగిందన్నారు. ఈఏడాది బ్యాకర్లు నిర్ణీత సమయంలో ఎంపిక చేయబడ్డ లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు గ్రౌండింగ్ చేయాలని కోరారు.

బ్యాంకర్ల సహకారం లేకుండా ఈ పథకం ముందుకు సాగేది లేదని చెప్పారు. ఎంపీడీవో హనుమంతురావు మాట్లాడుతూ ఈవార్షిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ లకు 200, బీసీలకు 45, కాపులకు 45, ఎస్టీ లకు 11,ముస్లీం మైనార్టీలకు 8,క్రిష్టియన్ మైనార్టీలకు 2 రుణాలు కేటాయించమైనదని వివరించారు. ఈరుణాల కోసం గత ఏడాది దరఖాస్తు చేసుకున్న వారు 2,500 మంది వరకు ఉన్నారని చెప్పారు.లబ్దిదారుల ఎంపికకు షెడ్యూల్ మంగళవారం విడుదల చేస్తాం అన్నారు.

సమావేశానికి బ్యాంకుల అధికారులు హాజరయ్యారు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

తహసీల్దార్ సుబ్బారావు

మర్రిపూడి : ప్రభుత్వ భూముల అక్రమించి పంటలు సాగుచేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.సుబ్బారావు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు గ్రామాల్లో పశువుల మేత, వాగు పోరంబోకు భూములను ఆక్రమిస్తున్నట్లు తెలిసిందని అవసరమైతే వారిపై క్రిమినల్ చర్యలకు కూడా వెనుకబోమని చెప్పారు. వివాదాస్పదం లేని భూమి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పలు గ్రామాల్లో దీర్ఘకాలికంగా భూ వివాదాలు చోటుచేసుకున్నట్లు తెలిపారు. న్యాయబద్ధతమైన భూసమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో వివాదాస్పద భూములను పరిశీలించి సర్వే జరిపించి హక్కు దారులకు హక్కులు కల్పిస్తామని స్పష్టం చేశారు. దళారులను ఆశ్రయించాల్సిన పనిలేదని నేరుగా సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలపై వీఆర్వోలు, గ్రామసేవలు ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలన్నారు. భూసమస్యలు పరిష్కరించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం వహిస్తే క్షమించేది లేదని సుబ్బారావు హెచ్చరించారు. మండలస్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలకు వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తానని పేర్కొన్నారు. కూచిపూడి, గుండ్రసముద్రం గ్రామాలలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగినట్లు తెలిసిందని సత్వరమే ఆక్రమణదారులు ఆ భూముల నుంచి తొలగిపోవాలని సూచించారు. ముఖ్యంగా పశువుల మేత పోరంబోకు భూమిలో సాగు చేపడితే ఇబ్బందులు తప్పవన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులందరికీ నివేశన స్థలాల ధృవపత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టంగా అమలు చేసేందుకు డీలర్లు సహకరించాలని కోరారు. వీఆర్ఓలు గ్రామస్థాయిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల తీరుతెన్నులను విధిగా పర్యవేక్షించాలని తహసీల్దార్ కోరారు. సమావేశంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, గ్రామ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

12500 మందికి ఎంఆర్ టీకా


వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

సింగరాయకొండ రూరల్: మండలంలో శానంపూడి గ్రామంలో సోమవారం ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ ఆలీ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల నుండి 15 సంవత్సరాల పిల్లలు 16,496 మంది ఉండగా వారిలో 12,500ల మం దికి ప్రస్తుతం ఎంఆర్ టీకాలు వేయించామన్నారు. సోమవారం 1009 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేయించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రా జమ్మ, భారతి, అరుణ, ధనమ్మ పాల్గొన్నారు.

50 శాతం పూర్తి అయిన ఉపాధ్యాయ టెలీకాన్ఫరెన్స్

సింగరాయకొండ రూరల్: పట్టణంలోని స్థానిక విద్యావనరుల కేంద్రంలో సోమవారం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ఎంఈవో బి.శివన్నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సుమారు ప్రభుత్వ పాఠశాలలు, హైస్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 130 మంది ఉండగా వారిలో 50శాతం సోమవారం, మిగిలిన 50శాతం మంగళవారం హాజరు అవుతారని తెలిపారు.

ఒక్కో కాంప్లెక్స్‌కు సంవత్సరానికి సర్వశిక్షా అభియాన్ తరుపున రూ.22వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. ఆ నగదును ప్రధానోపాధ్యాయులు టెలివిజన్ దానిని సంబంధించిన సామాగ్రి రిపేర్లకు, పాఠశాల అవసరాలకు వినియోగించుకోవాలని ఎస్ఎస్ఏ అధికారులు తెలిపారు.

మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయండి


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో పద్మజ

పొన్నలూరు: విజయవాడలో కొత్త పింఛన్‌ల విధానానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 1వ తేదీన సీపీఎస్ ఉద్యోగులు తలపెట్టిన మిలియన్ మార్చ్ పాల్గొని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు ఖాదర్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిలియన్ మార్చ్‌కు సంబంధించిన గోడపత్రికను ఎంపీడీవో పద్మజ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఖాదర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు కొత్త పింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టి సీపీఎస్ ఉద్యో గులను మోసం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా జరిగే ఉద్య మంలో అన్ని ఉద్యోగ సంఘాలు, నాయకులు మద్దతు పలికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఏపిసిపిఎస్ఇఏ నాయకులు రవి కొండలరావు, ప్రదీప్, రామకృష్ణ, వెంకట్‌తో పాటు పలు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఎంపికలు

పొన్నలూరు: 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ సంక్షేమ కార్పోరేషన్‌ల ద్వారా రాయితీతో పాటు బ్యాంకు రుణంతో స్వయం ఉపాధి పథకాలకు నమోదు చేసుకున్న లబ్ధిదారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ముఖాముఖి నిర్వహిస్తున్న ఎంపీడీవో పద్మజ సోమవారం ప్రకటనలో తెలిపారు. 23న ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారులకు 24వ తేదీన కాపు, బీసీ, కుమ్మరి, శాలివాహన, వడ్డెర కార్పొరేషన్‌ల లబ్ధిదారులకు 28న ఎస్టీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ముఖాముఖి ఉంటుందని, ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు.


మాట్లాడుతున్న రిమ్స్ వైద్య విద్యార్థులు

విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు

సింగరాయకొండ రూరల్: శానంపూడి పంచాయతీలో సాప్తా విద్యావాహిని కార్యక్రమం సోమవారం గ్రామస్తులకు పునరుత్తి మీద అవగాహన కల్పించారు.

ఆరోగ్య పర్యవేక్షకుడు మసూద్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పిల్లలకు, ఆరోగ్య అలవాట్ల మీద రిమ్స్ వైద్య విద్యార్థులు భావన, తేజస్వీ ఆరోగ్యానికి సంబంధించి సలహాలు ఇచ్చారు. భోజనం చేసే ముందుగా చేతులు శుభ్రంగా కడు క్కోవాలని, గోర్లు ఎక్కువుగా పెంచుకూడదని ఆ పిల్లలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది శ్రీనివాసులు, ప్రభావతి, ఆశా పాల్గొన్నారు.

రక్షణ లేని సర్కారు బడులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా భవనాలు

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలంలోని ప్రహరీలు లేని ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కరువైంది. లక్షలాది రూపాయల వ్యయంతో పాఠశాలలు భవనాలు నిర్మించినప్పటికీ ప్రహరీలు లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. మండలంలోని 42 ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, నాలుగు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీనిలో సగం పాఠశాలలకు ప్రహరీలు లేవు.

పాఠశాల ఆవరణలో కుక్కలు, పందులు, పశువులు విరవిహారం చేస్తూ అపరిశుభ్రత చేస్తున్నారు. అలాగే రాత్రివేళ కొంతమంది మందుబాబులు మద్యం సేవించడం, అ సాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. పాఠశాలల తరగతి గదులలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఆటస్థలాలు బహిర్భూమిగా వినియోగించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలేటివారిపాలెం, బండివారిపాలెం, గాంధీనగర్, బంగారక్కపాలెం, అమ్మపాలెం, చుండి, అయ్యవారిపల్లె, మాలకొండ, పోలినేని చెరువు, రామలింగాపురం, వీరన్నపాలెం, కట్టెమ్మపాలెం, లింగపాలెం, ఉప్పలపాడు, శామీరపాలెం, పోకూరు తదితర గ్రామాలలోని పాఠశాలలకు ప్రహరీలు లేవు. ప్రహరీలు లేకపోకపోవడంతో విషసర్పాలు, తరగతి గదులలోకి వస్తున్నాయి. పాఠశాల ఆవరణ పల్లంగా ఉండడంతో ఏమాత్రం వర్షం కురిసినా బురదమయంగా మారుతున్నాయి. పాఠశాలలకు దగ్గరలో పెంటకుప్పలు వేయడంతో విద్యార్థులు రోగాల పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఆవరణ స్థలాలలో పూడికమట్టితో ఎత్తు పెంచడంతో పాటు, పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

సింగరాయకొండ రూరల్: పట్టణంలో వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి చంద్రన్న బీమా నగదు చెక్కులను పంపిణీ చేస్తారని మండల ప్రధాన కార్యదర్శి సుదర్శి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యేకు అనంతవరం నేతల శుభాకాంక్షలు

తూర్పునాయుడుపాలెం(టంగుటూరు) : ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి నూతన దంపతులకు మండలంలోని అనంతవరం టీడీపీ నాయకులు సోమవారం వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతవరం టీడీపీ నాయకుడు కసుకుర్తి భాస్కరరావు, శీతారామయ్య ఆధ్వర్యంలో పలువురు తూర్పునాయుడు పాలెంలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే దంపతులను కలిసి శుభాకాంక్షలు చెప్పారు.


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెప్తున్న అనంతవరం టీడీపీ నాయకులు

డ్రాగన్ ఫ్రూట్ పంటతో అధిక లాభాలు

పొన్నలూరు: రైతులు డ్రాగన్ ఫ్రూట్ పంటలు పండించడం వలన అధిక లాభాలు పొందవచ్చునని కందుకూరు డివిజన్ ఉద్యానశాఖ సహాయ సంచాలకులు పి.జెన్నమ్మ అన్నారు. మం డలంలోని కె అగ్రహారం గ్రామంలో పి సుజాత అనే రైతు సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్ పంటను సోమవారం ఆమె పరిశీలించారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులకు డ్రాగన్ ఫ్రూట్ పంట అనువైనదని అన్నారు. నీటివిడ్డడి గల ప్రాంతాలలో రైతులు ఈ పంటను సాగు చేయడం వలన అధిక లాభాలు పొందవచ్చునన్నారు. మార్కెట్లో రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రంలో కూడా డ్రాగన్ ఫ్రూట్ పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఇప్పుడిప్పుడే ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. దీనిపై పూర్తి సమాచారానికి ఉద్యానశాఖ కార్యాలయ అధికారులను సంప్రదించాలని కోరారు. ఆమె వెంట ఎంపీఈవో పాండు ఉన్నారు.


డ్రాగన్ ఫ్రూట్‌ను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

నారాయణ స్వామి ఆదాయం రూ.84,533లు

సీఎస్‌పురం(పామూరు) : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయానికి ఆదివారం ఆదాయం రూ.84,533లు వచ్చినట్లు దేవస్థాన ఈవో కేవీవీ ప్రసాద్ తెలిపారు. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 39,755లు, తీర్థప్రసాదాలకు రూ. 17,450లు, శాశ్విత అన్నదానానికి రూ. 27,368లు రాగా సీఎస్‌పురంకు చెందిన గోసు సుబ్బారెడ్డి, అంజమ్మ దంపతులు రూ. 5,116లు, పామూరుకు చెందిన అంచూరి వెంకటరెడ్డి, ప్రేమగీతా దంపతులు రూ. 5,116లు, వెలిగండ్ల మండలం కట్టకిందపల్లికి చెందిన దేవెండ్ల నారాయణ, సంధ్య దంపతులు రూ. 5,016ల విరాళాలను అందజేసినట్టు ఈవో తెలిపారు.

ఆంధ్రజ్యోతి

4

కనిగిరి

ప్రకాశం • మంగళవారం 22 ఆగస్టు 2017

కనిగిరి | హనుమంతునిపాడు | వెలిగండ్ల | సీఎస్‌పురం | పామూరు | పీసీపల్లి

క్రిమినల్ కేసుల నమోదుకు డిమాండ్

కనిగిరి : రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పీసీ కేశవరావు కోరారు. స్థానిక తహసీల్దార్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. రేషన్‌బియ్యం పట్టుకొని ఐదు రోజులు బాధ్యులపై కేసులు నమోదు చేయకపోవడం సరికాదన్నారు. రాత్రి 12 గంటల సమయంలో బియ్యం తరలిస్తుండగా, తామును ట్టుకొని అధికారులకు అప్పజెప్పామన్నారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కేసులు నమోదుచేసే వరకు ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు) : బిల్లుల చెల్లింపులో తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. వి శ్రాంత ఉపాధ్యాయుడు ముక్కు తిరుపతిరెడ్డి టీఏ, అరియర్స్ రూ. 27,304లు ఇంత వరకు చెల్లించకపోవటం దారుణమన్నారు. ఎంఈవో స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఆర్సీ కార్యాలయంలో టీఏల ఫైళ్లను కొందరు తొక్కిపెడుతున్నారని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఓపెన్'లో ప్రవేశాలకు ఆహ్వానం

పామూరు : ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్, 10వ తరగతిలో చేరబోయే విద్యార్థులకు ఈనెల 31 వరకూ గడువు ఉందని విజ్ఞాన్ హైస్కూల్ కోఆర్డినేటర్ షేక్ షబ్బీర్ అహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్టడీస్ చేసే వారు ఉన్నత తరగతులు చదువుకోడానికి అవకాశం ఉందన్నారు.

పనిచేయని బోర్లు మూసివేత

కనిగిరి : పొలాలు, జనావాసాల మధ్య నిరుపయోగంగా ఉన్న బోర్లను అధికారులు మూసివేస్తున్నారు. ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. గుంటూరు జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనతో నిరుపయోగంగా ఉన్న బోరుగుంతల మూసివేతకు రంగం సిద్ధం చేసింది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ప్రతిరోజూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దానిపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం బోరుగుంతలను చురుగ్గా మూసివేస్తోంది. హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి మండలాల్లో సోమవారం 30 బోరుగుంతలు మూయించారు. శీతారామపురం, హాజీపురం, కిష్టంపల్లి, దొడ్డిచింతల, హనుమంతునిపాడు, వెలిగండ్ల గ్రామాల్లో బోరుగుంతలును తహసీల్దార్ ఈ చంద్రావతి మూయించారు. గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలు పర్యటించి బోరుగుంతలు మూయించాలని ఇప్పటికే ఆదేశించారు. గ్రామాల్లో దీనిపై దండోరా వేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హుస్సేనయ్య, వీఆర్వోలు ఎస్ మాలకొండేశ్వరరావు, ఎం మధుసూదనరావు, ఎస్పీ కాశయ్య ఉన్నారు.



బోర్లు పరిశీలనకు వచ్చిన తహసీల్దార్ చంద్రావతి

జీఎస్టీపై ఫొటోగ్రాఫర్ల నిరసన

కనిగిరి : జీఎస్టీకి వ్యతిరేకంగా కనిగిరి ఫొటోగ్రాఫర్ల యూనియన్ సోమవారం ఆందోళన చేసింది. ఫొటోగ్రాఫర్లు స్టూడియోలు బంద్ చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సాయిబాబా కల్యాణ మండపంలో వారు భేటీ అయ్యారు. ప్రభుత్వం జీఎస్టీని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆర్‌వీ శర్మ, గౌరవ సలహాదారుడుగా చావలి వెంకటేశ్వర్లు, అధ్యక్ష, కార్యదర్శులు చందనా షరీఫ్, శ్యామల శ్రీనివాసులు, ట్రెజరర్ వీఎస్ ఆచారి, జీ. కృష్ణా, ఉపాధ్యక్షుడుగా రవి, ప్రసాద్, వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీ దుర్గారావు,పేర్ల రమేష్, పుల్లారెడ్డి, సహాయకార్యదర్శులు నాయబ్‌రసూల్, నేతాజీ, కార్తీక్, నారాయణ, హరి, సభ్యులు హరి ప్రసాద్, లక్ష్మణ్, కోటయ్య, మనోహర్, కడియం మధు, రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మరుగుదొడ్లపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో రామ్మోహన్‌రెడ్డి

వెలిగండ్ల : మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రామ్మోహన్‌రెడ్డి కోరారు. స్థానికంగా మొగుళ్ళూరు పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు.మరుగుదొడ్లను వినియోగంపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూస్ ఏఈ పవన్, పంచాయతీకార్యదర్శి షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి సుజనా చౌదరితో చైర్మన్ల భేటీ

కనిగిరి : ఒంగోలులో సంకల్ప సిద్ధి సదస్సులో పాల్గొనేందుకు సోమవారం వచ్చిన కేంద్రమంత్రి వై. సుజానా చౌదరిని డీక్కాప్ చైర్మన్ గూడూరి ఎరిక్షన్‌బాబు, ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కేంద్రమంత్రి సుజానా చౌదరికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగత సుమాంజలి పలికారు. ఈ సందర్భంగా కనిగిరి ప్రాంత సమస్యలను కేంద్రమంత్రికి వివరించారు.



కేంద్రమంత్రి సుజానా చౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు, దారపనేని

మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలు

పీసీపల్లి : పెద యిర్లపాడులోని మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. దశాబ్దాల పుణ్యతిథి సోమవతి అమావాస్య సందర్భంగా అర్చకస్వామి పలుకూరి సుబ్బారావు ఆధ్వర్యంలోని వేదపండితులు రాహుకాలంలో శివుడికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, సహస్రనామార్చనలు చేశారు. శ్రావణమాసంలో చివరన అమావాస్య సోమవారం కలిసివచ్చిన రోజును సోమావతి అంటారని భక్తులకు వివరించారు. చంద్రుడు శివుడికి అభిషేకం చేసి తరలించిన రోజు అమావాస్య శివ పురాణమని చెబుతుందన్నారు. శ్రావణమాసం చివరి రోజుకావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజలు చేస్తున్న అర్చకస్వామి సుబ్బారావు

మిలీనియం మార్చ్ గోడ పత్రికల ఆవిష్కరణ



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వెలిగండ్ల : ఉద్యోగుల మిలీనియం మార్చ్‌ను జయప్రదం చేయాలని ఏపీసీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గురవయ్య కోరారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో సోమవారం ఏపీసీపీఎస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిలినియం మార్చ్ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో దాస్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఐ. వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు హరి కేశవ, ట్రెజరర్ రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్

హనుమంతునిపాడు : స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులకు సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 3,5,8 తరగతుల విద్యాభ్యాసన స్థాయిని నిర్ణయించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తెలుగు,గణితం, పరిసరాల విజ్ఞానం బోధించే 40 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నాస్ సర్వే జరుగుతుందని, అందులో భాగంగా ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ఎంఈవో పెద్దిరాజు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాలు

పీసీపల్లి : పెద వరిమడుగు పాఠశాల అభివృద్ధి కోసం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు సీహెచ్ గురుబ్రహ్మం రూ.30వేలు, గుంటుపల్లి పాఠశాల హెచ్ఎం గళ్ళా చెన్నయ్య రూ. 10వేలు, బీఆర్ ప్రసాద్‌రెడ్డి రూ. 10వేలు, ఎంఈవో ఎం. నరసింహారావు రూ. 5వేలు విరాళంగా అందజేశారు. ఈ నగదుతో ప్రహరీ నిర్మిస్తామని హెచ్ఎం స్వర్ణ రమణయ్య తెలిపారు. ఎంఈవో నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకురావాలన్నారు. దాతలను ఎంఈవోతోపాటు, గ్రామస్తులు, హెచ్ఎం ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో గౌస్, కొండలరావు, శ్రీనివాసచారి, రాజాల కొండారెడ్డి, కరణం శ్రీను పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజించండి

కనిగిరి టౌన్ : మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని నగర పంచాయతీ చైర్మన్, వైస్‌చైర్మన్ చినమస్తాన్, చిరంజీవి కోరారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రంగుల విగ్రహాలను వినియోగిస్తే పర్యావరణానికి విఘాతం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడు పీర్లమస్తాన్‌వలి, కౌన్సిలర్లు చింతం శ్రీను,సందాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ చినమస్తాన్

ఆల్తాలో వర్క్‌షాపు

కనిగిరి టౌన్ : ఆల్తా డిగ్రీ కాలేజీలో సోమవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రవిబాబు,షేక్ ఫిరోజ్ పాల్గొన్నారు.

పలకల పంపిణీ

కనిగిరి : కొత్తయేరువారిపల్లి పంచాయతీ గంగపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచితంగా పలకలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు కొమటిగుంట్ల వెంకటేశ్వర్లు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసినన ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ యా. నారాయణరెడ్డి మాట్లాడారు. విద్యార్థుల సంక్షేమానికి అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు సేవలను ప్రశంసించారు. మాజీ ఎంఈవో నాగిరెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారం స్ఫూర్తిదాయకం

కనిగిరి టౌన్ : విద్యాభివృద్ధికి దాతల సాయం స్ఫూర్తిదాయకమని డిప్యూటీ డీఈవో జి. సుబ్బరత్నమ్మ అన్నారు. ఎన్.గొల్లపల్లి యూపీ పాఠశాల విద్యార్థులకు బిట్‌కాయిన్ ఇండియా సాఫ్ట్‌వేర్ సర్వీస్ లిమిటెడ్ అధినేత రామకృష్ణారెడ్డి రూ. 16వేలు విలువ గల బూట్లు, టై, బెల్టు, ఐడి కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సంస్థ అధినేత రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వెలిగండ్ల మండలంలో పాఠశాలలను దత్తత తీసుకొని ఈ - లెర్నింగ్ విద్యను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ముక్కు తిరుపతిరెడ్డి, హెచ్ఎం పి. సత్యగోపాల్, ఎంపీటీసీ శ్రీను, సర్పంచ్ నారాయణమ్మ, ఉపాధ్యాయులు రాఘరామయ్య, సుజాత, శ్రీదేవి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సినిమాలు

కనిగిరి

శ్రీనివాస : జయ జానకి నాయక

నారాయణ స్వామి ఆదాయం రూ.84,533లు

సీఎస్‌పురం(పామూరు) : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం ఆదాయం రూ.84,533లు వచ్చినట్లు దేవస్థాన ఈవో కేవీపీ ప్రసాద్ తెలిపారు. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 39,755లు, తీర్థప్రసాదాలకు రూ. 17,450లు, శాశ్విత అన్నదానానికి రూ. 27,368లు రాగా సీఎస్‌పురంకు చెందిన గోను సుబ్బారెడ్డి, అంజమ్మదంపతులు రూ. 5,116లు, పామూరుకు చెందిన అంచూరి వెంకటరెడ్డి, ప్రేమగీతా దంపతులు రూ. 5,116లు, వెలిగండ్ల మండలం కట్టకిందపల్లికి చెందిన దేవెండ్ల నారాయణ, సంధ్య దంపతులు రూ. 5,016ల విరాళాలను అందజేసినట్టు ఈవో తెలిపారు.



గ్యాస్ సిలిండర్లను అందజేసిన ఎంపీపీ ఆవుల తదితరులు

పర్యావరణ పరిరక్షణకు కృషి

పామూరు : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే మధ్యాహ్న భోజనం తయారీకి పాఠశాలలకు గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేస్తోందని ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావుపేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు గ్యాస్ సిలెండర్లను సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీపీ ఆవుల మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తోందన్నారు. ఇకపై గ్యాస్‌పైనే వంటావార్పునిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాల్సి ఉందన్నారు. వైస్‌ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సర్పంచ్ డీవీ మనోహర్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజారహంతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు యూ. హరిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ కురుమేటి బాలసుబ్రహ్మణ్యం,హెచ్ఎం కె. వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీడీఎస్‌ల సమ్మె

పామూరు : కమలేష్ చంద్ర సర్వే రిపోర్టు సిఫార్సులను అమలు చేయాలని, రిపోర్టులోని కీలక అంశాలను ప్రభుత్వాలు తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని గ్రామీణ డాక్ సేవా (జీడీఎస్)ప్రతినిధులు కోరారు. వారు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి ఆరవ రోజుకు చేరింది.ఈ సందర్భంగా స్థానిక పోస్టాఫీసు కార్యాలయంల నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సివిల్స్ సర్వెంట్ హోదా కల్పించాలని, 8 గంటల పనిదినాలను అమలు చేయాలని, లక్షాల పేరుతో టార్గెట్‌ల వేధింపులు విడనాడాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మస్తాన్ వలి, వెంకటరెడ్డి, అబ్దుల్ వాహబ్, ఖాశీంపీరా, వై. విజయలక్ష్మి, ఎస్. రమేష్, శీరీషా పాల్గొన్నారు.

చర్చి సెంటర్‌లో ఘర్షణ

కనిగిరి : చర్చి సెంటర్‌లో సోమవారం సాయంత్రం యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో అక్కడ కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. చెప్పుల బజార్‌నుంచి ఓ వ్యాన్ ఓవి రోడ్డులోకి చేరుకుంది. ఆ సమయంలో అక్కడ ఉన్న యువకుడికి, వాహనంలో ఉన్నవారికి తీవ్ర స్థాయిలో ఘర్షణ చెలరేగింది. ట్రాఫిక్‌లో ఉన్న కానిస్టేబుల్ సైతం ఘర్షణను అదుపుచేయలేక పోవడంతో పరిస్థితి మరింత అదుపు తప్పింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

బిందు సేద్యంతో సత్ఫలితాలు

బత్తాయి, నిమ్మ తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

కనిగిరి : కరువు ప్రాంతాల్లో బిందు సేద్యం సత్ఫలితాలు ఇస్తోంది. వర్షాభావం నెలకొనడంతో పంటల సాగు సమస్యాత్మకంగా తయారైంది. బిందు సేద్యం ద్వారా రైతులు నీటి పొదుపుగా వాడి తోటలను రక్షించుకుంటున్నారు. కనిగిరి లాంటి కరువుప్రాంతాల్లో మెట్టపంటలే ఆధారం కావడంతో ప్రభుత్వం ప్రోత్సాహంతో రైతులు బిందు సేద్యంపై మొగ్గుతున్నారు. కనిగిరి, పీసీపల్లి, పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల, హనుమంతునిపాడు మండలాల్లో బత్తాయి, నిమ్మ, మామిడి, బొప్పాయితోపాటు ఆకుకూర పంటలను బోర్లు ఆధారంగా సాగుచేస్తున్నారు. అయితే వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో బోర్లు చాలావరకూ అడుగంటిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని వినియోగించుకోడానికి చాలామంది బిందు సేద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. బిందు సేద్యం తో నీరు వృధా కాకుండా నేరుగా మొక్కల్లోకి చేరుతుంది. దీంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. కనిగిరి ప్రాంతంలో ఐదు వేల హెక్టార్లలో బత్తాయి, నిమ్మ సాగు చేస్తున్నారు.



ఆశాజనకంగా బత్తాయి దిగుబడులు



బిందు సేద్యంతో బత్తాయి తోటలు

బిందు సేద్యానికి రాయితీ

బిందు సేద్యం చేపట్టేవారికి ఉద్యానవన శాఖ రాయితీలను అందిస్తోంది. ఐదు ఎకరాలున్న సన్నచిన్నకారు రైతులు అందుకు అర్హులు. కాగా, ఐదు ఎకరాల నుంచి 10 ఎకరాలు ఉన్న రైతులకు 75శాతం రాయితీ, 10 నుంచి 12.50 ఎకరాల్లోపు ఉన్నరైతులకు 60శాతం రాయితీ, అంతకంటే ఎక్కువ పొలం ఉన్నరైతులకు 40శాతం రాయితీ ఇస్తారు. లక్షరూపాయాలు విలువ చేసే బిందుసేద్యం పరికరాలను ప్రభుత్వం అందజేస్తోంది.

నిర్లక్ష్యంగా ఉంటే ఇంటికే ..

ఉపాధి సిబ్బందికి ఏపీడీ భాస్కరరావు హెచ్చరిక



రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ భాస్కరరావు

పీసీపల్లి : రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోతే ఇంటికి పంపించాల్సి ఉంటుందని ఉపాధి పథకం సిబ్బందికి ఏపీడీ భాస్కరరావు హెచ్చరించారు. ఉపాధిహామీ పథకం తీరుతెన్నులపై కేంద్ర బృందం మండలాల్లో పర్యటిస్తున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఉపాధి పనుల్లో అక్రమాలు చోటు చేసుకోవడంతో కూలీల వేతనాలను నిలిపివేసినట్లు సమాచారం. కేంద్ర బృందం పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలియటంతో ఏపీడీ సోమవారం ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2016-17, 2017-18 పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో 7 రిజిస్టార్లను సిద్ధం చేయాలని సూచించారు. చేపట్టిన పనులకు, చెల్లించిన బిల్లులకు సంబంధించిన ఫైల్ కనిపించకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు రోజుల్లో రికార్డులు పరిశీలిస్తానని చెప్పారు. క్రమ సంఖ్యలో రికార్డులు లేకపోతే ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానన్నారు. సమావేశంలో ఏపీవో అబ్దుల్లా, టీఏలు శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా మరుగుదొడ్ల నిర్మాణం

సమీక్షా సమావేశంలో ఎంపీపీ బలరాంరెడ్డి

హనుమంతునిపాడు : మండలంలోని 23 పంచాయతీల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీపీ గాయం బలరాంరెడ్డి ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మరుగుదొడ్ల నిర్మాణం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2700ల మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 1400 మరుగుదొడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్టు చెప్పారు. మిగతా మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరితంగా పూర్తిచేయాలని అందుకు నోడల్ అధికారులు, ఆర్‌డబ్ల్యూస్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశానికి ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ యల్లయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో గురువరకుమార్, ఎంఈవో పెద్దిరాజు, ఏవో టి. శిల్ప, డీఆర్‌డీఏ ఏపీఎం సాగర్, స్వచ్ఛభారత్ సూపర్‌వైజర్ జి. వెంకటరెడ్డి, మండల కోఆర్డినేటర్ నర్సారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, పాల్గొన్నారు.

పింఛన్ కోసం ప్రదక్షిణలు

నిలిచిన దానిని పునరుద్ధరించాలని 70 ఏళ్ల వృద్ధుడు వినతి

పీసీపల్లి : ఏడుపదుల వయస్సు దాటినా పింఛన్ ఇవ్వడం లేదని ఓ వృద్ధుడు కనిపించిన అధికారుల ఎదుట వాపోతున్నాడు. ప్రభుత్వాలు మారినా వ్యవస్థ మారలేదనే ధ్వజమెత్తుతున్నాడు. మారెళ్ళకు చెందిన ఏనుగంటి మాలకొండయ్య పింఛన్ కోసం ఎంపీడీవో కార్యాలయం చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నాడు. రూ. 200ల పింఛన్ సమయంలో పింఛన్ అందుకున్న ఈ వృద్ధుడు పింఛన్ మొత్తాన్ని రూ. 1000లకు పెంచిన తరువాత నిలుపుదల చేశారు. అందుకు సాంకేతిక కారణాలు చూపిస్తున్నారు. మూడేళ్ళ నుంచి పింఛన్ కోసం తిరుగుతున్న అధికారులు పట్టించుకోపోవడంతో కన్నీటి పర్యంత మవుతున్నాడు. దీనిపై ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా జన్మభూమి కమిటీ సభ్యులు సంతకాలు చేయక పోవడంతో పింఛన్ పొందే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఏదిఏమైనా మాలకొండయ్య లాంటి వృద్ధుడికి పింఛన్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉంది.



పింఛన్ కోసం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌ను వేడుకుంటున్న వృద్ధుడు

రేపు లబ్ధిదారుల ఎంపిక

పీసీపల్లి : ఉపాధి పథకం రుణాలకు సంబంధించి ఈనెల 23న లబ్ధిదారుల ఎంపికను చేపట్టనున్నట్లు ఎంపీడీవో డి. సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న కాపు, మైనార్టీ, బలిజ, ఒంటరి, ఎస్సీ వర్గాలకు చెందిన వారు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివిధ బ్యాంకుల మేనేజర్లు, రుణ కమిటీ సభ్యులు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలను నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఈనెల 28న ఎస్సీ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్వ్యూల విధివిధానాలను బ్యాంకు మేనేజర్లకు, రుణ కమిటీ సభ్యులకు ఎంపీడీవో సోమవారం అవగాహన కల్పించారు.



బ్యాంకర్లతో చర్చిస్తున్న ఎంపీడీవో

అన్ని పాఠశాలలకు గ్యాస్‌కనెక్షన్ల అందజేత

ఇంకొల్లు : మండలంలోని మధ్యాహ్నభోజనపథకానికి సంబంధించి 31 పాఠశాలలకు గ్యాస్ పంపిణీ సోమవారం పూర్తి చేసినట్లు ఎంఈఓ జయరాజు తెలిపారు. కుకింగ్ ఏజెన్సీలు అందరూ తప్పనిసరిగా గ్యాస్‌పైనే వంట చేయాలని సూచించారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్యాస్‌పంపిణీ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకట్రావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపారాణి, యార్లు మాజీచైర్మన్ మద్దినేని హనుమంతరావు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు పక్కన సైడు కాల్వలు

నిర్మాణానికి కొలతలు తీస్తున్న హైవే అధికారులు

మార్టూరు: మార్టూరులో సర్వీసు రోడ్డు పక్కన సైడు కాల్వలు నిర్మాణం చేపట్టడానికి హైవే అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం సెంటర్‌లో ఉన్న ఫ్లై ఓవర్‌కు పడమర వైపు స్వప్న హోటల్ ముందు ఉన్న సర్వీసు రోడ్డులో హైవే సిబ్బంది రోడ్డు కొలతలు వేశారు. మండల కాంప్లెక్సు వద్ద ఉన్న బ్రిడ్జి నుంచి ప్రభుత్వ ఆసుపత్రి, అంబేద్కర్ వరకు కొలతలు వేశారు. హైవే గోడ నుంచి 103 మీటర్లు వరకు మార్కింగ్ ఇచ్చారు. అంటే ప్రస్తుతం ఉన్న పరిస్థితిని పరిశీలిస్తే నాగరాజుపల్లి సెంటర్ పంచాయతీ రాజ్ గెస్ట్‌హౌస్ సమీపంలో సర్వీసు రోడ్డు పక్కన సైడ్ కాల్వల



సర్వీస్ రోడ్డు పక్కన కొలతలు వేస్తున్న అధికారులు

నిర్మాణం చేపడితే కొంతమంది ఇళ్ల వరండాలు పడగొట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా నాగరాజుపల్లి సెంటర్ నుంచి స్వప్న హోటల్ వరకు సర్వీసు రోడ్డుపై మురుగు నీరు పారడానికి గుంతలు ఏర్పాటు చేశారు. పక్కనే సంపత్‌నగర్ వాసుల ఇళ్ల నుంచి మురుగునీరు వెళ్లడానికి మార్గం లేక సర్వీసు రోడ్డుపైకి నీటిని వదులుతున్నారు. ఈ విషయమై కాలనీ వాసులు పలుసార్లు హైవే అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఫ్లై ఓవర్‌కు ఇరు వైపులా సర్వీసు రోడ్డు పక్కన సైడు కాల్వలు నిర్మాణం చేయడానికి హైవే అధికారులు కొలతలు వేస్తున్నారు.

త్వరితంగా సైడు కాల్వలు నిర్మిస్తాం

-ఎ. వెంకటేశ్వరరావు, హైవే ప్రాజెక్టు డైరెక్టర్

వీలైనంత వేగంగా మార్టూరులో సర్వీసు రోడ్డు పక్కన సైడు కాల్వలు నిర్మిస్తాం. మొదట నాగరాజుపల్లి సెంటర్ సమీపంలో సైడు కాల్వలు నిర్మిస్తాం. ఇక్కడ వాసులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న అధికారులు

విద్యుత్‌కు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు

పర్చూరు: ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని డీఈ రామకృష్ణ అన్నారు. పర్చూరులోని స్థానిక సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆయన చీరాల పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్లలో అంతరాయం ఏర్పడినపుడు మరమ్మతులు చేయించటానికి ఒంగోలు, ముప్పవరంలో వెళ్లాల్సి ఉండటంతో విద్యుత్ సరఫరాలో జాప్యం జరిగి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పర్చూరులో కూడా త్వరలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఏడీఈ పీ.వీ. భాస్కర్ మాట్లాడుతూ గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్యను అధిగమించటానికి ఇప్పటికే పలు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈకార్యక్రమంలో చీరాల, పర్చూరు పరిధిలోని విద్యుత్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేడియో పాఠాలు శ్రద్ధగా వినాలి

పర్చూరు: రేడియో పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి దామా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక నెహ్రూ నగర్‌లోని ఎం పీపీ పాఠశాలలో సోమవారం రేడియో కార్యక్రమాలను విద్యార్థులకు వినిపించే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి రేడియో ప్రసార కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని అన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా శ్రావణ సోమవారం

పర్చూరు: మండలంలోని పలుగ్రామాల్లో శ్రావణ సోమవారం సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణమాసం, సోమవారం, అమావాస్య, సూర్యగ్రహణం నాలుగు ఒకేరోజు రావటంతో శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆయా గ్రామాల్లోని శివాలయాలతో పాటు, అమ్మవారి ఆలయాల్లో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

చినగంజాం : మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం సోమవతి అమావాస్యని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయంలో, స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నగరేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేకపూజలను భక్తులు నిర్వహించారు.

ఇసుకదర్శిని పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్

మార్టూరు: మండలంలోని ఇసుకదర్శి గ్రామాన్ని సోమవారం పర్చూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ పరిశీలించారు. 15 రోజులలో గ్రామంలోని



రోడ్డు పక్కన సైడ్ కాల్వలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్

కొంతమంది అనారోగ్య కారణంగా జ్వరాలకు గురయ్యారు. ఒక వివాహిత కూడా మృతి చెందింది. దీంతో గ్రామంలోని పరిస్థితిని పరిశీలించడానికి రాజశేఖర్ వచ్చారు. గ్రామంలో మురుగు కాల్వల్లో నీరు నిలబడి ఉండటం, పరిశుభ్రమైన వాతావరణం కనిపించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజులలో మురుగునీరు సక్రమంగా బయటకు వెళ్లే విధంగా పని చేయాలని గ్రామ సర్పంచ్‌ను ఆదేశించారు. అదే విధంగా మండలంలో మంజూరైన 140 మరుగుదొడ్లు నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రసూల్‌ను స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు ఆయన వెంట ఎంపీడీవో బి. శింగయ్య, వైద్యాధికారి భానుప్రకాష్ హెల్త్ సూపర్ వైజరు ఆంజనేయరావు, జొన్నలగడ్డ యెహోషువా, హెల్త్ అసిస్టెంట్ సింగారెడ్డి తదితరులు ఉన్నారు.

అర్హులు నిర్ణీత తేదీలలో హాజరుకావాలి

కారంచేడు(చీరాల) : మండల పరిధిలో వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు అర్హత సాధించిన లబ్ధిదారులు నిర్ణీత తేదీలలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీఓ ఉమ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం బ్యాంకు ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప ర్చూరు ఏఎంసీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్యచౌదరి, బ్యాంకుల ప్రతినిధులు, కార్యాలయ అధికారులు, సిబ్బం ది పాల్గొన్నారు.

23 నుంచి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చినగంజాం : బీసీ, మైనార్టీ, కాపు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా మండలానికి 210యూనిట్లు మంజూరు అయినట్లు ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ సోమవారం తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో 23వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఎస్టీ, మైనార్టీలకు, 24వ తేదీ ఉదయం 10గంటలకు బీసీ, కాపులకు, 28వ తేదీ ఉదయం ఎస్సీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు తమ రేషన్, ఆధార్, బ్యాంకు అకౌంట్‌లతో కులధ్రువీకరణపత్రాలను వెంట తెచ్చుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్

చినగంజాం : స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం జరిగిన టెలీకాన్ఫరెన్స్‌కు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎస్.సీ.ఆర్.టీ డైరక్టర్ రాజ్యలక్ష్మి, రిసోర్స్‌పర్సన్‌లు రమేష్ తెలుగు, లెక్కలు, పరిసరాల విజ్ఞానంపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

విద్యార్థులకు అనుగుణంగా విద్యను బోధించాలి

యద్దనపూడి : విద్యార్థులకు అనుగుణంగా విద్యను బోధించాలని రాష్ట్ర విద్యాపరిశోధనశిక్షణ సంస్థ డైరక్టర్ రాజ్యలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పిల్లలకు అర్థమయ్యేరీతిలో విద్యాబోధన చేయాలన్నారు.

మీకోసంలో ఐదు అర్జీలు

చినగంజాం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి ఐదు అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె.హరిబాబు తెలిపారు. రేషన్‌కార్డుల కోసం రెండు, అడంగల్‌లో మార్పులు, చేర్పులకు మూడు అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

శివాలయాల్లో భక్తులు సందడి

మార్టూరు: సోమవారం మార్టూరులో శివాలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు చేయించారు. శ్రావణ మాసంలో సోమవారం, అమావస్య, సూర్య గ్రహణం అన్ని ఒ కే రోజు రావడంతో శుభసూచకమని భక్తులు ప్రత్యేకంగా స్వామివారిని దర్శించుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి శారదా విద్యార్థి ఎంపిక



అనిల్‌కుమార్

పర్చూరు: ట్రిపుల్ ఐటీకి శారదా విద్యార్థి తియ్యగూర అనిల్‌కుమార్ రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ క్రిష్టంశెట్టి రామకోటేశ్వరరావు సోమవారం తెలిపారు. 2016-17 విద్యాసంవత్సరానికి గాను పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించటంతో ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని వివరించారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థిని ప్రత్యేకంగా సత్కరించారు.

నేడు 'పొలం పిలుస్తోంది'

చినగంజాం : మండలంలోని చింతగుంపల్లి, రాజుబంగారుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎన్. మేరమ్మ సోమవారం తెలిపారు. మంగళవారం చింతగుంపల్లి, రాజుబంగారుపాలెం, బుధవారం సంతరావూరు, గొనసపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

1న చలో విజయవాడ

యద్దనపూడి : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న విజయవాడలో జరగనున్న మిలీనియం మార్చ్, మహాసభకు తరలివచ్చి జయప్రదం చేయాలని ఎన్.మార్క్ కోరారు. సోమవారం యద్దనపూడిలో ఎంఈఓ సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షతన చలో విజయవాడ గోడపత్రికను ఆవిష్కరించారు.

రేపు రోటరీ అధ్వర్యంలో కుటుంబ సమ్మేళనం

పర్చూరు: పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 23న స్థానిక బీవీఆర్ రోటరీ భవనంలో కుటుంబ సమ్మేళనం బుధవారం సాయంత్రం 7గంటలకు జరుగుతుందని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు పోలిశెట్టి చంద్రశేఖరరావు, పాబోలు వెంకన్న సోమవారం తెలిపారు.

ఆంధ్రజ్యోతి
4
సంతనూతలపాడు
ప్రకాశం • మంగళవారం 22 ఆగస్టు 2017
। సంతనూతలపాడు । మద్దిపాడు । నాగులుప్పలపాడు । చీమకుర్తి

వ్యవసాయ మోటార్ల ఉచిత మార్పిడి

చీమకుర్తి : మండల పరిధిలో వ్యవసాయానికి సంబంధించి మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్ల స్థానంలో కొత్త మోటార్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దాసరి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి చీమకుర్తి సబ్ స్టేషన్ ఆవరణలో ఈఎస్ఎల్ సంస్థ వీటిని అందజేస్తుందన్నారు. రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పట్టణంలో పందుల స్వైర విహారం

భయభ్రాంతులకు గురవుతున్న జనం
దూరప్రాంతాలకు తరలింపులో
పాలకవర్గ తాత్సారం

చీమకుర్తి : గెలాక్సీ పురిగా ప్రసిద్ధిగాంచిన చీమకుర్తి పట్టణంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధాన రహదారులపై ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. దీంతో నెల్లూరు జిల్లా కావలి మున్సిపాలిటీలో శుక్రవారం ఓ వృద్ధ మహిళపై పందుల దాడి ఘటనను ఊహించుకుని ప్రజలు భయపడిపోతున్నారు.

పందులను పట్టణం నుంచి దూరంగా తరలించాలని నగర పంచాయతీ పాలకవర్గం రెండేళ్లుగా విఫలయత్నం చేస్తోంది. గత ఏడాది ప్రజలు పదేపదే చేసిన విజ్ఞప్తి మేరకు పట్టణంలో రహదారులపై తిరుగుతున్న పందులను ప్రత్యేక వ్యక్తులను పిలిపించి పట్టుకున్నారు. వాటిని అటవీప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నించగా పందుల పెంపకందారుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించడంతో అధికారులను ఆ పందులను విడిచిపెట్టారు. మూడు నెలల క్రితం ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు మండలస్థాయి అధికారులతో కూడిన కమిటీ పందుల పెంపకం దారులతో సమావేశం నిర్వహించింది. పందులను పట్టణానికి దూరంగా తరలించాలని తహసీల్దార్, ఎస్సై, ఎంపీడీవో, కమిషనర్, చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో కూడిన కమిటీ హుకుం జారీ చేసింది. తమకు ప్రత్యేక స్థలం, సదుపాయాలు కల్పిస్తే అందుకు తాము సిద్ధమని పెంపకందారులు స్పష్టం చేశారు. అనంతరం ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో పట్టణంలో పందుల సమస్య అధికమైంది. ప్రధాన సెంటర్లలో పందుల సంఖ్యలతో దర్శనమిస్తున్నాయి. కావలి ఘటన నేప థ్యంలోనైనా అధికారులు స్పందించి పందులను పట్టణానికి దూరంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.



చీమకుర్తి నగర పంచాయతీ కార్యాలయం ముందే సంచరిస్తున్న పందులు



వసతులు కల్పించాలి

పందుల పెంపకమే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నాం. మాకు స్థలం, ఇతర వసతులు కల్పించాలి. అందుకు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయించడం తోపాటు, రుణ సౌకర్యం కల్పిస్తే పందులను పట్టణానికి దూరంగా తరలిస్తాం.

పేరం శ్రీను, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకుడు



త్వరలో తరలిస్తాం

పందులను పట్టణానికి దూరంగా తరలించాలని పెంపకందారులను ఇప్పటికే ఆదేశించాం. వారికి ఇచ్చిన గడువు కూడా పూర్తయింది. వెంటనే చర్యలు తీసుకుంటాం.

రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

నాగులుప్పలపాడు : ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుబ్బారావు తెలిపారు. సోమవారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శిలార్, ఏఈ చలమయ్యలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. గృహ లబ్ధిదారులందరికీ త్వరితగతిన పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామాల వారీ నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు.

వినోదరాయునిపాలెంలో అభివృద్ధి పనుల పరిశీలన

వినోదరాయునిపాలెం (నాగులుప్పలపాడు) : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు ప్రకాశం పంతులు జన్మస్థలమైన వినోదరాయునిపాలెంను సోమవారం ఎంపీపీ ముప్పరపు వీరయ్య చౌదరి, ఎంపీడీవో ఎస్.ఎం. శిలార్, తహసీల్దార్ సుజాత సందర్శించారు. హైస్కూల్ ఆవరణలో జరిగే ప్రకాశం కాంస్య విగ్రహ నిర్మాణ దిమ్మె, సిమెంటురోడ్డు, ప్రహరీగోడ పనులను, జయంతి ఉత్సవాల నిర్వహణకు సిద్ధం చేస్తున్న గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీరయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర పండుగగా జరిగే ప్రకాశం జయంతి ఉత్సవాల్లో గ్రామస్థులంతా పాల్గొనాలని కోరారు.

24, 28 తేదీల్లో రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

నాగులుప్పలపాడు : ఎస్సీ, ఎస్టీ, బీసీ కాపు, ముస్లిం, క్రిస్టియన్, మైనారిటీ కార్పొరేషన్‌ల ద్వారా 2017-18లో రుణాల కోసం దరఖాస్తు చేస్తున్న వారికి ఈనెల 24, 28 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శిలార్ ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఎస్సీ, ఎస్టీలకు, 28 ఇతర వర్గాల వారికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. బ్యాంకర్లు, రుణ ఎంపిక కమిటీ సభ్యులు హాజరవుతారన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు తదితరులు

మార్కెట్‌లో గదులు కేటాయించాలని వినతి

చీమకుర్తి : నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌లోని కొన్ని గదులను గిరిజనులకు కేటాయించాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు కమిషనర్ ఆదినారాయణను కోరారు. ఈమేరకు సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎరుకలు, చెంచు కుటుంబాలు పట్టణంలో దాదాపు 800 ఉన్నాయని, వారికి సరైన జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కెట్‌లో కొన్ని గదులు కేటాయించడం ద్వారా ఉపాధి లభిస్తుందని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ దుర్గారావు, నగయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బోరు తవ్వకం పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ రాఘవరావు

17వ వార్డులో బోరు తవ్వకం ప్రారంభం

చీమకుర్తి: నగర పంచాయతీ పరిధిలోని 17వ వార్డులో పవర్ బోర్ తవ్వకం పనులను సోమవారం చైర్మన్ కొత్తపు రాఘవరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కందిమళ్ల గంగాధరరావు, కౌన్సిలర్లు షేక్ షమీమ్, ఎస్.కె. మోమిన్, రఫీ, ఖాజీ, లింగా హనుమంత రావు, శ్రీను, కుమారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా నగదు అందజేత

చీమకుర్తి : పట్టణ పరిధిలో కరెంటు షాక్‌కు గురై రెండు రోజుల క్రితం మృతి చెందిన బెల్లం శ్రీనివాసరావుకు చంద్రన్న బీమా పథకం కింద రూ. 5 లక్షలు మంజూరైంది. ఇందులో తొలి విడత మట్టి ఖర్చుల కింద రూ. 8వేలను శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీ అధ్యక్షుడు రామినేని యోగయ్య, మెప్మా సిబ్బంది చిరంజీవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు. 15వ వార్డు పరిధిలో ఇటీవల మృతి చెందిన వెల్లపు పోలమ్మ కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల కింద రూ. 5వేల అందజేశారు. త్వరలో మరో రూ. 25వేలు ఇవ్వనున్నట్లు మెప్మా సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి ఎస్. ఆంజనేయులు, ఉప్పుతోలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రన్న బీమా నగదును అందజేస్తున్న టీడీపీ నాయకులు

కార్పొరేట్ కంపెనీలకు పాలకుల గులాం

చీమకుర్తి : కేంద్రం, రాష్ట్రంలోని పాలకులు కార్పొరేట్ కంపెనీలకు గులాం చేస్తున్నారని సీపీఎం నాయకుడు కాలం సుబ్బారావు విమర్శించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై ఈనెల 22, 23 తేదీల్లో ప్రచార కార్యక్రమం చేపట్టాలని తీర్మానించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, నెరుసుల వెంకటేశ్వర్లు, పి. ఆంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, కొల్లారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చీమకుర్తిలో మెప్మా బజార్

చీమకుర్తి : పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో సోమవారం మెప్మా బజార్ నిర్వహించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను విక్రయానికి ఉంచారు. నెలకు ఒకసారి ఈ బజార్‌ను నిర్వహించనున్నట్లు మెప్మా సిబ్బంది తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బాణ సంచా కాల్చి ఆనందం వ్యక్తం చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు ప్రకటనపై హర్షం

చీమకుర్తి: రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల ఆర్యవైశ్య సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బాణ సంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇందుకోసం కృషి చేసిన మంత్రి శిద్దా రాఘవరావు, టి.జి. వెంకటేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శిద్దా సుధాకర్, అద్దేపల్లి శ్రీనివాసరావు, కాలపర్తి మురళి, నూకల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

నాగులుప్పలపాడు : శ్రావణ అమావాస్య, సోమవారం ఒకేసారి రావడంతో నాగులుప్పలపాడు మండలంలోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. చదలవాడలోని లింగోద్భవ ఆలయం, నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరు, కనపర్తిలోని ఏలేశ్వరస్వామి ఆలయం, అమ్మనబ్రోలులోని చెన్నమల్లేశ్వర స్వామి ఆలయాల్లో శివ లింగాలకు పాలాభిషేకాలు చేశారు.

వంద మంది చిన్నారులకు ఎంఆర్ టీకాలు

తిమ్మసముద్రం (నాగులుప్పలపాడు) : మండలంలోని తిమ్మసముద్రంలో వైద్య సిబ్బంది సోమవారం ఎంఆర్ వ్యాక్సిన్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మందికి టీకాలు వేశారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎం. నాగేశ్వరరావు ఈ టీకా వలన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ప్రసాద్, మాధవి, మార్తమ్మ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలం కబ్జా

- హెచ్చరిక బోర్డు తొలగింపు
- 3 ఎకరాల్లో 30 సెంట్లు కూడా లేని వైనం

ఎర్రగొండపాలెం రూరల్: మార్కాపురం పట్టణంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు ముందుజాగ్రత్తగా ఇది ప్రభుత్వ భూమి దీనిని ఆక్రమించిన వారు శిక్షార్హులు అంటూ ఉంచిన బోర్డులు కూడా పీకివేసి మరీ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పట్టణ పరిధిలోని రాయవరం సమీపంలో హైవేను ఆనుకుని ఉన్న మున్సిపల్‌శాఖ భూమి ఆక్రమణలకు గురైందని అందిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లి పరిశీలిస్తే గతంలో అక్కడ పాతిన బోర్డును పీకి పక్కన పడవేసి కనిపించింది. దానిపై స్థలం వివరాలు కనిపించాయి.



స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

పురపాలక శాఖకు చెందిన ఈ భూమిని పరిశీలిస్తే 1011/6 సర్వే నెంబరులో 2.88 ఎకరాలుగా నమోదై ఉంది. అక్కడ ఆ భూమి కనిపించటం లేదు. పక్కనే చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్ కనిపించింది. ఇది తమకు పట్టాగా ఉన్న భూమి అని సదరు వ్యక్తులు తెలిపారు. మరోవైపు ఉన్న భూమి కూడా ఇతరుల స్వాధీనంలో ఉండి కంచెవేసి కనిపించింది. ఇంకో వైపు హైవే వెళ్లింది. మరి 2.88 ఎకరాల భూమి ఎక్కడ అని పరిశీలిస్తే కేవలం 30 సెంట్ల భూమి అక్కడ మిగిలి ఉంది. కొంత హైవే రోడ్డు నిర్మాణంలో పోయి ఉంటుందని కొందరు చెబుతున్నారు.

అయితే, ఈ భూమిని పట్టణానికి చెందిన ప్రముఖ వ్యక్తి అధికారపార్టీ నాయకుని మౌఖిక ఆదేశాలతో స్వాధీనం చేసుకుని చదును చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. అధికారులు ప్రభుత్వ స్థలాలలో బోర్డులు పెట్టి చేతులు దులుపుకోవటం తప్ప శ్రద్ధ పెట్టి వాటిని జాగ్రత్త చేయటం లేదు. కనీసం హద్దులు పెట్టి ఇది ప్రభుత్వ భూమి అని ఉంచలేకపోతున్నారు. దీనిని ఆసరా చేసుకుని అక్రమార్కులు వాటిని కబ్జా చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ స్థలాలపై అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేరు.



ప్రభుత్వ స్థలం అంటూ ఉంచిన బోర్డు ఇది (ప్రస్తుతం పీకివేశారు)

దేవాలయాల్లో దొంగల వేట

- నిధులకోసం ఆలయాల విధ్వంసం
- హుండీలపై కూడా కన్ను

ఎర్రగొండపాలెం రూరల్: దేవాలయాల్లో దొంగల వేట కొనసాగుతోంది. గుప్తనిధులు ఉన్నాయంటూ తవ్వకాలు జరిపే ముఠాలు కొందరైతే, గుడిలోని హుండీలో ఉన్న వస్తువులు కాజేసేందుకు కన్నమేసేవారు మరికొందరు. ఏదైతేనేమి ఇటీవల జిల్లాలోని పలు సంఘటనలు దేవాలయాలకు కరువైన భద్రతను రుజువు చేస్తున్నాయి. ఆదివారం జిల్లాలోని కొమరోలు గుడిలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. అక్కడ ఉన్న సీసీ కెమెరాను కూడా ధ్వంసం చేసి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇటీవల ఎర్రగొండపాలెం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మిల్లంపల్లి దేవాలయంలో దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన విషయం బయటపడింది. దేవాలయాల్లో చిల్లర దొంగలు కూడా వారిపని వారు చేసుకుపోతున్నారు. జూన్ 6న శింగరకొండ దేవాలయంలో స్వామి దర్శనంకోసం క్యూలైన్లో ఉన్న వ్యక్తులే భక్తుల వద్ద ఉన్న వస్తువుల చోరీకి ప్రయత్నించటం వారిని కొందరు పట్టుకుని పోలీసులకు అప్పగించటం జరిగింది.



పదేపదే తవ్వకాలు జరుపుతున్న మిల్లంపల్లి దేవాలయం

పశ్చిమ ప్రాంతంలో అధికం..

ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో దేవాలయాల్లో దొంగల తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది. కంభం పట్టణానికి దగ్గరలో గుండ్లకమ్మ ఒడ్డున ఉన్న పురాతన దేవాలయం కాశీవిశ్వేశ్వర కోటేశ్వరస్వామి దేవాలయంలో ఈ ఏడాది జూన్ 22న గుప్తనిధులకోసం తవ్వకాలు జరిపారు. నిధుల వేట సమయంలో దొంగలు కూడా శాస్త్రోక్తంగా పూజలు కూడా నిర్వహిస్తారు. ఇక్కడ కూడా దొంగలు ముందుగా నాగదేవతకు ప్రత్యేక పూజలు చేసి తలుపులు పగలగొట్టి తవ్వకాలకు ప్రయత్నం చేసినట్లు గుర్తించారు. నెలరోజుల వ్యవధిలోనే సంతనూతలపాడు మండలం చిలకపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో దొంగలు గేట్లు తీసుకుని ఆభరణాలను అపహరించుకుపోయారు. గతనెలలో ఎర్రగొండపాలెం సమీపంలోని మిల్లంపల్లి దేవాలయంలో నిధులకోసం తవ్వకాలు జరిపారు. దాదాపు గతంలో తవ్విన చోటే తవ్వకాలకు పాల్పడినట్లు గుర్తించిన ఆలయకమిటీ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పరిశీలించిన పోలీసులు ఒకేచోట అదే దేవాలయంలో పదేపదే తవ్వకాలు జరుగుతున్న తీరునుబట్టి ఒకే ముఠా పని అయి ఉంటుందా అనే దిశగా కూడా దర్యాప్తు జరుపుతున్నారు. ఇప్పటికి పలుమార్లు ఇదే దేవాలయంలో తవ్వకాలు జరిగాయి. గత ఏడాది మార్చినెలలో ఇదే ఆలయంలో తవ్వకాలకు పాల్పడిన ముఠా సభ్యులు గుడిలోని స్వామివారి మూలవిరాట్‌ను ధ్వంసం చేశారు. 2013లో ఇక్కడ జరిపిన తవ్వకాల సమయంలో ప్రజలు పసిగట్టి వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఇదేరీతిలో పుల్లలచెరువు మండలం ఐటివరం గ్రామం పరిధిలో 2012 మార్చి 16న కొందరు దొంగలు వేణుగోపాలస్వామి ఆలయం వద్దకు చేరారు. తవ్వకాలకు ముందుగా పూజలు నిర్వహించేందుకు పూజా సామగ్రితోపాటు పూజారిని కూడా వారివెంట తెచ్చుకున్నారు. పూజకు సిద్ధం చేస్తున్న సమయంలో పొలాలకు వెళ్లి వస్తున్న కొందరు ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనించి వారి విషయాన్ని గ్రామంలో తెలియజేశారు. వెంటనే గ్రామస్తులు అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకోవటంతోపాటు వారు వచ్చిన తుఫాన్ వాహనాన్ని నిప్పుపెట్టి తగులపెట్టారు. పోలీసులు వచ్చేవరకు ప్రజలు కాపలాఉండి వారిని పోలీసులకు అప్పగించారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో తవ్వకాలు

ఎర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం చెన్నకేశవస్వామి దేవాలయంలో కూడా ఇప్పటికి రెండుసార్లు తవ్వకాలు జరిపారు. కొప్పుకొండ వద్ద ఉన్న ఆలయంలో కూడా విగ్రహాలను పెకిలించి చూసి నిధులకోసం దొంగలు ప్రయత్నాలు చేశారు. త్రిపురాంతకం దేవాలయ ప్రాంగణంలో కూడా లెక్కలేనన్నిసార్లు గుప్తనిధులకోసం దుండగులు తవ్వకాలు జరిపారు. అక్కడ ఉన్న పెద్ద రాతి నంది విగ్రహాన్ని రెండుగా పగులగొట్టి అందులో నిధులున్నాయంటూ పరిశీలించారు. జంగంవారిసత్రం వద్ద ఉన్న పంచలింగాల ఆలయంలోకూడా పెద్ద శివలింగాన్ని దుండగులు పెకిలించి వేశారు. ఇలా ఎన్నో సంఘటనలు పశ్చిమ ప్రాంత ఆలయాల్లో చోటుచేసుకుంటున్నాయి. సంఘటనలు జరిగినప్పుడు ఆలయాల వద్దకు ఆలయ అధికారులు వచ్చి చూడటం తప్ప ఆలయాల భద్రతకు చర్యలు తీసుకొనేందుకు ఎటువంటి ప్రణాళికలు చేయటం లేదు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుని చారిత్రక సంపద దొంగల చర్యల వల్ల పాడుకాకుండా కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

గ్రీవెన్స్‌సెల్ అర్జీలను పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్: గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సీపీవో సమావేశపు హాలులో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం పలు రకాల సమస్యలను విన్నవించారు. గ్రీవెన్స్‌సెల్‌లో డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.మురళీ, సీపీవో కేటీ. వెంకయ్య, ఎస్‌డీసీ ఉదయభాస్కర్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ నాగలక్ష్మి

- ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని త్రిపురాంతకం మండలం పాత అన్నసముద్రం గ్రామానికి చెందిన కూలీలు విన్నవించారు.
- కరువుతో ప్రభుత్వం మంజూరు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ అక్రమాలపై విచారణ చేసి అర్హులైన వారికి న్యాయం చేసే విధంగా చూడాలని కొరిశపాడు మండలం రావినూతల గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వర్లు, చెంచు రామయ్య, సుబ్బారావు తదితరులు ఫిర్యాదు చేశారు.
- కర్నూలు రోడ్డులోని విరాట్‌నగర్‌లో మద్యం షాపును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని దీనిని నిలుపుదల చేయాలని ఆ కాలనీ మహిళలు, ప్రజానీకం కోరారు.
- డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక యానిమేటర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని జె.పంగులూరు మండలం చందలూరు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారు.
- ఉలవపాడు మండలం కరేడు గ్రామం జాతీయ రహదారిని కలుపుచోట ప్రజల అవసరాల కోసం ఫ్లైఓవర్‌ను నిర్మించే విధంగా చూడాలని కరేడు గ్రామ ప్రజానీకం కోరారు.
- కొన్నేళ్ల నుంచి తీసుకుంటున్న వృద్ధాప్య పెన్షన్‌ను నిలుపుదల చేశారని, తిరిగి పునరుద్ధరించే విధంగా చూడాలని నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరు గ్రామానికి చెందిన వృద్ధులు కోరారు.
- వ్యవసాయ భూమిని సర్వే చేసి ఇవ్వాలని, చలానా కట్టినా సర్వే చేయడం లేదని పొదిలి మండలం కంభాలపాడుకు చెందిన పి.శ్రీను ఫిర్యాదు చేశారు.
- తాగునీటి బావి ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని టంగుటూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన ఎస్.కె.మీరావలి ఫిర్యాదు చేశారు. గ్రామానికి ఉపయోగపడే తాగునీటి బావికి తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని నిలుపుదల చేసే విధంగా చూడాలని కోరారు.
- కందుకూరులోని ఓ బ్యాంకులో పొలం పత్రాలు పెట్టి బ్యాంకు రుణం తీసుకున్నానని, ఆ రుణం తిరిగి చెల్లించిన తర్వాత కూడా భూమి పత్రాలు ఇవ్వడం లేదని గడ్డంవారి కోష్టాలుకు చెందిన కె.వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో తీసుకున్న అప్పు చెల్లింపు కాగితాలను కూడా జేసీకి అందజేశారు.
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యూనిట్ మంజూరుచేసి ఆదుకోవాలని కురిచేడు మండలం పి.నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఎం. బాలరంగయ్య కోరారు. రుణం కోసం దరఖాస్తు చేసుకున్నానని, న్యాయం చేసి ఆదుకోవాలని విన్నవించారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలను అమలుచేయాలి

ఒంగోలు కలెక్టరేట్: ప్రభుత్వం నిర్ణయించిన ఒప్పందం ప్రకారం సుబాబుల్, జామాయిల్, సరుగుడు కర్ర కొనుగోళ్ళు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి సమస్యను వివరించారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలు అమలు జరగకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.



జేసీ నాగలక్ష్మితో మాట్లాడుతున్న రైతు సంఘాల నేతలు

వెబ్‌లాండ్, ఈ క్రాప్ బుకింగ్ కేవలం కాగితలే పరిమితమైందని జేసీకి ఫిర్యాదు చేశారు. చట్ట ఉల్లంఘనలతో దళారులు, పేపరు మిల్లుల అక్రమ వ్యాపారం కారణంగా రైతాంగం దోపిడీకి గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రయోజనాలను దెబ్బతీసే 143జీవోలోని 4 పాయింట్‌లోని(జె)క్లాజును తొలగించి ఈ జీవో ఆధారంగా జిల్లాలో ప్రకటించిన ఒప్పందంలో జామాయిల్ కర్రకు తాట తీసి సరఫరా చేయాలనే నిబంధనలను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారానే కొనుగోళ్ళు చేయడంతో పాటు పాత పద్ధతిలోనే రివాల్వింగ్ ఫండ్‌ను మార్కెట్ కమిటీలకు ఇవ్వాలని మార్కెట్ ఇంటలిజెన్స్ ఆధారంగా రైతు ఉత్పత్తి ఖర్చులను పరిగణలోకి తీసుకొని పారదర్శకంగా ధరల నిర్ణయం జరిపించాలని, అమలులో ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు, ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డె హనుమారెడ్డి, వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, వర్జీనియా పొగాకు రైతు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మారెళ్ళ బంగారుబాబు, టీవీ.శేషయ్య, జి. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుసత్యాగ్రహ స్థూపాన్ని పరిశీలించిన ఈవోఆర్‌డీ

ఒంగోలు రూరల్ : ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామపరిధిలోని ఉప్పుసత్యాగ్రహ స్థూపాన్ని ఈఓఆర్‌డీ ఎ. బాలచెన్నయ్య సోమవారం పరిశీలించారు. ఆంధ్రకేసరి టంగటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి ఉత్సవాలు ఈ శిబిరంవద్ద ఈనెల 23వ తేదీన జరగనున్నాయి. అక్కడ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు ఎన్.శ్రీనివాసరావు, రంగారెడ్డిలు పాల్గొన్నారు.

ఆరు రోజులకొకసారి తాగునీటి సరఫరా

- ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ఏర్పాటు

- ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి

- కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణ



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్ : నగర ప్రజల తాగునీటి అవసరాలకు నిర్మించిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఇక నుంచి ఆరు రోజులకొకసారి తాగునీటి సరఫరా చేస్తున్నట్లు నగర కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణ చెప్పారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ జలాల రాక ఆలస్యమైనందున, ఉన్న నీటిని సద్వినియోగం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, నగరంలోని బావులను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలూ సహకరించి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. నీటి సమస్యను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వచ్చే నెల మొదటి వారానికి సాగర్ నీరు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

నీటి సమస్య తీవ్రతను గుర్తించి నగరంలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను వినియోగంలోకి తీసుకొస్తున్నామన్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మలో కూడా సరిపడా నీరు లేదని, దానికితోడు గుండ్లకమ్మ నుంచి నగరానికి తాగునీటి విడుదల కోసం పైపులైను పనులు జరుగుతున్నాయని, త్వరలోనే అవి పూర్తయితే భవిష్యత్‌లో ఇలాంటి సమస్య రాబోదని చెప్పారు.

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో నిరసన

-నేడు బ్యాంకర్ల సమ్మె



నిరసన తెలుపుతున్న బ్యాంక్ ఉద్యోగులు

ఒంగోలు వ్యవసాయం : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు రైల్వేస్టేషన్ రోడ్డులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 22వ తేదీ దేశవ్యాప్తంగా బ్యాంకులు చేపట్టనున్న సమ్మె ముందు రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుత ఆందోళనను కేంద్రం పట్టించుకోకపోతే సెప్టెంబరు 15వ తేదీ పార్లమెంట్ వద్ద లక్ష మంది బ్యాంకు ఉద్యోగులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పలువురు చెప్పారు. యూఎఫ్‌బీయూ కన్వీనర్ వి.పార్థసారథి, పి.కె. రాజేశ్వరరావు, సిహెచ్. శోభన్‌బాబు, వి.రామచంద్రరావు, అన్నమనేని వేణుగోపాల్, నాగరాజు, నరేంద్రబాబు, యు. వేణుగోపాల్, నరేంద్రకుమార్, కె.ఉమాదేవి, వి.రామయ్య, పి.బ్రహ్మయ్య, చలపతిరావు, కృ ష్ణారెడ్డి, ప్రసాదు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంస్థ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలి

ఒంగోలులీగల్ : జాతీయ న్యాయసేవాధికార సంస్థ నిర్దేశించిన కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు న్యాయవాదులు, పారాలీగల్ కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి. రాజావెంకటాద్రి చెప్పారు. జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థలో రిటైనర్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, జువలైన్ జస్టిస్ సంబంధిత న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లకు సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించే విధంగా అందరూ కృషి చేయాలని, కక్షిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. పారాలీగల్ వాలంటీర్లు తమ నివాస ప్రాంతాల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎ.వసుంధర, ఎన్. దేవకుమారి, జి. గాంధీ, పి.వి. రాఘవరావు, ఆర్.కళ్యాణ చక్రవర్తి, పారాలీగల్ వాలంటీర్లు వి.వి. శాస్త్రీ, వై.సురేష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు అవకాశం కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్ : నగర పాలక సంస్థ పరిధిలోని మదర్‌థెరిస్సా కాలనీలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు కమిటీ గౌరవాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి ఉంటున్నా సౌకర్యాలు లేవన్నారు. స్వచ్ఛభారత్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే రసూల్, షేక్ షఫీతో పాటు ఆ కాలనీకి చెందిన మహిళలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మహిళలు

గ్రానైట్‌పై జీఎస్‌టీ తగ్గించండి

- కేంద్రమంత్రి సుజనాను కలిసిన గ్రానైట్ అసోసియేషన్

ఒంగోలు క్రైం : గ్రానైట్‌పై విధించిన 28శాతం జీఎస్‌టీని తగ్గించాలని రాష్ట్ర గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షుడు యర్రంనేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేంద్రమంత్రి సుజనాచౌదరిని కలిసి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎ-1 కన్వెన్ హాలులో సోమవారం జరిగిన భారత విజన్ 2022 ప్రోగ్రాంలో పాల్గొనేందుకు విచ్చేసిన మంత్రికి గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు పడుతున్న కష్టాలను వివరించారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే జీఎస్‌టీ కౌన్సెలింగ్ మీటింగ్‌లో జీఎస్‌టీ తగ్గించేందుకు నిర్ణయం తీసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు ప్రసాదరెడ్డి, లగడపాటి శ్రీనివాసరావు, చలపతిరావు, సురేష్, రాధాకృష్ణ, బాలినేని సీతారామయ్య, అళ్ళ రవి, శ్రీనివాసరెడ్డి, ఉపేంద్ర, శేఖర్ ఉన్నారు.

ఒంగోలు సైన్సుసెంటర్‌ను ఏర్పాటు చేయాలని వినతి

ఒంగోలు సైన్సుసెంటర్, ప్లానిటోరియాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి సుజనాచౌదరికి ఒంగోలు సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొల్లా మధు కోరారు.

సాంఘిక సంక్షేమశాఖ డీడీ అవినీతిపై విచారణ జరపాలి

ఒంగోలు నగరం : జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మిసుధ అవినీతిపై విచారణ జరిపించాలని మీకోసం కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఫిర్యాదుచేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మికి ఓపీడీఆర్ నాయకులు చావలి సుధాకర్, దళిత మహాసభ నాయకులు టి.వెంకటస్వామి, గిరిజన హక్కుల సంఘం నాయకులు పేరం సత్యం, ఎమ్మార్పీయస్ నాయకులు టి.ఆనంద్‌మాదిగ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నాయకులు రాజేష్, మాస్ ఆర్గనైజేషన్ ప్రతినిధి శివాజీ ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఆమెపై ఏసీబీ కేసు నడుస్తోందని, ఆమెను నాన్‌ఫోకల్ పోస్టుల్లో నియమించాల్సి ఉండగా కీలకమైన డీడీ పోస్టులో నియమించారని తెలిపారు.

కరాటే పోటీల్లో జేమ్స్ విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు కలెక్టరేట్ : జపాన్ షిటోర్యు కరాటే స్కూల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన స్టేట్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్ 2017 పోటీల్లో స్థానిక జేమ్స్ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపించారు. జూనియర్ కటాస్‌లో ఎస్‌కె. అష్రీఫ్, ఎ. అమూల్య, కె. విన్సెంట్‌పాల్(కాంస్య), సీనియర్ విభాగంలో కె. నవ్య, కె. రాజేష్‌లు(కాంస్య), కె.అక్షయశ్రీ(సిల్వర్ పతకం) సాధించారు. సీనియర్స్ కటాస్ విభాగంలో వి. విజయ ప్రకాష్ (గ్రీన్‌బెల్ట్) బంగారు పతకం సాధించగా, స్పారింగ్‌లో రజత పతకం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కోచ్ డిఎస్. కుమార్‌లను ప్రిన్సిపాల్ జబీన్ అక్తర్ అభినందించారు.

సాయిబాబా విద్యార్థులు...

సాయిబాబా సెంట్రల్‌స్కూలు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకాలను సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మేజర్ సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ కల్నల్ రమణయ్యలు తెలిపారు. కుమ్మిటే అండర్ 11 విభాగంలో ఎన్. చోదిత్ బంగారుపతకం, కటాస్‌లో ఎన్. భార్గవ్ వెండిపతకాన్ని సాధించినందుకు సోమవారం వారిని అభినందించారు.

సినిమా గైడ్

థియేటర్ --- సినిమా

సత్యం --- ఫిదా
రత్నమహల్---ఆనందోబ్రహ్మ
గోపి ---జయజానకి నాయక
సాయిసరోజ్ -- లై
తులసీరాం --- జయ జానకి నాయక
జయరాం ---నిన్నుకోరి
గోరంట్ల సినిమాస్ స్క్రీన్సలలో----
నక్షత్రం, గౌతమ్‌నంద, ఆన్‌బెలి, నేనే రాజు నేనేమంత్రి, ఆనందోబ్రహ్మ

22న జాబ్ మేళా

ఒంగోలు కలెక్టరేట్ : మంగమూరు రోడ్డులోని నాగార్జున డిగ్రీ కాలేజీలో ఈనెల 22వ తేదీ ఉదయం పదిగంటలకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వి. రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయని, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు సంబంధిత పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

రేపు రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

ఒంగోలునగరం : ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 23వ తేదీన ఇంటర్వ్యూలు జరుగుతాయని కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు సయ్యద్ హిదయతుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు బుధవారం సంబంధిత మండల అభివృద్ధి అధికారులు లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో జరిగే గ్రామ సభలకు హాజరు కావాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకుని రుణం మంజూరు కాని వారు ఆన్‌లైన్ దరఖాస్తు నంబర్‌ను ఉపయోగించి దరఖాస్తు ప్రింటు తీసి దానికి పత్రాలను జతచేసి అందజేయాలని కోరారు. వివరాలకు 08592-230169 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలని ఆయన కోరారు.

28న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఒంగోలు కలెక్టరేట్ : ప్రభుత్వం గిరిజనులపై వ్యవహరిస్తున్న వివక్షను నిరసిస్తూ ఈనెల 28వ తేదీన కలెక్టరేట్ వద్ద ఆదివాసి సంఘాల జాయింట్ వర్కింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్షను చేపడుతున్నట్లు కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూడవతు విష్ణు నాయక్ తెలిపారు. స్థానిక గిరిజన సంఘాల కార్యాలయంలో నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు, ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ నాయక్, గిరిజన ప్రజాపోరాట సమితి అధ్యక్షుడు పేరం సత్యం, వివిధ సంఘాల నాయకులు ఇట్టా గురుప్రసాద్, మాల్యాద్రి, రాకేష్, నాగరాజు, మాచవరపు జూలియన్, చిరంజీవి, జాన్‌ప్రకాష్, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

డిసెంబర్ 10న నాగపూర్‌లో సమ్మేళనం

ఒంగోలు కలెక్టరేట్ : బీఎస్పీ ఆధ్వర్యంలో డిసెంబర్ 10వ తేదీన నాగపూర్‌లో జరిగే కార్యకర్తల సమ్మేళాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, చత్తీష్‌ఘడ్ రాష్ట్రాలకో ఆర్డినేటర్ ఉపాసర్ పిలుపునిచ్చారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒంగోలు చిట్టిబాబు, జే. సంగీతరావు, ఎర్రయ్య, పి. సతీష్, డేవిడ్, టి. వెంకయ్య, సామ్యేలు, పరంజ్యోతి పాల్గొన్నారు.